మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA

ఆదివారం SUNDAY 29.3.2026 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4+32 పేజీల ఆదివారం అనుబంధం Pages: 12+4+32 pages sunday supplement | సంపుటి (Volume): 15 ॥ సంచిక (Issue): 293 ॥ వెల (Price) రూ.8.00

ఏకాదశి

ఆదివారం, సూర్యోదయం: 6-13, సూర్యాస్తమయం: 6-29. శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం వసంత రుతువు చైత్ర మాసం శుక్ల పక్షం తిథి: ఏకాదశి ఉదయం 7-46 వరకు, తదుపరి ద్వాదశి. నక్షత్రం: ఆశ్లేష పగలు 2-38 వరకు. వర్జ్యం: రాత్రి 2-37 నుంచి తెల్లవారుజామున 4-14 వరకు. రాహుకాలం: సాయంత్రం 4-56 నుంచి సాయంత్రం 6-27 వరకు. దుర్ముహూర్తం: సాయంత్రం 4-49 నుంచి సాయంత్రం 5-38 వరకు. అమృతకాలం: పగలు 1-02 నుంచి పగలు 2-37 వరకు.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

ఎక్కువ కాలం కొనసాగదు!



- నెలల్లో కాదు.. వారాల్లోనే యుద్ధం ముగిస్తాం
- అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో
- గల్ఫ్ దేశాలపై కొనసాగిన ఇరాన్ దాడులు
- క్షిపణి శకలాలు పడి ఐదుగురు భారతీయులకు గాయాలు

› 8

సింగరేణి తీరుపై భగ్గుమన్న టీబీజీకేఎస్



- మెడికల్ బోర్డు ప్రారంభించాలని డిమాండ్
- అన్ని ఏరియాల్లో ధర్నా, రాస్తారోకోలు
- భూపాలపల్లిలో సీఎం దిష్టిబొమ్మ దహనం

› 8

ఆటలాడుతున్న రేవంతు..



ఓవైపు కరెంటు కోతలతో రైతులు అరిగోస పడుతున్నారు. నీళ్లందక పంటలు ఎండిపోతుంటే కాపాడుకొనేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. మరోవైపు అసెంబ్లీలో రైతు సమస్యలకు పరిష్కారం చూపాల్సిన ముఖ్యమంత్రి ఆటల్లో మునిగితేలుతున్నాడు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల స్పోర్ట్స్ కల్చరల్ మీట్‌ను శనివారం ఎల్బీ స్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు.

కష్టాల్లో ట్రాన్స్‌ఫార్మర్



అరకొర కరెంట్ మాత్రమే సరఫరా అవుతుండటంతో వ్యవసాయ మోటర్లన్నీ ఒకేసారి నడిచి అధిక లోడ్‌తో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయి. సిద్దిపేట జిల్లాలో వ్యవసాయ పొలాలకు కరెంట్ అందించే ట్రాన్స్‌ఫార్మర్ కరాబు కావడంతో సిబ్బందితో కలిసి మరమ్మతులు చేసుకుంటున్న రైతులు

అల్లాడుతున్న రైతులు.. కాంగ్రెస్ సర్కార్‌లో దిక్కైన ట్యాంకర్



కరెంటు కోతలతో నీళ్లు పారక వరి పంటను కాపాడుకునేందుకు రైతులు పడుతున్న కష్టానికి అద్దం పడుతున్నదీ చిత్రం.. నల్లగొండ జిల్లా మునుగోడు మండలం ఊకొండి గ్రామంలో వరి పొలానికి ట్యాంకర్ ద్వారా నీటిని పారిస్తున్న రైతు బోయపల్లి రాజు

కేసీఆర్ ఉన్నప్పుడే బాగుండె

బీఆర్ఎస్ పాలనలో ఎవుసానికి నిరంతర కరెంటు

పదేండ్లు రందిలేకుండె

కేసీఆర్ హయాంలో 24 గంటల కరెంట్ ఇచ్చిండు. పొలం మొత్తం తడిసేదాకా మోటర్ నడిపినం. ఇంటికాడ ఉండి పొలాలు రందిలేకుండ పారించినం. రాత్రిపూట పొలంకాడికి పోయే బాధ లేకుండె. కాంగ్రెస్ వచ్చి అంతా ఆగం చేసింది. నేను ఆరెకరాల్లో వరి సాగు చేస్తున్న. రాత్రి 12 గంటల నుంచి సాయంత్రం 5 గంటల దాకా ఉండాల్సిన కరెంట్ ఎప్పుడస్తదో, ఎప్పుడు పోతదో తెలుస్తలేదు. శనివారం రాత్రి 12 గంటలకు రావాల్సింది 3 గంటలకచ్చింది. మళ్ల పాత రోజుల్లెక్క కరెంటు కోతలు నిత్యకృత్యమైనయ్. సరిపోను కరెంటు లేక నీళ్లందక పొలం ఎండిపోతాంది. ఓ మడికి ఇయ్యాల.. ఓ మడికి రేపు అని పారించుకుంట పోతున్నం. మార్చిలోనే ఇట్ల ఉంటే మున్ముందు ఎట్లుంటదో తలచుకుంటెనే భయమైతాంది

- రాళ్లబండి స్వామి, కోటపల్లి, మంచిర్యాల జిల్లా



- సాగుకు నిరంతర కరెంట్ సరఫరాతో కొత్త రికార్డులు
- ఇంటికాడి నుంచే పొలాలు పారించుకున్న అన్నదాతలు
- కాళ రాత్రులు పోయి గుండెపై చెయ్యేసుకొని బతికిన రైతులు
- 24 నెలల పాలనలోనే కరెంట్ కష్టాలు తీసుకొచ్చిన కాంగ్రెస్
- పంటలను అమాంతం మింగేస్తున్న అనధికారిక కోతలు
- కరెంట్ సరఫరాలో 13 నుంచి 14 గంటల పాటు కట్
- విద్యుత్తు వెతలతో పంటలు బేజారు.. రైతుల దిగాలు
- ట్యాంకర్ల నీటితో పంటను కాపాడుకొంటున్న కర్షకులు
- ఎట్లుండె తెలంగాణ ఎట్ల తెర్లయిపాయెనని ఆవేదన
- మార్చిలోనే ఇట్లుంటే, మేలో పరిస్థితేందని ఆందోళన

నిన్నటి కరెంట్ కథ

కర్షక దేశమైన మన భరత జాతి ఏకైక ఆకాంక్ష.. సుజలాం.. సుఫలాం.. సస్యశ్యామలాం. ఏడు దశాబ్దాల స్వతంత్ర భారతావనిలో దాన్ని సాకారం చేసిన ధీరుడు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు. తెలంగాణ ఆవిర్భావానంతరం తొమ్మిదిన్నరేండ్ల పాలనలో రెప్పపాటు కోతలు లేని కరెంటుతో రాష్ట్రాన్ని వెలుగుల దివ్వెగా మార్చారు. సాగునీటి ప్రాజెక్టులతో తెలంగాణను సుజలం చేశారు. కేసీఆర్ దూరదృష్టితో దేశానికే అన్నంపెట్టే తల్లిగా సుఫలమైన తెలంగాణ.. సాగుభూమి వృద్ధిలో సస్యశ్యామల గడ్డగా అవతరించింది. బీఆర్ఎస్ ఏలుబడిలో సాగు పండుగవ్వడంతో అన్నదాత ముఖాలు చిరునవ్వుతో తొణికిసలాడాయి. దిగుబడులు పెరిగి కీసల నిండా పైసల గలగలలు వినిపించాయి.వలసలు, ఆత్మహత్యలు అనే మాటలే వినిపించకుండా పోయాయి.

నేటి కన్నీటి వెత

కేసీఆర్ స్వర్ణయుగంలో వెక్కిరించిన ఆంధ్రోళ్లనే వెనక్కి నెట్టిన తెలంగాణ ఇప్పుడు రేవంత్ ప్రభుత్వంలో మళ్లీ తెర్లయిపోయింది. ఉమ్మడిపాలనలో ఎదుర్కొన్న చీకటి రోజులు మళ్లీ ముంచుకొచ్చాయి. కాంగ్రెస్ పగ్గాలు చేపట్టిన రోజు నుంచే రాష్ట్రానికి కానికాలం, కష్టకాలం దాపురించింది. కరెంటు కోతలతో కాపుకొచ్చిన పంట ఎండిపోవడాన్ని చూడలేక సమస్త రైతాంగం ప్రతీ దినం కన్నీటి శిస్తును చెల్లిస్తున్నది. అప్పులే పెట్టుబడిగా, కన్నీళ్లే దిగుబడిగా.. దిగాలుపడ్డ రైతన్న ఎండిన పొలంలోనే కూలబడుతున్నాడు. తొమ్మిదిన్నరేండ్లు రెప్పపాటైనా పోని కరెంటు.. ఇప్పుడు మళ్లీ అరిగోస పుచ్చుకొంటున్నది. అడుగంటిన బోర్లు.. కాలుతున్న మోటర్లు.. గుంటెడు భూమిని తడిపేందుకు పొలాల్లోకి ట్యాంకర్లు.. వెరసి తెలంగాణ రైతాంగం మళ్లీ ఇప్పుడు ఆగమైతున్నది. కరెంట్ కష్టాలతో కకావికలమవుతున్నది. › 2,3

అసెంబ్లీలో 'క్రషర్ బాంబ్' బ్లాస్ట్

మైనింగ్ మంటలు

పొంగులేటి అక్రమాలపై దద్దరిల్లిన సభ



రాఘవ కన్‌స్ట్రక్షన్స్ బరితెగింపు

జీవో 111 పరిధిలోనే అక్రమంగా స్టోన్ క్రషర్లు హైదరాబాద్ నడిబొడ్డున యథేచ్ఛగా అక్రమ మైనింగ్

- నిబంధనలు తుంగలో తొక్కి దందా చేస్తున్నరు
- కొత్వాల్‌గూడలో కాలుష్య పరిశ్రమలేవీ పెట్టొద్దు
- కానీ డీజిల్ జనరేటర్లతో భారీ క్రషర్ నడుపుతున్నరు
- కంపెనీ 2 సార్లు పట్టుబడ్డా సర్కార్ మౌనమెందుకు?
- ధైర్యముంటే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించండి
- పొంగులేటి రాజీనామా చేసి విచారణ ఎదుర్కోవాలి
- రక్షకుడే భక్షకుడిలా మారిన దుస్థితి దాపురించింది
- సభలో బీఆర్ఎస్‌ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్
- తాను చెప్పింది తప్పయితే ఉరి తీయాలని సవాల్

› 6

- జీవో 111 పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా స్టోన్ క్రషర్ నడుపుతున్నారని బీఆర్ఎస్ ఆగ్రహం
- సిట్టింగ్ జడ్జితో విచారణ, హౌస్ కమిటీకి డిమాండ్
- పొంగులేటి రాజీనామాకు బీఆర్ఎస్ సభ్యుల పట్టు
- తప్పు చెయ్యకుంటే భయమెందుకని నినాదాలు
- స్పీకర్ పోడియం వద్ద కింద కూర్చొని నిరసన
- చీఫ్ మార్షల్, 12 మంది మార్షల్స్‌తో అడ్డగింత
- చప్పట్లు.. నినాదాలతో హోరెత్తించిన బీఆర్ఎస్
- రెండు గంటలు సభను స్తంభింపజేసిన ప్రతిపక్షం
- అర్ధాంతరంగా అసెంబ్లీని వాయిదా వేసిన స్పీకర్

రాఘవపై సీబీసీఐడీ విచారణ

- కంపెనీ తప్పు చేసింది.. పన్నులు వసూలు చేశాం
- 2014 నుంచి మైనింగ్ లీజులపై ఎంక్వైరీ చేయిస్తం
- నిజాలు నిగ్గు తేల్చి ఒక్కొక్కడి సంగతి తేలుస్తా
- సభలో మైనింగ్ రచ్చపై సీఎం రేవంత్‌రెడ్డి

› 6

> కంచే.. చేను మేసిన విధంగా.. రక్షకుడే భక్షకుడైతే ఏం జరుగుతుందో అలాంటి పరిస్థితే ఇవాళ రాష్ట్రంలో దాపురించింది. జీవో 111 పరిధిలోని శంషాబాద్ మండలం కోత్వాల్‌గూడలో ఎలాంటి కాలుష్య పరిశ్రమలు పెట్టకూడదని నిబంధనలున్నా అక్కడ రాఘవ కన్‌స్ట్రక్షన్స్ భారీ స్టోన్ క్రషర్‌ను డీజిల్ జనరేటర్లతో యథేచ్ఛగా నడుపుతున్నది. –హరీశ్‌రావు

హైదరాబాద్, మార్చి 28(నమస్తే తెలంగాణ) : రాఘవ కన్‌స్ట్రక్షన్స్ ద్వారా పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అనేక అక్రమాలకు పాల్పడుతున్నారని, ఆయన మంత్రిగా ఉండేందుకు నైతికంగా అనర్హుడని, తక్షణం రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పట్టుబట్టారు. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ ద్వారా నిబంధనలకు విరుద్ధంగా అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్న పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చట్టప్రకారం శిక్షార్హుడని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. ఆయన అక్రమాలపై తక్షణం 'అసెంబ్లీ హౌస్ కమిటీ' వేసి విచారణ చేపట్టాలని నినదించారు. అసెంబ్లీలో గురువారం మైనింగ్ పద్దుపై చర్చ సందర్భంగా బీఆర్ఎస్ ఎల్పీ ఉపనేత హరీశ్‌రావు మాట్లాడుతూ 111 జీవోను తుంగలో తొక్కి యథేచ్ఛగా ప్రకృతి విధ్వంసానికి పాల్పడుతున్న రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అక్రమాలను, నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ప్రజాధనం లూటీని ఆధారాలతో సభ ముందు పెట్టారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా డీజిల్ జనరేటర్లతో క్రషర్స్ నడుపుతూ గుట్టలు ధ్వంసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండుసార్లు నిబంధనలకు విరుద్ధంగా పట్టుపడితే రూ.25వేల జరిమానాతో పాటు ఏడాది జైలు శిక్ష విధించాలని చట్టం చెప్తున్నా.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ నిర్వాహకులను ఎందుకు ఉపేక్షిస్తున్నదని ప్రశ్నించారు. దీనిపై కాంగ్రెస్ సభ్యులు అభ్యంతరం తెలుపడంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొన్నది.సభలో మాజీ మంత్రి హరీశ్‌రావుకు మంత్రులు పదేపదే అడ్డుతగిలారు. తమ మంత్రి పొంగులేటినే అంటున్నారని కాంగ్రెస్ మంత్రులు వాగ్వాదానికి › 6వ పేజీలో



శనివారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో కలిసి మాట్లాడుతున్న బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్

మూసీ ముసుగులో లక్షన్నర కోట్ల అవినీతి

- ప్రజలను భయపెడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి
- కాంగ్రెస్ నడిపేది సర్కారా? రౌడీ దర్బారా?
- పిచ్చోడి చేతిలో రాయి కాదు.. రాష్ట్రమే ఉన్నది
- ఈ శతాబ్దపు మోసం అభయహస్తం మ్యానిఫెస్టో
- అరాచకాలను అడ్డుకునేందుకు సిద్ధంకావాలి
- ఇంటింటికీ వెళ్లి వివరించి ప్రజల్లో చైతన్యం తేవాలి
- బీఆర్ఎస్వీ నేతలకు కేటీఆర్ దిశానిర్దేశం

హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ): స్కాములపై ప్రశ్నిస్తే సీఎం రేవంత్ బెదిరింపులకు దిగుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. అసెంబ్లీలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మైనింగ్ అక్రమాలను ప్రశ్నించిన సందర్భంలో కూడా ప్రతిపక్షాన్ని బెదిరించే ధోరణి ప్రదర్శించారని మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు అడిగితే విజిలెన్స్ కేసులు, ప్రతిపక్షంగా తాము నిలదీస్తే బెదిరిస్తున్నారని, కాంగ్రెస్ నడిపేది సర్కారా.. రౌడీ దర్బారా? అని నిలదీశారు. రేవంత్ రెడ్డికి బెదిరింపులకు బీఆర్ఎస్ ఎప్పటికీ భయపడదని కేటీఆర్ › 5లో

సముద్ర తీరం లేని ఏకైక రాష్ట్రం తెలంగాణ!

మూసీ సుందరీకరణ పనులకు శంకుస్థాపనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి › 5


ఆశావర్కర్ల అరెస్టు

- 'చలో హైదరాబాద్'ను అడ్డుకున్న పోలీసులు
- అరెస్టులతో అట్టుడికిన ఆర్టీసీ క్రాస్ రోడ్స్
- పలువురు ఆశా కార్యకర్తలకు గాయాలు
- మద్దతుగా ధర్నాలో పాల్గొన్న ఎమ్మెల్యే పల్లా
- పల్లాను అసెంబ్లీకి తరలించిన పోలీసులు
- ఆశావర్కర్లపై అణచివేత తగదు: జాన్‌వెస్లీ

› 11

సర్కార్‌లో

'ఎవని జాగీరు' ప్రకంపనలు



తమ భూముల్ని కాపాడుకునేందుకు ఏం చేయాలనే దానిపై శనివారం సమావేశమైన రైతులు, హాజరైన రైతు సంఘం, సీపీఎం నాయకులు

- 6 వేల కోట్ల ప్రభుత్వ భూముల దందాపై 'నమస్తే తెలంగాణ'లో ప్రత్యేక కథనం
- రెవెన్యూ, మున్సిపల్ శాఖల్లో తీవ్ర చర్చ
- రంగారెడ్డి కలెక్టర్‌ను నివేదిక కోరిన ప్రభుత్వం
- నిర్మాణ అనుమతులు ఇవ్వొద్దని ఆదేశం
- తెరవెనుక సూత్రధారుల వ్యూహాత్మక మౌనం
- కంపెనీల నుంచి భూముల్ని కాపాడుకొనేందుకు నాదర్‌గుల్ గ్రామ పరిధిలోని రైతుల సమావేశం
- కంపెనీ ఇచ్చే డబ్బుకు లొంగొద్దని నిర్ణయం
- భూములు దక్కేవరకు పోరాడాలని ప్రతిన
- బెదిసికొట్టినా ఉన్నతాధికారుల చర్యలేవీ?

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి/బడంగ్‌పేట, మార్చి 28 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి నాదర్‌గుల్ పరిధిలో రూ.6 వేల కోట్ల విలువైన భూముల బిగ్ దందాపై 'ఎవని జాగీరు!' అన్న శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో శనివారం ప్రచురితమైన ప్రత్యేక కథనం రాష్ట్ర సర్కార్‌లో ప్రకంపనలు పుట్టించింది. ప్రధానంగా రెవెన్యూ, మున్సిపల్ శాఖలతోపాటు అధికార యంత్రాంగంలో విస్తృతస్థాయి చర్చకు దారితీసింది. ఈ నేపథ్యంలో అసలు నాదర్‌గుల్ భూముల్లో ఏం జరుగుతుంది? అన్న అంశంపై సమగ్ర వివరాలు ఇవ్వాల్సిందిగా ప్రభుత్వం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డిని ఆదేశించినట్టు విశ్వసనీయంగా తెలిసింది. దీంతో రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం నాదర్‌గుల్ గ్రామ పరిధిలోని సర్వేనంబరు 613 (119)లో రూ.6 వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూముల › 7వ పేజీలో



ఏఐ కంపెనీలపై పన్ను!

- 'పీపుల్ క్రెడిట్స్' పేరుతో వసూలు చేయాలట
- మరోసారి సీఎం రేవంత్‌రెడ్డి విచిత్ర వ్యాఖ్యలు
- ఏఐ వినియోగిస్తున్న కంపెనీలకు శిక్ష వేస్తారా?
- ముఖ్యమంత్రి వ్యాఖ్యలపై ఐటీ నిపుణుల ఫైర్

హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ) : 'కృత్రిమ మేధ(ఏఐ)తో ఉపాధి కోల్పోయే వారిని ఆదుకునేందుకు ఏఐ సంస్థలపై పన్ను విధించాలి. కాలుష్యానికి 'కార్బన్ క్రెడిట్స్' వసూలు చేసినట్టే, ఏఐ కంపెనీలకు 'పీపుల్ క్రెడిట్స్' పేరిట పన్ను విధించాలి' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తాజాగా చేసిన వ్యాఖ్యలు ఇవి. ప్రపంచం మొత్తం › 5వ పేజీలో



కరెంట్ కోత.. రైతన్న వెత



ఓ రైతన్నా.. ఇద్దరి పాలనలో వైరుధ్యాన్ని గమనించావా?

కేసీఆర్ పాలనలో నిప్పులు కురిపించే మే నెలలో పవర్ కట్స్-0

రేవంత్ పాలనలో మార్చిలోనే విద్యుత్తు కోతలు-13 నుంచి 14 గంటలు

దేశంలో పరిస్థితి ఇదీ..

- దేశంలో రోజూ సగటున సాగు రంగాన్ని విడిచిపోతున్న రైతులు: 2,000
- సాగు రంగ నష్టాలను భరించలేక ఉరికొయ్యకు వేలాడుతున్న రైతు: ప్రతీ 45 నిమిషాలకు ఒకరు
- స్వాతంత్య్రం సిద్ధించిన 75 ఏండ్లలో దేశవ్యాప్తంగా పెరిగిన సాగు విస్తీర్ణం: 6.7 శాతం
- నిరంతర విద్యుత్తుతో కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో పెరిగిన సాగు విస్తీర్ణం: 65 శాతం

తొమ్మిదిన్నరేండ్లలో తెలంగాణ రైతాంగానికి కేసీఆర్ ఏం చేశారంటే?

వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు కోసం చేసిన ఖర్చు **75** వేల కోట్లు

విద్యుత్తు సబ్సిడీ కోసం వెచ్చించిన మొత్తం **37** వేల కోట్లు

విద్యుత్తు సంస్థల బలోపేతానికి చేసిన ఖర్చు **39** వేల కోట్లు



నల్లగొండ జిల్లా మునుగోడు మండలం పులి పలుపుల గ్రామంలో ఎండిపోయిన వరి చేనులో పశువులను మేపుతున్న రైతు

Grok
విద్యుత్తు కోతలు.. సర్కార్ వైఫల్యమే: గ్రోక్

కేసీఆర్ తొమ్మిదిన్నరేండ్ల పాలనలో వ్యవసాయానికి 24 గంటల పాటు నిరంతరాయ విద్యుత్తును సరఫరా చేయడంతో తెలంగాణలో సాగు రంగం గణనీయమైన పురోగతి సాగించింది. రేవంత్ ప్రభుత్వ పాలనలో విద్యుత్తు కోతలు పెరుగుతున్నట్టు అర్థమవుతున్నది. మౌలిక వసతులు ఉన్నప్పటికీ, డిమాండ్‌కు సరిపడా విద్యుత్తు సరఫరాను చేయకపోవడం సర్కార్ వైఫల్యంగానే చెప్పొచ్చు. కరెంట్ కోతలు నిలిపేయాలంటూ నిర్మల్, కరీంనగర్ జిల్లాల్లో మార్చి తొలివారంలో పలువురు రైతులు సబ్‌స్టేషన్ల ఎదుట నిరసనలు తెలుపడం రాష్ట్రంలో కరెంట్ కష్టాలకు అద్దంపడుతున్నది.

కేసీఆర్ ఉన్నప్పుడే బాగుండె

బీఆర్ఎస్ పాలనలో ఎవుసానికి రందిలేకుండా కరెంటు

సాగుకు నిరంతర కరెంట్ సరఫరాతో కొత్త రికార్డులు

- ఇంటికాడి నుంచే పొలాలు పారించుకున్న అన్నదాతలు
- కాళరాత్రులు పోయి గుండెపై చెయ్యేసుకొని బతికిన రైతులు
- 24 నెలల పాలనలోనే కరెంట్ కష్టాలు తీసుకొచ్చిన కాంగ్రెస్
- పంటలను అమాంతం మింగేస్తున్న అనధికారిక కోతలు
- కరెంట్ సరఫరాలో 13 నుంచి 14 గంటల పాటు కట్
- విద్యుత్తు వెతలతో పంటలు బేజారు.. రైతుల దిగాలు
- ట్యాంకర్ల నీటితో పంటను కాపాడుకొంటున్న కర్షకులు
- ఎట్లుండె తెలంగాణ ఎట్ల తెర్లయిపాయెనని ఆవేదన
- మార్చిలోనే ఇట్లుంటే, మేలో పరిస్థితేందని ఆందోళన

హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ)/(స్పెషల్ టాస్క్ బ్యూరో): పొద్దుగాల ఐదింటికి నిద్ర లేవాలి.. పొలానికి పోవాలి.. ఆటోమెటిక్ స్టార్టర్ ఆన్‌చేయాలి. పశువులకు మేత పెట్టి పాలు పిండుకుని మళ్లీ ఇంటిబాట పట్టాలి. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో రైతుల దినచర్య ఇది. ఒకవేళ స్విచ్చు ఆఫ్ చేయడం మరిచిపోతేనో.. లేక ఏదో పనుండి ఇంటిపట్టునే ఉంటేనో పక్కపొంటి పొలం రైతుకు ఫోన్ చేసి 'అన్నా.. గా స్విచ్చు బంద్ జెయ్యే' అనేంత ధీమా ఉండేది. కేసీఆర్ సర్కారు వ్యవసాయానికి ఇచ్చిన నిరంతర నాణ్యమైన విద్యుత్తుయే ఈ భరోసాకు కారణం. మరిప్పుడేం జరుగుతున్నది?? అర్ధరాత్రి అపరాత్రి అనే తేడా లేకుండా టార్చిలైట్లు పట్టుకొని రైతన్న పొలానికి పరుగులు పెడుతున్నాడు. అవసరమైతే అక్కడే నిద్రచేస్తున్నాడు. ఆన్ చేసినా మోటార్ ఎంత సేపు నడుస్తుందో తెలియదు. ఎడాపెడా కొనసాగుతున్న విద్యుత్తు కోతలతో పంటలెండిపోతుంటే, దాన్ని చూడలేని రైతన్నలు డబ్బులు చెల్లించి ట్యాంకర్లతో మడిని తడి చేయాల్సిన దుస్థితి. కేసీఆర్‌హయాంలో చీకట్లను చీల్చిన ఒకప్పటి విద్యుత్తు వెలుగుల తెలంగాణ ఇప్పుడు మసకబారిపోతున్నది. ఆనాటి కాంతిరేఖలు ఇప్పుడు కనుమరుగైపోతున్నాయి. హై టెన్షన్ తీగల్లో ఉండాల్సిన టెన్షన్.. ఇప్పుడు తెలంగాణ రైతన్నను పట్టి పీడిస్తున్నది. పంటల్లో జీవం వట్టిపోతున్నది. మండే ఎండకు పొట్టకొచ్చిన పంట నేల చూపులు చూస్తున్నది. రేవంత్ పాలనలో కొనసాగుతున్న కరెంట్ కోతలతో అన్నదాతల వెతలకు నిదర్శనమిది.

కష్టాలు అన్నీ ఇన్నీ కావు

'తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా విడిపోతే అంధకారమవుతది' అని నాటి ఉమ్మడి రాష్ట్ర చివరి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి హేళనగా మాట్లాడారు. తెలంగాణ వస్తే పవర్‌కట్ అయితదని పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ కూడా ఇచ్చారు. అయితే, కేసీఆర్ దార్శనికతతో తొమ్మిదిన్నరేండ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ వెలుగులీనింది. పొరుగునున్న ఏపీనే ముక్కున వేలేసుకొనేలా వ్యవసాయానికి నిరంతరాయ విద్యుత్తు సరఫరా చేసింది. అయితే, ఇదంతా నిన్నటి ముచ్చట. రెండున్నరేండ్ల రేవంత్ పాలనలో తెలంగాణలో మళ్లీ కరెంట్ కోతలు నిత్యకృత్యంగా మారాయి. అప్రకటిత కోతలు రైతుల ఉసురు తీస్తున్నాయి. ప్రత్యేకించి సాగుకు త్రీఫేజ్ విద్యుత్తుకు ప్రస్తుతం తీవ్ర కటకట నెలకొన్నది. కేసీఆర్ పాలనలో వ్యవసాయానికి 24 గంటలపాటు నిరంతరాయ విద్యుత్తు సరఫరా జరగ్గా.. ఇప్పుడు 10-14 గంటలకు మించి కరెంట్ ఇవ్వడం లేదు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఏకంగా 8 గంటలు కోతపెడుతున్నారు. కొన్ని జిల్లాల్లో అయితే 10-12 గంటలకు మించి కరెంట్ సరఫరా జరుగడంలేదు. ఎండల నేపథ్యంలో విద్యుత్తుకు డిమాండ్ పెరిగింది. అయితే, ముందస్తు ప్రత్యామ్నాయ చర్యలను చేపట్టడంలో ఎప్పటిలాగే విఫలమైన కాంగ్రెస్ సర్కారు.. డిమాండ్‌ను తీర్చాలన్న సాకుతో వ్యవసాయానికి సరఫరాను తగ్గిస్తున్నది. ఒకరకంగా సాగుకు అవసరమైన మేరకు విద్యుత్తును ఇవ్వలేక చేతులెత్తేస్తున్నది. రాష్ట్రంలో అనేక ఫీడర్లకు విద్యుత్తు సరఫరాను అధికారులు తగ్గిస్తున్నట్టు రిపోర్టులు వస్తున్నాయి. మొన్నటివరకూ 16 నుంచి 17 గంటలు విద్యుత్తు మాత్రమే ఇవ్వగా, ఇప్పుడు ఆ సరఫరా వ్యవధిని మరింతగా తగ్గిస్తున్నారు. చాలా జిల్లాల్లో అయితే 12 గంటలే ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. ఫలితంగా కరెంట్ కోతలు తెలంగాణ రైతన్నకు కొత్త వెతలు తెచ్చి పెడుతున్నాయి. ఆరుగాలం శ్రమించిన అన్నదాతకు కష్టకాలాన్ని మిగులుస్తున్నాయి. ఇప్పటికే పంటలు ఎదిగాయి. వరి కంకి దశలో ఉంది. ఇంకో పదిహేను రోజులు గడిస్తే చాలు గండం గడిచినట్టేనని అన్నదాత అనుకొంటున్న సమయంలో కరెంట్ కోతలు తీరని దుఃఖాన్నే మిగులుస్తున్నాయి. కరెంట్ లేక.. పొలాలు పారక రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఎండిన దుక్కులకు, తడి ఆరిన వరిచేలకు ప్రాణం పోసేందుకు అరిగోసపడుతున్నారు.

కోతలకు కేరాఫ్ కాంగ్రెస్

అన్ని రంగాలకూ కరెంట్ జీవనాడి వంటింది. అన్నంపెట్టే సాగురంగానికి ఇదే కల్పతరువు. అలాంటి కీలక విద్యుత్తు వ్యవస్థ కాంగ్రెస్ పాలనలో కకావికలమవుతున్నది. 'కాంగ్రెస్ వచ్చింది.. కారుచీకట్లు తెచ్చింది' అన్నట్టుగానే ఇప్పుడు పరిస్థితి తయారయ్యింది. బీఆర్ఎస్ హయాంలో వెలుగులు విరజిమ్మిన తెలంగాణలో ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో కారుచీకట్లు కమ్ముకుంటున్నాయి. రెండున్నరేండ్ల వ్యవధిలో విద్యుత్తు రంగాన్ని పట్టించుకోకపోవడం, ముందస్తు ప్రణాళికలు లేకపోవడం, ఉదాసీనత వెరసి రాష్ట్రంలో ప్రజలకు, రైతులకు మళ్లీ కరెంట్ కష్టాలు మొదలయ్యాయి. ఎండలు పూర్తిగా ముదురకముందే మార్చిలోనే అప్రకటిత కోతలు ప్రారంభమయ్యాయి. ఒకవైపు భూగర్భ జలాలు అడుగంటడం, మరోవైపు చాలీచాలని కరెంట్‌తో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పంటలు ఎండిపోతున్నాయి. గత్యంతరంలేని పరిస్థితుల్లో సొంత డబ్బులతో అన్నదాతలు ట్యాంకర్లతో మడిని తడుపుతున్నారు. ఆ స్థోమత కూడా లేని కర్షకులు 'కరెంటో రామచంద్రా' అంటూ ప్రభుత్వాన్ని వేడుకొంటున్నారు. మార్చిలోనే కరెంట్ కోతలు ఇలా ఉంటే, రానున్న మేలో పరిస్థితేంటని పలువురు రేవంత్ సర్కారును నిలదీస్తున్నారు.

రైతాంగానికి రాజకీయాలు అద్దడమేంటీ?

'నీది ఏ రాజకీయ పార్టీ' అని అడిగి ఏ రైతు కూడా తిండి గింజను పండించడు. తనోడైనా, పగోడైనా అన్నం పెడ్తాడు. అదే అన్నదాతకు ఉన్న గొప్పతనం. అయితే, రాజకీయాల మత్తులో తూగుతున్న కాంగ్రెస్ సర్కారు రైతన్నల పట్ల కూడా వివక్షను ప్రదర్శిస్తున్నది. ఒక్కో జిల్లాలో రైతులను ఒక్కోరకంగా చూస్తున్నది. ప్రతిపక్ష నేతల మీద కక్ష పెంచుకుని.. రైతుల ఉసురుపోసుకొంటున్నది. సాగుకు సరిపడా కరెంట్ లేక రైతులు అవస్థలు పడుతుంటే.. ప్రతిపక్ష ఎమ్మెల్యేలపై పగ పెంచుకొన్న అధికార పక్షం.. వాళ్లను టార్గెట్ చేయాలన్న ఉద్దేశంతో ఆయా నియోజకవర్గాల్లో కోతలను మరింత తీవ్రం చేస్తున్నది. ప్రత్యేకించి కొన్ని జిల్లాల పట్ల తీవ్ర వివక్షను చూపుతూ త్రీఫేజ్ విద్యుత్తుకు భారీగా కోతలు పెడుతున్నది. ముఖ్యంగా బీఆర్ఎస్‌కు పట్టున్న సిద్దిపేట జిల్లాలో.. రోజులో సగం కాలంపాటు కోతలే రాజ్యమేలుతున్నాయి. 12 గంటల కరెంటును సరఫరా చేస్తున్నట్టు రికార్డుల్లో నమోదు చేస్తున్నా.. మధ్యలో అంతరాయం, లైన్‌కట్ వంటి సమస్యలతో మరికొన్ని గంటలకు కోతలను పెంచుతున్నారు. దీంతో ఆ కొంత మేర సరఫరా అయ్యే కరెంట్ తమ పంటలకు ఏ మాత్రం సరిపోవట్లేదని రైతులు వాపోతున్నారు. ఇక దుబ్బాక నియోజకర్గంలో మరో దీన పరిస్థితి కనిపిస్తున్నది. ఇక్కడి చాలా ప్రాంతాల్లో తెల్లవారుజామున 3.30గంటల నుంచి త్రీఫేజ్ సరఫరా ప్రారంభమవుతున్నది. దీంతో చేతికొచ్చిన పంటను కాపాడుకునేందుకు నిద్రాహారాలు మాని రైతులు పొలాల దగ్గరే పడిగాపులుకాస్తున్నారు. సిద్దిపేట జిల్లాలో పరిస్థితి ఇలా ఉంటే, నిజామాబాద్ జిల్లాలో మాత్రం వేరుగా కనిపిస్తున్నది. ఇక్కడ రోజుకు 16 - 17 గంటల విద్యుత్తును సరఫరా చేస్తున్నారు. కామారెడ్డి జిల్లాలోనూ 16 గంటల విద్యుత్తును ఇస్తున్నారు. దీంతో కామారెడ్డికో రూల్.. సిద్దిపేటకో రూలా? అంటూ పలువురు రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇదేం వివక్ష ? రైతులు ఎక్కడైనా రైతులే కదా..? రైతాంగానికి రాజకీయాలు అద్దడమేంటీ?? రైతు ప్రభుత్వమంటే ఇదేనా..? అంటూ రేవంత్ ప్రభుత్వాన్ని దుమ్మెత్తిపోస్తున్నారు.

ఉత్తర తెలంగాణ ఆగమాగం

ఉత్తర తెలంగాణ జిల్లాల్లో కరెంట్ కోతలు మరింత తీవ్రమయ్యాయి. ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో కరెంట్ కోతలు రైతన్నను కలవరపెడుతున్నాయి. మరీ ముఖ్యంగా ఈ ఏడాది ఉమ్మడి కరీంనగర్ జిల్లాల్లో విద్యుత్తు డిమాండ్ భారీగా పెరిగింది. శనివారం ఒక్కరోజే 2,100 మోగావాట్ల విద్యుత్తు డిమాండ్ నమోదయ్యింది. 2025లో ఇదే రోజున విద్యుత్తు డిమాండ్ 1,475 మెగావాట్లు మాత్రమే. ఉమ్మడి వరంగల్ జిల్లాలో నిరుడు 1,300 మెగావాట్ల డిమాండ్ ఉండగా, ఈ ఏడాది డిమాండ్ 1,450 మోగావాట్లకు పెరిగింది. ఇదేకాకుండా సంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల్లో సాయంత్రం 5 గంటల తర్వాత సింగిల్ ఫేజ్‌కు మార్చేస్తున్నారు. ఇక స్వరాష్ట్రంలో విద్యుత్తు సరిపోకపోవడంతో చేబదులు (స్వాపింగ్) రూపంలో ఉత్తరాది రాష్ట్రాల నుంచి విద్యుత్తును కొనుగోలు చేసే పరిస్థితి ప్రస్తుతం తలెత్తింది.



కరీంనగర్ జిల్లాలో లో వోల్టేజ్ కారణంగా విద్యుత్ మోటర్లు కాలిపోవడంతో మరమ్మతుల కోసం రీవైండింగ్ షాపు ఎదుట నిరీక్షిస్తున్న రైతులు

విద్యుత్తు సంస్థల బలోపేతానికి 9 ఏండ్లలో కేసీఆర్ ప్రభుత్వం చేసిన ఖర్చు (రూ. కోట్లలో)

సంవత్సరం	ట్రాన్స్‌మిషన్‌లు	డిస్కంలు
2014-15	1,312.32	1,811
2015-16	1,731.05	2,396
2016-17	2,511.29	3,058
2017-18	2,985.79	2,526
2018-19	3,544.76	2,754
2019-20	2,123.05	1,898
2020-21	1,891.94	1,606
2021-22	2,174.88	1,856
2022-23	1,678.31	1,434
2023-24 (ఏప్రిల్ 30నాటికి)	28.75	-
	19,982.14	19,338.57

మొత్తం రూ. 39,320.71 కోట్లు

కరెంట్ కష్టాలకు రుజువులివిగో..!

- అనధికార కరెంట్ కోతలతో మెదక్ జిల్లాలోని వాడి, రాజ్‌పల్లి గ్రామాల్లో పంటలెండిపోయినట్టు అక్కడి రైతులు చెబుతున్నారు. మరో 15 రోజులైతే పంటచేతికొస్తుందని, ఈ తరుణంలో కరెంట్ సక్రమంగా ఇవ్వకపోవడంతో తాము నష్టపోతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
- కాంగ్రెస్ హయాంలో కరెంట్ కష్టాల గురించి తాను ముందే అంచనా వేసినట్టు మెదక్‌కు చెందిన ఓ రైతు అన్నారు. ఈ క్రమంలోనే తాను మూడు ఎకరాలు సాగుచేయడం తగ్గించుకున్నట్లు చెప్పారు. తనలాగే జిల్లాలోని పలువురు రైతులు రెండు, మూడు ఎకరాల సాగును తగ్గించుకున్నట్టు ఈ సందర్భంగా తెలిపారు.
- వరి కంకులు ముదిరే దశలో రేవంత్ ప్రభుత్వం విధిస్తున్న కరెంట్ కోతలతో మొత్తం వరి పొలమే ఎండిపోయినట్టు సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట భూంపల్లి మండలంలోని ఖాజీపూర్ గ్రామ రైతు బత్తుల శామ్యూల్ వాపోయాడు.
- కరీంనగర్ జిల్లాలోని నుస్తులాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో రాత్రి 12.30గంటల ప్రాంతంలో త్రీఫేజ్ కరెంట్ ఇస్తున్నారు. ఈ సబ్‌స్టేషన్ పరిధిలో రోజుకు 9-10 గంటల పాటు కరెంట్ కోతలు కొనసాగుతున్నాయి. దీంతో నిద్రమానుకుని అర్ధరాత్రి పొలాలకు పరుగులు తీయాల్సి వస్తున్నదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- మెదక్ జిల్లా హవేలి ఘన్‌పూర్ మండలంలో బోగడ భూపతిపూర్‌లో రోజూ 13-14 గంటల పాటు విద్యుత్తు కోతలు కొనసాగుతున్నట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మాత్రమే కరెంట్‌ను సరఫరా చేస్తున్నారని, ఈ సమయంలోనూ మధ్యలో కోతలు విధిస్తున్నారని ఆరోపిస్తున్నారు. వెరసి చేతికొచ్చిన పంటలు ఎండిపోయే దుస్థితి వాటిల్లుతున్నట్టు గగ్గోలు పెడుతున్నారు.
- వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో ఉదయం పూట రెండు గంటల పాటు కరెంటు సరఫరాలో తీవ్ర అంతరాయమేర్పడుతున్నట్టు అక్కడి రైతులు ఆరోపిస్తున్నారు. మరీ ముఖ్యంగా పీక్ డిమాండ్ నమోదయ్యే ఉదయం 8 గంటల సమయంలోనే కోతలు పెడుతున్నట్టు చెబుతున్నారు.
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో వ్యవసాయానికి మధ్యరాత్రి ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు మొత్తంగా రోజులో 16 గంటల పాటు అందిస్తున్నామని అధికారులు ప్రకటనలు చేస్తున్నారు. క్షేత్ర స్థాయిలో వ్యవసాయానికి మరో నాలుగు గంటలు కోత పెడుతున్నారు. ఎండలతో వినియోగం పెరిగిందనే కారణంతో లోవోల్టేజీ కరెంటు వస్తున్నది.





వివిధ గ్రామాల్లో కాలిపోయి సిద్దిపేట జిల్లా కేంద్రంలోని టీజీఎస్పీడీసీఎల్ వర్క్‌షాప్‌లో మరమ్మతుల కోసం వచ్చిన ట్రాన్స్‌ఫార్మర్లు

కేసీఆర్ జమానా.. కరెంట్‌కు చిరునామా

విద్యుత్తు రంగంలో తెలంగాణ రాష్ట్రానిది దిగ్విజయ చరిత్ర. కేసీఆర్ అచంచల కృషితోనే ఇది సాకారమైంది. 'కరెంట్ తీగలు బట్టలారేసుకోవడానికి తప్ప ఎందుకు పనికిరావు' అన్న కిరణ్‌కుమార్‌రెడ్డి వెక్కిరింతలకు దీటుగా జవాబిచ్చిన కేసీఆర్ ప్రభుత్వ హయాంలోని అప్పటి తెలంగాణ విద్యుత్తు అవరోధాలను క్రమంగా దాటింది. రైతులకు ఉచితంగా 24 గంటలపాటు నాణ్యమైన విద్యుత్తును నిరంతరాయంగా అందించి కేసీఆర్ దేశ వ్యవసాయ రంగ చరిత్రలోనే కొత్త రికార్డులు సృష్టించారు.

వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు కోసం తొమ్మిదేండ్లలో దాదాపు రూ. 75 వేల కోట్లను అప్పటి కేసీఆర్ ప్రభుత్వం ఖర్చు చేసింది. 2014 నుంచి రైతులకు విద్యుత్తు సబ్సిడీ పేరిట రూ. 36,889 కోట్ల సబ్సిడీని ప్రభుత్వమే భరించింది. అది కాకుండా రూ. 39 వేల కోట్లతో విద్యుత్తు రవాణా, ట్రాన్స్‌ఫార్మర్స్, వైర్ లైన్ల మరమ్మతులు, కొత్త నిర్మాణాలు తదితర ఆధునికీకరణ పనుల కోసం ఖర్చు చేసింది. రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి 8.17 లక్షల కొత్త వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు ఇవ్వటంతో వాటి సంఖ్య 27.2 లక్షలకు చేరింది. అలా కేసీఆర్ ప్రభుత్వం రైతులకు కరెంట్ కష్టాలను దూరం చేసింది. పరిశ్రమలకు భరోసానిచ్చింది. పెట్టుబడిదారుల్లో దిలాసా నింపింది. మొత్తంగా తెలంగాణను విద్యుత్తు ధగధగల్లో వెలిగించి ప్రపంచ పటంలో ప్రకాశింపజేసింది. ఫలితంగా తెలంగాణ వరిధాన్యం ఉత్పత్తిలో దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రమయ్యింది. రాష్ట్రం పండించిన పంటను మేం కొనలేం బాబోయ్ అంటూ కేంద్రం చేతులెత్తేసే పరిస్థితికి రాష్ట్రం ఎదిగింది. కానీ, ఇవ్వాళ అదే రాష్ట్రంలో రైతులను మళ్లీ కరెంట్ కష్టాలు చుట్టుముట్టాయి. కరెంట్ కోసం రైతులు సబ్‌స్టేషన్ల ముందు ధర్నాలు చేయాల్సిన దుస్థితి వాటిల్లింది. లోవోల్టేజీతో మోటార్లు కాలిపోతే బాగుచేసుకోవాల్సిన కాలం మళ్లీ దాపురించింది. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ చివరి ముఖ్యమంత్రి చెప్పిన కరెంట్ కష్టాలను తెలంగాణలో తొలి కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు తెచ్చి చూపెడుతున్నది. అదీ అసలైన విషాదం!

లో ఓల్టేజీతోనే మోటర్లు కాలిపోతున్నాయి..

ఈ యాసంగిలో బావులు, బోర్ల మోటర్లు బాగా కాలిపోతున్నాయి. ఒక్కోసారి మోటర్ రెండు మూడుసార్లు కాలిపోతే ఆ రైతును చూసి మాకే బాధ అనిపిస్తున్నది. మోటర్ రిపేర్ ఖర్చులు, పెట్టుబడి, ఇటీవల వచ్చిన భారీ ఈదురు గాలలతో జరిగిన పంట నష్టం ఇవన్నీ చూస్తే ఈసారి రైతులు నిండా మునిగిన పరిస్థితి ఉంది. కరెంట్ సరిగా రావడం లేదు. దీనికి తోడు భూగర్భ జలాలు అడుగంటినయి. లోవోల్టేజీ కరెంట్ వస్తుండటంతో స్టార్టర్ల వద్ద కెపాసిటర్లను పెడుతున్నం. రోజుకు రెండు, మూడు మోటర్లు రిపేర్ చేస్తున్న. కెపాసిటర్లు పెట్టే కాలం వస్తది అనుకోలేదు. రైతులకు మళ్లీ గడ్డు కాలం కనిపిస్తున్నది.

-బండి సంజీవ్, మెకానిక్, అక్కన్నపేట (సిద్దిపేట జిల్లా)



కరెంట్ కోత.. రైతన్న వెత





సిద్దిపేట జిల్లా కొండపాక మండలం దుద్దెడ గ్రామంలో ఎండిపోతున్న వరిని చూపిస్తున్న రైతు బూర్గుల కనకారావు

మోటర్లు కాలుతున్నయ్..

లో ఓల్టేజీతో విద్యుత్ మోటర్లు కాలిపోతున్నయి. ఎండలు ముదరక ముందే రైతులు పంటలకు నీళ్లు పెట్టుకుంటరు. ఇప్పుడు ఎవుసానికి వచ్చే కరెంట్ సరిపోత లేదు. లో ఓల్టేజీ సమస్య ఎక్కువగా ఉన్నది. కరెంట్ మోటర్లపై తీవ్ర ప్రభావం పడుతున్నది. ఫలితంగా అవి కాలిపోతున్నయి. ఈ విషయం అధికారులకు చెప్పినా పట్టించుకుంట లేరు. లో ఓల్టేజీతో కాలిపోయిన మోటర్లు రీ వైండింగ్ చేసేందుకు అడ్డగోలు పైసలు ఖర్చవుతున్నయి. రెండు మూడు సార్లు కాలిపోయిన మోటర్లు పని చేయడం లేదు. విధి లేక కొత్తవి కొంటున్నం.

- మంద తిరుపతి, గోపాల్‌పూర్, కరీంనగర్



కరెంట్ కోతపై రైతన్న కుత కుత



నల్లగొండ జిల్లా మునుగోడు మండలం సింగారం గ్రామంలో బోర్లు అడుగంటడంతో ఎండిపోయిన వరి చేను

నాడు నిరంతరాయం.. నేడు ఎడాపెడా కోతలు

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో పండుగలా సాగిన ఎవుసం.. ప్రస్తుత రేవంత్‌రెడ్డి సర్కార్ పాలనలో కష్టంగా మారింది. ఎండలు ముదరకముందే వరి, మక్కజొన్న పంటలకు సరిపడా నీళ్లిచ్చే పరిస్థితి లేకుండాపోయింది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రైతులకు 24 గంటలు ఎలాంటి అంతరాయం లేకుండా నాణ్యతతో కూడిన విద్యుత్తు సరఫరా అయింది. ప్రస్తుతం 10 గంటలు కూడా విద్యుత్తు సరఫరా కావడం లేదు. అందులోనూ రోజుకూ నాలుగైదు సార్లూ వచ్చిపోతంది. ఒకవేళ ఉన్నా.. లోఓల్టేజ్‌తో సరఫరా అయితాంది. దీంతో మోటర్లు కాలిపోతున్నాయి. రైతులు ట్యాంకర్లు తెప్పించుకొని పంటలను కాపాడుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే వరి సాగు చేయొద్దని చెప్పగా.. అందులో భాగంగానే ఈ కరెంట్ కోతలు పెట్టి పంటలను ఎండబెడుతున్నరా..? అనే సందేహాలు వ్యక్తమవుతున్నయి.



ఎండలు ముదిరితే మరింత కష్టమే..

కరెంటు సరిగా ఉండటం లేదు. ముందుగా చెప్పకుండనే కరెంటు తీసేస్తున్నరు. రోజులో రెండు మూడు సార్లు కట్ చేస్తున్నరు. మా మిషన్లు కరెంటుతోనే నడిచేది. కరెంట్ పోతే ఎప్పుడొస్తదే తెల్వడం లేదు. గతంలో కరెంటు తిప్పలు ఇంత లేవు. ఎండకాలంలో ఇంకెంత ఇబ్బంది ఉంటదో భయమైతాంది.

-మునగాల లక్ష్మీనారాయణ, టైలర్, కడవెండి, దేవరుప్పల మండలం, జనగామ జిల్లా

గంటకు నాలుగుసార్లు పోతాంది..



దహెగాం, మార్చి 28 : నాకు మా ఊరిలో నాలుగెకరాల పొలం ఉంది. మేల్-ఫీమేల్ సీడ్ వేసిన. గంటకు నాలుగుసార్లు కరెంట్ పోవడం వల్ల పొలం పారడం లేదు. తేప తేపకూ పొలం కాడికి పోయి కరెంట్ పోస్తుందా లేదా అని చూడాల్సి వస్తున్నది. ఇగ కరెంట్ ఎక్కువ తక్కువ రావడం వల్ల మోటర్లు కూడా కాలిపోతున్నయి. గిట్లయితే రైతు బతికేదెట్లా..

- ఇంగిలి బాపు, లగ్గాం, కుమ్రం భీం ఆసిఫాబాద్

లో వోల్టేజీ సమస్య తీవ్రంగా ఉంది



మాది మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం గొల్లపల్లి గ్రామం. ఈ చుట్టు పక్కల ఏడు సబ్‌స్టేషన్లను కలుపుకొని ఒకటే పీడర్ ఉంది. దీంతో వ్యవసాయ కనెక్షన్లు ఉన్న రైతులకు 24 గంటల కరెంటు అందడం లేదు. రోజుకో సమస్యతో రెండు, మూడు గంటల పాటు కరెంట్ తీసేస్తున్నారు. మా ప్రాంతంలో లోవోల్టేజీ సమస్య తీవ్రంగా ఉంది. మోటర్లకు అందాల్సినంత కరెంటు అందక కాలిపోతున్నాయి. మా గ్రామంలో గడిచిన రెండు వారాల్లో నాలుగు మోటార్లు కాలిపోయాయి. కరెంటు తక్కువగా ఉండడంతోనే మోటార్లు కాలిపోతున్నాయని మెకానిక్‌లు చెబుతున్నరు. ఒక్కసారి కాలిపోతే రిపేరు చేయించేందుకు వారం సమయం పడుతుంది. ఆ లోపు పొలాలు నెర్రలు పడి వరి ఎండిపోతుంది. లోవోల్టేజీ సమస్య మాకు ప్రధాన ఇబ్బందిగా మారింది. అధికారులు వచ్చి సమస్యను చూసి వెళ్లడం తప్ప శాశ్వత పరిష్కారం చూపించడం లేదు. బీఆర్‌ఎస్ హయాంలో 24 గంటల కరెంట్ ఉండేది. ఎప్పుడంటే అప్పుడు వచ్చి మోటార్ వేసుకునేటోళ్లం. ఇప్పుడు కరెంట్ సరఫరా సరిగాలేక.. మోటార్లు కాలిపోతున్నయి. కరెంట్ ఎప్పుడు వస్తదో, ఎప్పుడు పోతదో తెల్వక అవస్థలు పడుతున్నాం.

- చింత పురుషోత్తం, గొల్లపల్లి, నెన్నెల మండలం, మంచిర్యాల జిల్లా



మోటర్ దగ్గర కాపలా ఉన్న..

నేను ఏడెకరాల్లో జొన్న సాగు చేశా. మరో పదిహేను రోజుల్లో కోతలు ప్రారంభంకానుండగా.. కింకి దశలో ఉన్న జొన్నకు నీరు తప్పనిసరిగా అందించాలి. త్రీఫేజ్ కరెంటు సరఫరాలో తీవ్ర అంతరాయం కలుగుతున్నది. పది రోజుల నుంచి కరెంటు బాగా పోతున్నది. శనివారం పదిసార్లు కరెంటు పోయింది. కరెంటు పోయి మోటర్ ఆఫ్ అయిపోతున్నది. తిరిగి మోటర్‌ను ఆన్ చేయడానికి స్టార్టర్ వద్ద కాపలా కాయాల్సి వస్తుంది. పంటకు ఈ సమయంలో నీరు అందకపోతే దిగుబడి తగ్గుతుంది. అధికారులు కరెంటు సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలి.

- మల్లేశం, రైతు, తంతోలి. ఆదిలాబాద్ రూరల్ మండలం

మూడు గంటలు ఆలస్యంగా వచ్చింది



మాది కోటపల్లి మండలం. ఆరు ఎకరాల్లో వరి సాగు చేసిన. రాత్రి 12 గంటల నుంచి సాయంత్రం 5 గంటల దాకా ఉండాల్సిన కరెంట్ ఎప్పుడు వస్తదో, ఎప్పుడు పోతదో తెల్వడం లేదు. ఈ రోజు శనివారం రాత్రి 12 గంటలకు రావాల్సిన కరెంట్ 3 గంటలకు వచ్చింది. తెల్లవారుజామున మరో గంట పోయింది. సబ్‌స్టేషన్‌ను ఫోన్ చేసి అడిగితే ఫ్యూజు ఆగడం లేదని చెప్పారు. ఇది నిత్యకృత్యమైపోయింది. ఇస్తున్న కరెంట్ సరిపోక నీళ్లు అందక పొలం ఎండిపోతుంది. ఓ మడికి ఇవ్వాలా.. ఓ మడికి రేపు అని పెట్టుకుంట పోతున్నాం. మార్చిలోనే ఇలాంటి పరిస్థితి ఉంటే.. వచ్చే రోజుల్లో పరిస్థితిని తలచుకుంటేనే భయం అవుతున్నది. కేసీఆర్ సర్కార్ ఉన్నప్పుడు 24 గంటల కరెంట్ ఇచ్చింది. పొలం మొత్తం తడిసేదాకా మోటర్ నడిపించినం. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఇస్తున్న కరెంట్ సరిపోతలేదు.

- రాళ్లబండి స్వామి, కోటపల్లి, మంచిర్యాల జిల్లా



సిద్దిపేట జిల్లా కేంద్రంలోని టీజీఎస్‌పీడీసీఎల్ వర్క్‌షాప్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను రిపేర్ చేస్తున్న సిబ్బంది

గ్రేటర్‌లోనూ కరెంట్ కష్టాలు

- సమయపాలన లేకుండా సరఫరా బంద్
- అసహనం వ్యక్తం చేస్తున్న నగరవాసులు
- పరీక్షల సమయంలో విద్యార్థులకు ఇక్కట్లు
- టెకీలు, ఉద్యోగులకూ తప్పని అవస్థలు

హైదరాబాద్ సిటీబ్యూరో, మార్చి 28(నమస్తే తెలంగాణ): వేసవి ఆరంభంలోనే గ్రేటర్ హైదరాబాద్‌లో కరెంట్ కష్టాలు మొదలయ్యాయి. నగరంలో అప్రకటిత కరెంట్‌కోతలతో జనం అల్లాడిపోతున్నారు. ఏ నిముషానికి కరెంట్ పోతుందో ఎప్పుడు వస్తుందో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. నగరంలో చాలాచోట్ల రోజుకు ఐదారుసార్లు కరెంట్ పోయి రావడంతో నగరవాసులు అసహనానికి గురవుతున్నారు. కొన్నిచోట్ల వోల్టేజి హెచ్చుతగ్గులతో గృహోపకరణాలు కాలిపోతున్నాయన్న ఫిర్యాదులు కూడా దక్షిణ డిస్కంకు వస్తున్నాయి. నాలుగైదురోజులుగా సాయంత్రం వర్షం కురిసి ఉష్ణోగ్రతలు కొంత తగ్గినప్పటికీ మధ్యాహ్నం వేళ ఎండలు మండిపోతూ ఉక్కపోత కూడా ఉండటంతో విద్యుత్ వినియోగం పెరుగుతూనే ఉంది. గ్రేటర్‌లోని మూడుజోన్ల పరిధిలో పది సర్కిళ్లలోని అనేక డివిజన్లలో పగలనకా, రాత్రనకా కరెంట్‌కోతలకు సమయం అంటూ లేకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ముఖ్యంగా పరీక్షల సమయం కావడంతో విద్యార్థులు , వర్క్‌ఫ్రంహోమ్ కారణంగా ఐటీ, ఇతర ఉద్యోగులు ఇంటర్నెట్ అంతరాయంతో అసహనానికి గురవుతున్నారు. గ్యాస్ కొరత కారణంగా ఇండక్షన్ స్టవ్‌లు, ఎలక్ట్రిక్ స్టవ్‌ల కారణంగా వినియోగం పెరుగుతూ లోడ్ అధికం కావడంతో ఫీడర్లు తరచూ ట్రిప్ అవుతున్నాయని సిబ్బంది చెబుతున్నారు. ఇదిలా ఉంటే మూడు నాలుగు రోజులుగా సాయంత్రం వేళల్లో కురుస్తున్న వర్షాలకు గంటల తరబడి కరెంట్ పోతున్నదని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చాలాప్రాంతాల్లో కరెంట్ కోతలపై స్థానికులు ఫ్యూజ్ ఆఫ్ కాల్‌కు ఫిర్యాదు చేసే ప్రయత్నం చేసినా స్పందన లేదని నగర ప్రజలు మండిపడుతున్నారు.

పంటలకు నీరందడం లేదు



పంటలకు కరెంటు రాత్రి నుంచి సాయంత్రం నాలుగు గంటల దాకా ఉండేది. ఇప్పుడు ఎక్కువసార్లు కరెంటు పోతున్నది. మళ్లీ కరెంట్ రావడానికి ఎక్కువ టైం పడుతున్నది. ఎండలకు పంటలకు నీళ్లు ఎక్కువ అవసరమైతానయి. కరెంటు కోతల వల్ల సరిపడా నీళ్లు పారడంలేదు. కరెంటు కట్ చేసి ఇవ్వడం వల్ల ఒకేసారి లోడ్ ఎక్కువై ట్రాన్స్‌ఫార్మర్లు, మోటర్లు, స్టాటర్లు కాలిపోతున్నయి. అవసరమైనంత కరెంటు ఇస్తేనే యాసంగి పంటలు బతుకుతయి.

-పల్లెబోయిన సురేశ్, లక్ష్మీపురం, పరకాల మండలం, హనుమకొండ జిల్లా

రోజుకు ఐదారుసార్లు కట్



ఐదు ఎకరాలల్ల వరి వేసిన. కరెంటు సరిగా వస్తలేదు. రోజులో ఐదారుసార్లు పోయి వస్తున్నది. దీంతో మోటర్లు సరిగా పనిచేయడం లేదు. కరెంటు పోవుడు వచ్చుడు వల్ల మోటర్లు ఖరాబైతనాయి. ఎండల కారణంగా బోర్లళ్ల నీళ్లు తగ్గుతున్నయి. ఇప్పుడు కరెంటు సరిగా లేకుంటే పంట పండది.

-బొలగాని ఉప్పలయ్య, చీకటాయపాలెం, తొర్రూరు మండలం, మహబూబాబాద్ జిల్లా

పదేండ్లు కరెంట్ కష్టాలు లేకుండే..



కరెంటు పోవుడు వచ్చుడుతోని ఇబ్బంది అయితాంది. ఎండలు ఎక్కువయినయి. ఎకరంల వరి, ఎకరంల మొక్కజొన్న వేసిన. పొట్టకు వచ్చినయి. గతంలో పదేండ్లు కరెంట్ కష్టాలు లేకుండే. ఇప్పుడు నీళ్లు అందక ఎండిపోతున్నయి. కరెంటు మంచిగ ఇచ్చి మా పంటలు కాపాడాలె.

-జాటోత్ నెహ్రూ, అమర్సింగ్ తండా, తొర్రూరు మండలం, మహబూబాబాద్ జిల్లా


కరెంట్ ఇవ్వకుంటే పంట ఖతమే..



కరెంటు పోయి వచ్చుడుతోని ఇబ్బంది అయితాంది. బీఆర్‌ఎస్ ఉన్నప్పుడు మోటరు పెట్టి వస్తే ఫుల్లుగా పారేదాక పురస్తు ఉండేది. ఇప్పుడు కరెంటు పోవుడు వచ్చుడుతోని మోటారు కాడికి వచ్చి చూసుకోవాల్సి వస్తున్నది. వేరే పని చేసుకునుడుకు ఇబ్బంది అయితాంది. పంట చేతికి వచ్చేదాకా కరెంటు ఇట్లనే ఉంటే అంత నష్టమే అయితది.

-వజీరు బక్కయ్య, జఫర్‌గఢ్, జనగామ జిల్లా

తక్కువ ఓల్టేజీకి నడిచేలా వైండింగ్ చేస్తున్నం..



వరంగల్ చౌరస్తా, మార్చి 28: లో వోల్టేజీతో మోటర్లు రిపేర్‌కు వస్తున్నయి. గతంలో చిన్న చిన్న సమస్యలతో వచ్చే మోటర్ల సంఖ్య ఎక్కువగా ఉండేది. ఇటీవల గ్రామీణ ప్రాంతాల్లో ఓల్టేజీతో వ్యవసాయానికి వినియోగించే మోటార్ల వైండింగ్ కాలిపోయి రిపేరింగ్ కోసం వస్తున్నయి. గత పదేళ్లుగా తగ్గిపోయిన వైండింగ్ రిపేర్లు మళ్లీ మొదలయ్యాయి. రానున్న కరెంట్ కష్టాలను దృష్టిలో ఉంచుకొని తక్కువ ఓల్టేజీకి నడిచే విధంగానే వైండింగ్ మరమ్మతులు చేస్తున్నం

- ఆర్ కృష్ణ, మోటర్ రిపేరింగ్ సెంటర్ నిర్వాహకుడు, శివనగర్, వరంగల్

సబ్ స్టేషన్ వద్దే కావలి కాస్తున్నం



కృష్ణకాలనీ, మార్చి 28: కాంగ్రెస్ వచ్చినంక గ్రామాల్లో కరెంట్ కష్టాలు మళ్లీ మొదలైనయ్. మా గ్రామంలో కరెంటు ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియడం లేదు. నాకు పదెకరాల భూమి ఉంది. పొలానికి నీళ్లు పెట్టుకోవాలంటే రాత్రింబవళ్లు కరెంటు కోసం సబ్ స్టేషన్ వద్ద కావలి కాస్తున్నాం. రోజుకు 10 గంటలు కూడా ఇవ్వడం లేదు. పొట్టకు వచ్చిన పొలాలు ఎండిపోతున్నయి. కాంగ్రెస్ మాయమాటలు నమ్మి ఓటేసినం. కరెంట్ కోతలతో ఉక్కపోతకు ఇండ్లల్లో ఉండలేక చెట్ల కింద కూర్చుంటున్నం. మాకు 24 గంటలు కరెంటు ఇచ్చి ఆదుకోవాలి.

- పిన్నింటి సమ్మిరెడ్డి, రైతు, దీక్షకుంట, భూపాలపల్లి మండలం

విద్యుత్ కోతతో సమస్యలు



కరీమాబాద్, మార్చి 28: ఇటీవల విద్యుత్ సమస్యలు ఎక్కువయ్యాయి. సరఫరాలో హెచ్చు తగ్గుల వల్ల పనులు ఆగిపోతున్నాయి. గంటల కొద్దీ సమస్య అలాగే ఉంటుంది. దీనికి తోడు అప్రకటిత కరెంట్ కోతలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వేసవి కాలం ప్రారంభానికి ముందే ఇలా ఉంటే మునుముందు ఎలా ఉంటుందో తలుచుకుంటేనే భయమవుతున్నది. గతంలో ఇలాంటి సమస్యలు తలెత్తలేదు.

-శరత్ చంద్ర, ఆన్‌లైన్ సెంటర్ నిర్వాహకుడు, వరంగల్

సమస్యల సాకుతో కరెంట్ తీస్తున్నరు



చిట్యాల, మార్చి 28 : సమస్యల సాకుతో కరెంట్ తీసేస్తున్నరు. నేను చిట్యాల మండల కేంద్రంలో సెల్‌ఫోన్లు రిపేరు చేస్తుంట. కరెంట్ సమస్యతో సెల్‌ఫోన్లు సకాలంలో రిపేరు చేసి ఇవ్వడం సాధ్యం కావడం లేదు. ఎండ పెరగడంతో కరెంట్ పోతే ఉక్కపోతకు ఉక్కిరిబిక్కిరవుతున్నం. అయినా 24 గంటల ఉచిత కరెంట్ ఇస్తానన్న ప్రభుత్వం కోతలు పెట్టడం సరికాదు. ఇచ్చిన హామీలను ప్రభుత్వం నిలబెట్టుకోవాలి.

- చింతల రాజేందర్, మొబైల్ షాప్, చిట్యాల, జయశంకర్ భూపాలపల్లి జిల్లా

కరెంట్ పోతే చెట్లకింద ఉంటున్నం



భూపాలపల్లి రూరల్, మార్చి 28 : కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినంక కరెంట్ కష్టాలు మొదలైనయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో 24 గంటలు కరెంట్ ఉండేది. ఎలాంటి ఇబ్బంది పడలేదు. మార్చిలోనే తీవ్రంగా ఉన్న ఎండలకు చెట్ల కింద కూర్చుంటున్నం. కొన్ని రోజుల నుంచి మధ్యాహ్నం, రాత్రి సమయంలో కరెంట్ పోతున్నది. పిల్లలు పడుకోలేక ఏడుస్తున్నారు. ఇప్పుడే ఇట్లుంటే రానున్న రోజుల్లో ఎలా ఉంటుందో? కరెంట్ కోతలు లేకుండా అధికారులు చూడాలి.

- గొల్లెపెల్లి విజయలక్ష్మి, గృహిణి, సుభాష్‌కాలనీ, భూపాలపల్లి

కోతల భయంతో ఐదెకరాలే సాగు చేసిన..



పోయిన ఏడాది యాసంగిలో ఎనిమిదెకరాల్లో సాగు చేసిన. రెండు బోరుబావులు ఉన్నప్పటికీ అధికారులు కరెంటు కోతలు విధించడంతో మూడెకరాలకు పూర్తిస్థాయిలో నీరందలేదు. అందుకే ఈ ఏడాది యాసంగిలో ఐదెకరాల్లో వరి, మక్క వేసిన. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన సంది కరెంటు ఎప్పుడు ఉంటుందో.. ఎప్పుడు పోతుందో తెలియడం లేదు. రోజూ సాయంత్రం ఐదు గంటల నుంచి అర్ధరాత్రి ఒంటి గంట వరకు కరెంటు కోతలు పెడ్తున్నరు. బోరు బావుల నుంచి పంటలకు రాత్రంతా నీళ్లను పారించాలని పొలం కాడికి వెళ్లి ఆటోమెటిక్ స్టార్టర్లు ఆన్ చేసి ఇంటి కొచ్చి పడుకుంటం. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు 24గంటలు కరెంటు సరఫరా జరిగేది. ఈ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రైతులు అన్ని విధాలుగా ఇబ్బందులు పడుతున్నరు.

- ఉర్మెల నర్సారెడ్డి, రైతు, నర్సాపూర్(డబ్ల్యూ), లక్ష్మణచాంద మండలం, నిర్మల్ జిల్లా

మరిన్ని వార్తలు
ntnews.com లో
చూడగలరు

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి. చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. e-mail: editpage@ntnews.com

నక్సలిజం ముగిసిన అధ్యాయమేనా?

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 'నక్సల్స్ రహిత భారతదేశం' గడువు మార్చి 31తో ముగుస్తుంది. కేంద్ర ప్రభుత్వం నక్సల్స్‌కు పెట్టిన డెడ్‌లైన్ మరో రెండు రోజులే మిగిలి ఉన్నది. ఆరు దశాబ్దాల క్రితం ఆరంభమై 22 రాష్ట్రాలకు విస్తరించి రోజూ ఎక్కడో చోట ఉద్యమ ఆనవాళ్లు ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి. పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్ జిల్లా నక్సల్బరీ సమీపంలోని బెంగాయిజోట్ గ్రామంలో 1967లో 25 మేన జరిగిన భూఉద్యమ పోరాటంలో జరిగిన పోలీస్ కాల్పుల్లో తొమ్మిది మంది కార్మికులు, ఇద్దరు పిల్లలు మరణించడంతో నక్సలిజం మొదలైంది. అలా భూపోరాటం, సగటు మనిషికి కూడు, గూడు, గుడ్డ, గుప్పెడు న్యాయం నినాదంతో జనంలోకి వెళ్లింది.



మంగళారపు లక్ష్మణ్
98663 35567

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యంగా తెలంగాణలో భూస్వామ్య వ్యవస్థ 1975 వరకు వేళ్లూనుకునే ఉన్నది. దొరలు, భూస్వాములు పటేల్, పట్వారీ వ్యవస్థల దోపిడీ విధానాల వల్ల ప్రజలు ఆర్థిక, మానసిక, శారీరక అసమానతలకు గురవుతున్న రోజులవి. అదే సమయంలో 1967లో పశ్చిమ బెంగాల్‌లో చారు మజుందార్, కానూ సన్యాల్ సీపీఎం నుంచి విడిపోయి నక్సల్‌బరి నుంచి ఉద్యమం ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్‌లో సీపీఎం నాయకులు దేవులపల్లి వెంకటేశ్వరరావు, తరిమెల నాగిరెడ్డి, చంద్ర పుల్లారెడ్డి, కొల్లా వెంకటయ్య తదితరులు నక్సలైట్ ఉద్యమాన్ని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విస్తరింపజేశారు.1969లో జరిగిన శ్రీకాకుళం గిరిజన రైతాంగ ఉద్యమం తెలంగాణపై తీవ్ర ప్రభావం చూపింది. 1969లో జరిగిన తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని కొండపల్లి సీతారామయ్య, కేజీ సత్యమూర్తి సమర్థించారు. అప్పటి రాష్ట్ర ప్రభుత్వం వందలాది మంది తెలంగాణ ఉద్యమకారులను కాల్చి చంపింది.

తెలంగాణ ఉద్యమంలో చెన్నారెడ్డి నాయకత్వ వైఫల్యంతో తీవ్ర అసంతృప్తి, ఆగ్రహంతో ఉన్న తెలంగాణ యువత విప్లవోద్యమాలవైపు ఆకర్షితమైంది. 1969-70 నుంచే తెలంగాణలోని వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, నల్గొండ జిల్లాల్లో కొండపల్లి సీతారామయ్య, కేజీ సత్యమూర్తి, డాక్టర్ కొల్లూరి చిరంజీవి, ముప్పాల లక్ష్మణరావు (గణపతి) సీపీఐ-ఎంఎల్ పార్టీ ద్వారా రిక్రూట్‌మెంట్ ప్రారంభిచారు, తెలంగాణలో విద్యార్థులు అధిక సంఖ్యలో నక్సలైట్లుగా మారడానికి వరవరరావు, గద్దర్‌తోపాటు విప్లవ రచయితల సంఘం ప్రచురణలు, గేయాలు, విప్లవ సాహిత్యం, సాంస్కృతిక ప్రదర్శనలు యువతను ప్రేరేపించాయి. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జార్జిరెడ్డి హత్యానంతరం 1973-74లో విద్యార్థులు పీడీఎస్‌యూ పేరుతో సంఘటితమై ఉద్యమాలు రూపొందించారు. కొండపల్లి సీతారామయ్య, మల్లోజుల కోటేశ్వరరావు, నల్లా ఆదిరెడ్డి, శనిగరం వెంకటేశ్వర్లు (సాహూ), సూరపరెడ్డి జనార్దన్, నారదాసు లక్ష్మణరావు, అల్లం నారాయణ, అల్లం వీరయ్య, బీ విజయకుమార్ తదితరులు 1974 అక్టోబర్ 13న రాడికల్ విద్యార్థి విభాగాన్ని ఏర్పాటు చేశారు. ఈ పేరును ప్రజాకవి శ్రీశ్రీ ఖరారు చేశారు.

దేశవ్యాప్తంగా చాలా రాష్ట్రాల్లో రాడికల్ విద్యార్థి సంఘాల ద్వారానే విప్లవ ఉద్యమాల పోరు జరిగింది. 1975 జూన్ 25 నుంచి 1977 మార్చి 21 వరకు ఇందిరాగాంధీ ప్రభుత్వం దేశంలో ఎమర్జెన్సీ విధించింది. ఆ కాలంలో వందలాది మంది యువకులను పోలీసులు కాల్చి చంపారు, వేలాదిమంది యువకులు జైళ్ల పాలయ్యారు. వరంగల్ ఆర్ఈసీ కాలేజీలో ఇంజినీరింగ్ చదువుతున్న ఆర్ఎస్‌యూ నాయకుడు సూరపనేని జనార్దన్, ఎల్బీ కాలేజీ విద్యార్థి లంక మురళీమోహన్‌రెడ్డిని 1975 జూలైలో సిద్దిపేట సమీపంలోని గిరాయిపల్లి గుట్టల్లో చెట్లకు కట్టేసి కాల్చి చంపారు. దేశంలోని ఆయా రాష్ట్రాలలో పేరు మోసిన ఉద్యమకారులను ఎంతో మందిని కాల్చి చంపారు. 1977 మార్చిలో ఎమర్జెన్సీ ఎత్తివేశాక అనేక ఘటనలు వెలుగు చూశాయి. 1978-79 ప్రాంతంలో మళ్లీ విప్లవకారులు పెద్ద ఎత్తున ఒక్కటయ్యారు. సభలు, సమావేశాలు, సాంస్కృతిక ప్రదర్శన నిర్వహిస్తూ ఉద్యమాలకు మళ్లీ ఊపిరి పోశారు. స్వాతంత్ర్యం వచ్చి అప్పటికి 33 ఏండ్లయినా వ్యవస్థలో ఏమాత్రం మార్పు రాలేదు. ఏ పేదవాడి కోసమైతే ఉద్యమాలు పుట్టాయో ఆ ఉద్యమాల ఆశలు, ఆశయాలు రవ్వంత కూడా నెరవేరలేదన్న ఉక్రోషంతో యువత మళ్లీ కదం తొక్కింది.



జమీందారులు, జాగిర్దారులు, దేశ్‌ముఖ్‌లు, దొరలు, భూస్వాముల పీడ విరుగుడు కాలేదు. ప్రభుత్వం, పాలకులు, అధికార యంత్రాంగం వారికి పెంపుడు అనుకూలంగా మారటంతో ఉద్యమాలు పెల్లుబుకాయి. నక్సలైట్లు 1978లో 'గ్రామాలకు తరలండి' పేరుతో ప్రజల దీనస్థితిని తెలుసుకున్నారు.

> **1978 డిసెంబర్ 8న నిర్వహించిన 'జగిత్యాల జైత్రయాత్ర' తర్వాత ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ఉద్యమ పోరాటం మరింత పటిష్టమైంది. ఈ సభ తర్వాత కొండపల్లి సీతారామయ్య తన సెంట్రల్ ఆర్గనైజింగ్ కమిటీ(సీవోసీ)ని 1980 ఏప్రిల్ 22న పీపుల్స్ వార్ గ్రూప్ (పీడబ్ల్యూజీ)గా మార్చారు. 1981 ఏప్రిల్ 20న పీపుల్స్‌వార్ ఇంద్రవెల్లి గిరిజన మహాసభలు తెలంగాణలో ప్రకంపన సృష్టించాయి. పోలీస్ కాల్పుల్లో దాదాపు 18 మంది మరణించగా వందలాదిమంది క్షతగాత్రులయ్యారు.**

1983లో ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించి తమ ఎన్నికల ప్రచారంలో నక్సలైట్లే దేశభక్తులని ప్రకటించారు. తొమ్మిది నెలల్లోనే అధికారం చేపట్టారు. నక్సలైట్లు రాష్ట్రవ్యాప్తంగా తమ ఉద్యమాన్ని విస్తరిస్తూ మద్యపాన నిషేధం అమలు డిమాండ్ తీవ్రతరం చేశారు. ఈ నేపథ్యంలోనే ఎన్టీఆర్ మద్యపానం నిషేధాన్ని అమలు చేశారు. నక్సలైట్లు తమ డిమాండ్ల సాధన కోసం రాజకీయ నాయకులు, అధికారులు సిబ్బందిని కిడ్నాప్ చేశారు. పోలీసులు, నక్సలైట్లకు మధ్య పోరు తీవ్రమైంది. నక్సలిజాన్ని అణచివేసే క్రమంలో పోలీసులు నక్సల్స్ సానుభూతిపరులపై కేసులు పెడుతూ దాడులు చేస్తూ ఎన్‌కౌంటర్లకు పాల్పడ్డారు. 1989లో డాక్టర్ మర్రి చెన్నారెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత నక్సలైట్లపై నిషేధం ఎత్తివేస్తున్నట్టు ప్రకటించారు. ఆ పరిస్థితిని నక్సలైట్లు తమకు అనుకూలంగా మార్చుకున్నారు. యువత పెద్దసంఖ్యలో నక్సలైట్లలో కలిసిపోయారు. ఎంతోమంది మహిళలు సైతం ఉద్యమంలో చేరారు. ఉత్తర తెలంగాణలో నక్సలైట్ల ఒత్తిడితో కొందరు భూస్వాములు, దొరలు తమ భూములను పేదలకు పంచారు. చాలామంది దొరలు, భూస్వాములు, బడా రాజకీయ నాయకులు గ్రామాలను వదిలి పట్టణాల్లో తలదాచుకున్నారు. చాలామంది నక్సలిజంలో చేరి తమ స్వార్థ ప్రయోజనాలు వ్యక్తిగత కక్షలు తీర్చుకునేందుకు పనులు చక్కబెట్టుకునేందుకు బెదిరింపులకు దోపిడీ దొంగతనాలు కూడా పాల్పడ్డారు. వారిని కట్టడి చేసేందుకు నక్సలైట్లు కొందరిపై హింసాత్మక చర్యలకు దిగారు.

సీపీఐ (ఎంఎల్), పీడబ్ల్యూజీ, మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్ ఆఫ్ ఇండియా (ఎంసీసీఐ) తదితర ఉద్యమ పార్టీలన్నీ ఏకమై 2004 సెప్టెంబర్ 21న సీపీఐ మావోయిస్టు పార్టీగా అవతరించాయి. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక 2005లో నక్సలైట్లతో శాంతి చర్చలకు పిలుపునిచ్చారు, చర్చలు విఫలమయ్యాయి. నక్సలైట్లపై ప్రభుత్వం మళ్లీ నిషేధం అమలు చేస్తూ క్రమంగా నక్సలైట్లపై తీవ్ర ఒత్తిడి పెంచింది.

2006 నుంచి 2014 వరకు మలిదశ తెలంగాణ ఉద్యమం తీవ్రతరమైంది. కేసీఆర్ చేపట్టిన తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి నక్సలైట్లు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రజలను ప్రేరేపించి ఉద్యమానికి సన్నద్ధం చేశారు. అప్పటికే పోలీసు బలగాలు నక్సలైట్లపై అన్ని రకాలుగా అణిచివేత ధోరణితో ఎన్‌కౌంటర్లను తీవ్రతరం చేశారు. నక్సలిజంలోకి రిక్రూట్‌మెంట్ పూర్తిగా ఆగిపోయింది. దళ నాయకులు, కేంద్ర, రాష్ట్ర కమిటీ సభ్యులు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వదిలి ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాలకు వెళ్లారు.

> **నక్సలిజాన్ని పూర్తిగా రూపుమాపాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 'ఆపరేషన్ గ్రీన్ హంట్'ను ఏర్పాటు చేసి 50 వేల మంది సైనికులను రంగంలోకి దింపింది. అత్యాధునిక ఆయుధాలు, డ్రోన్లు సాంకేతిక నైపుణ్యంతో చర్యలు చేపట్టింది. రెండేండ్లుగా నక్సల్స్‌కు, పోలీసు బలగాలకు భీకరపోరు జరుగుతూనే ఉన్నది.**

నిరుడు మే 21న జరిగిన పోలీస్ కాల్పుల్లో మావోయిస్టు కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతోపాటు 21 మంది కీలక నేతలు హతమయ్యారు, అక్టోబర్ 6న మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు పొలిట్‌బ్యూరో సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ తోపాటు పలువురు కీలక నేతలు లొంగిపోయారు, 2017 నుంచి ఇప్పటివరకు దాదాపు పదివేలకు పైగా నక్సలైట్లు లొంగిపోగా వేల మంది హతులయ్యారు. మార్చి 31 వరకు నక్సల్స్ రహిత దేశంగా మారుస్తామని కేంద్రం తీసుకున్న భీష్మ శపథానికి మరో మూడు రోజులే గడువున్నది. ఆది నుంచి నక్సలిజంలో కీలక పాత్ర పోషించిన కేంద్ర కమిటీ మాజీ కార్యదర్శి ముప్పాల లక్ష్మణరావు అలియాస్ గణపతి లొంగుబాటుతో పూర్తిగా నక్సలిజం తుడిచి పెట్టినట్టు అవుతుందని కేంద్రం భావిస్తున్నది. ఆయన భారతదేశంలో ఉన్నారా? విదేశాల్లో ఉన్నారా? అన్నది పోలీసులు విచారణ చేస్తున్నారు. త్వరలోనే ఆయనను లొంగిపోయాలా చేయాలన్నది పోలీసుల ప్రయత్నంగా కనిపిస్తున్నది. ఈ మూడు రోజుల్లో నక్సల్స్‌ను పూర్తిగా నిర్మూలించినట్టు కేంద్ర ప్రకటిస్తుందో లేదో వేచి చూడాలి.

(వ్యాసకర్త: సీనియర్ జర్నలిస్ట్)

> **వరంగల్ ఆర్ఈసీ కాలేజీలో ఇంజినీరింగ్ చదువుతున్న ఆర్ఎస్‌యూ నాయకుడు సూరపనేని జనార్దన్, ఎల్బీ కాలేజీ విద్యార్థి లంక మురళీమోహన్‌రెడ్డిని 1975 జూలైలో సిద్దిపేట సమీపంలోని గిరాయిపల్లి గుట్టల్లో చెట్లకు కట్టేసి కాల్చి చంపారు. దేశంలోని ఆయా రాష్ట్రాలలో పేరు మోసిన ఉద్యమకారులను ఎంతోమందిని కాల్చి చంపారు.**



ఇరాన్ చేతిలో ఆయుధం హొర్ముజ్ జలసంధి



డాక్టర్ బుర్ర మధుసూదన్‌రెడ్డి
99497 00037

నేటి ప్రపంచం నిద్ర లేచిన దగ్గరి నుంచి పడుకునే వరకు క్షణక్షణం ఏది చూసినా, ఎవరితో మాట్లాడినా, ఏ టీవీ చూసినా, ఏ సోషల్ మీడియా తెరలు తెరిచినా అంతటా హొర్ముజ్ జల సంధి గురించి చర్చ జరుగుతున్నది. నిన్న మొన్నటి వరకు పెద్దగా ఎవరికీ తెలియని జల సంధి నేడు 8.2 బిలియన్ల ప్రపంచ మానవాళిని నిద్ర పోనివ్వడం లేదు. పల్లెల్లోనూ హొర్ముజ్ పేరు వినిపిస్తున్నది.

అమెరికా, ఇజ్రాయిల్ భీకర దాడులకు సమాధానంగా హొర్మోజ్ జలసంధిని ఇరాన్ ఆయుధంగా మలుచుకున్నది. ప్రపంచ చమురు సరఫరాలో 20 శాతం వరకు ఈ జలసంధి మీదుగానే జరుగుతున్నది. ఈ తరుణంలో ప్రపంచ దేశాలు కూడా యుద్ధం కొనసాగించడాన్ని వ్యతిరేకిస్తున్నాయి. ఈ విషయాన్ని పలు దేశాలు అమెరికాకు ప్రత్యక్షంగా చెప్పాయి. ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయిల్ చేసిన బాంబు దాడిలో ఇరాన్ సుప్రీమ్ లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ చనిపోవడంతో ప్రారంభంపైన యుద్ధం నెలరోజులుగా కొనసాగుతూ ఉన్నది. అమెరికా వెనకడుగు వేసే పరిస్థితికి చేరింది. ట్రంప్ మాటల ఘాటు తగ్గుతున్నది. అమెరికా స్వరం పట్టు తప్పుతున్నది. అమెరికన్ దళాలకు గుండెల్లో గుబులు పెరిగిందని ప్రపంచ మీడియా కథనాలు వెలువరిస్తున్నది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం అవుతున్నది. ఇంధన కొరత ద్రవ్యోల్బణానికి దారి తీసింది.

అమెరికా-ఇజ్రాయిల్, ఇరాన్ ఘర్షణల నేపథ్యంలో హొర్మోజ్ జలసంధి యుద్ధ కేంద్రంగా మారింది. ఈ జల మార్గంపై ఇరాన్‌దే పైచేయి కావడంతో చమురు రవాణాకు ఆటంకం కలుగుతున్నది. భారత్ లాంటి మిత్ర దేశాల నౌకలకు అనుమతులు ఇవ్వడం, శత్రు దేశాల చమురు నౌకల రవాణాపై ఆంక్షలు కొనసాగుతున్నది. నేటి ప్రపంచానికి ఇరాన్ మరో వినూత్న యుద్ధ రీతిని పరిచయం చేస్తున్నది. చవకైన షాహెడ్ డ్రోన్ బాంబులు, పేలుడు పదార్థాలతో కూడిన బోట్లు, నావల్ మైన్స్, కైలో క్లాస్ సబ్‌మెరైన్‌లతో ప్రత్యర్థుల బలమైన, అత్యంత ఖరీదైన ఆయుధాలకు ధీటుగా సమాధానం చెప్తున్నది. నేడు అమెరికా కూడా వెనకడుగు వేయక తప్పడం లేదు. సౌదీ, యూఏఈ, ఖతార్‌పై కూడా ఇరాన్ దాడులు చేసినప్పటికీ ఆ దేశాలు బలంగా ఎదిరించడం లేదు. దీనికి కారణం ఆయా దేశాల చమురు రవాణా నౌకలను జల సంధి మీదుగా వెళ్లకుండా ఆపగల సామర్థ్యం ఇరాన్ చేతిలో ఉన్నది. నేడు ఇరాన్‌కు హొర్మోజ్ జలసంధి ఒక పదునైన ఆయుధంగా మారి, యుద్ధ ముగింపునకు చర్చలు జరిగే స్థాయికి చేరింది.

> **ఒక వైపు పర్షియన్ గల్ఫ్‌తో, ఓమన్ గల్ఫ్‌ను కలుపుతున్న హొర్ముజ్ జల సంధికి ఉత్తరాన ఇరాన్, దక్షిణాన ఓమన్/యూఏఈ దేశాలు ఉన్నాయి. ఈ జలసంధి అతి ముఖ్యమైన చమురు రవాణా సముద్ర మార్గంగా నేడు యుద్ధానికి కేంద్ర బిందువుగా ఉన్నది. రెండు దశాబ్దాలుగా అమెరికా ఆంక్షల నడుమ ఇరాన్ ఆర్థిక వ్యవస్థ బాగా చితికిపోయింది. నేడు గోరుచుట్టుపై రోకలి పోటు వలె ఈ యుద్ధంతో ఇరాన్ మరో ఆర్థిక అగాథంలోకి కూరుకుపోయింది. ఇరాన్ అగ్ర నాయకులు మరణించడం, ప్రధాన సైనిక స్థావరాలు నేల మట్టం కావడం, వ్యూహాత్మక కేంద్రాలు విచ్ఛిన్నం కావడం కొనసాగుతున్నప్పటికీ ఇరాన్ చలించడంలేదు. హొర్మోజ్ జలసంధిని అత్యంత పదునైన ఆయుధంగా చేసుకొని రెండు బలమైన దేశాలకు చెమటలు పట్టిస్తున్నది. ఇరాన్‌కు చెందిన ఐఆర్జీసీ బలగాలు వెనక్కి తగ్గడం లేదు.**

ప్రపంచంలో ఎన్నో సముద్ర మార్గాలు ఉన్నప్పటికీ హొర్మోజ్ జల సంధి ప్రత్యేకత వేరు. ఈ జల సంధికి అడ్డుకట్ట వేయడంతో ప్రపంచమే అల్లకల్లోలం అవుతున్నది. వన్‌వే రోడ్డు లాంటి ఈ జల సంధి మీదుగా ఒకే సారి ఎక్కువ నౌకలు వెళ్లే వీలు లేదు. గల్ఫ్ దేశాల చమురు ప్రపంచ దేశాలకు చేరడానికి ఈ జలసంధి గుండానే ప్రయాణించాలి. ఈ జల సంధి గేట్లు మూసి వేస్తే చమురు రవాణాకు బ్రేక్ పడుతుంది. దీనిని ఇరాన్ అనుకూలంగా మార్చుకొని అగ్ర రాజ్యానికి వణుకు పుట్టిస్తున్నది. సాధారణ పరిస్థితుల్లో ప్రతి రోజూ 2 కోట్ల బ్యారెల్స్ చమురు, ఎల్ఎన్జీ ఈ జల సంధి మీదుగా ప్రపంచ దేశాలకు చేరుతున్నది. ఈ మార్గంలో నౌకలు వెళ్లకుండా ఇరాన్ పలు డ్రోన్లు, మైన్స్, మిసైల్స్ ఉపయోగించి ఓడల రాకపోకలను అడ్డుకుంటున్నది. ప్రపంచ ఆర్థిక భారీ కుదుపులను దృష్టిలో పెట్టుకొని అమెరికా/ఇజ్రాయిల్ - ఇరాన్ దేశాలు తలో మెట్టు దిగి షరతులను సవరించుకోవాలని విదేశాంగ నిపుణులు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. తమ నష్టాలను కూడా పరిగణనలోకి తీసుకొని చర్చల ద్వారా ఏకాభిప్రాయానికి వచ్చి యుద్ధ ముగింపు వార్తలను ప్రసారం చేయాలని కోరుతున్నారు. ప్రపంచ శాంతి స్థాపనకు దోహదపడాలి చాలామంది కోరుకుంటున్నారు. (వ్యాసకర్త: రిటైర్డ్ ప్రిన్సిపాల్)

కోతలే తప్ప కేటాయింపులేవీ?

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మూడవ బడ్జెట్ ఆరు గ్యారెంటీలకు మంగళం పాడింది.. ప్రజా సంక్షేమానికి తిలోదకాలిచ్చింది. కేసీఆర్ ప్రభుత్వం తీసుకొచ్చిన పథకాలకు బడ్జెట్‌లో కొత్త పెట్టింది, కీలక రంగాలకు కేటాయింపులు తగ్గించింది. నిరుద్యోగభృతి, జాబ్ క్యాలెండర్, పీఆర్సీ ప్రస్తావనే చేయలేదు. విద్య, వైద్య, వ్యవసాయ రంగాల పట్ల తీవ్ర నిర్లక్ష్యమే కనిపిస్తున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన బడ్జెట్ పట్ల సమాజంలోని అన్ని రంగాల్లో అసంతృప్తి వ్యక్తమవుతున్నది. నమ్మి నానవోస్తే పుచ్చి బుర్రలైనట్టు గ్యారెంటీల గారడీతో మోసపోయామని ప్రజలు నెత్తీనోరు కొట్టుకుంటున్నారు.



దేవీప్రసాద్



కాంగ్రెస్ రెండున్నరేండ్ల పాలనలో ఒక్క ప్రాజెక్ట్ కూడా చేపట్టలేదు. ఒక్క నిర్మాణం లేదు కానీ రూ.3.46 లక్షల కోట్ల అప్పులు మాత్రం చేసింది. కాంగ్రెస్ పాలకులు సృష్టించిన సమస్యలతో ప్రజలు కష్టాల పాలయ్యారు. తలసరి ఆదాయం రూ. 4,18,931 లేని గొప్పలు చెప్పిన ప్రభుత్వం, ద్రవ్యోల్బణం ఎందుకు తక్కువగా ఉన్నదో చెప్పలేదు. కేసీఆర్ ప్రభుత్వం తొమ్మిదిన్నరేండ్ల పాలనలో కరోనా, నోట్ల రద్దు లాంటి ఆర్థిక సంక్షోభాలు ఎదురైనా గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి, సంక్షేమం ఆగలేదు. ఖర్చు కంటే సంపద పది రెట్లు వృద్ధి చెందింది. ఉద్యోగుల జీతాలు గణనీయంగా పెరిగాయి. తలసరి ఆదాయంతోపాటు కొనుగోలు శక్తి పెరిగి అనేక రంగాల్లో సంపద పంపిణీ జరిగింది. రైతుబంధు, భరోసా పథకాలు, నిరంతర విద్యుత్తు, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ వంటివి దేశానికే ఆదర్శంగా నిలిచాయి.

కేసీఆర్ పాలనలో కృష్ణా, గోదావరిలో తెలంగాణ నీటి వాటా వాడుకుంటూ అనేక ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టారు. ప్రాజెక్టుల నిర్మాణం, మౌలిక వసతుల కల్పన కోసం తొమ్మిదిన్నరేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.4.17 లక్షల కోట్లు అప్పు చేసింది. ఇందుకు తగ్గట్టుగా సంపద సృష్టించి దేశంలోనే రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపింది. కానీ మాయమాటతో ఓసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలను నట్టేట ముంచింది. కనీసం మూడో బడ్జెట్‌లోనైనా ఏమైనా కేటాయింపులు చేస్తుందేమో చూద్దామని అనుకున్న సబ్బండ వర్ణాలు తీవ్ర నిరాశకు గురయ్యాయి. కేసీఆర్ ప్రభుత్వం వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారు. కానీ కాంగ్రెస్ మూడో బడ్జెట్‌లో వ్యవసాయ, సహకారశాఖలకు కేవలం రూ.23,179 కోట్ల అరకొర నిధులు కేటాయించింది. ఇందులో ఎంత ఖర్చు పెట్టేది ఎంతో అనే సందేహం ఉన్నది. రైతు బంధు పథకం కోసం రూ.13,593 కోట్లు కేటాయించారు. యాసంగి రైతులకు 70 లక్షల మంది రైతులకు కేవలం ఒక ఎకరాకు మాత్రమే చెల్లించారు. మిగతా రూ. 6000 కోట్లు వచ్చే నెలలో చెల్లిస్తామని చెప్పారు. మిగిలిన రూ.7593 కోట్లు వానాకాలానికి సరిపోదు. అంటే ఏడాదికి ఒకే సారి రైతుబంధు ఇస్తామని ప్రభుత్వం పరోక్షంగా తేల్చిచెప్పినట్టయింది.

కేంద్రం సహకరిసున్నది అని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి గుండు సున్న ఇచ్చిందని ఎద్దేవా చేయడం ద్వంద్వనీతికి నిదర్శనం. హామీ మేరకు ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలు ఇవ్వకుండా ప్రభుత్వం మోసం చేసింది. నిరుద్యోగులు ఆందోళన చేస్తే నిర్బంధాల ద్వారా అణచివేసే యత్నం చేస్తున్నది. కాంగ్రెస్ పార్టీ ఇప్పటివరకు 31,798 ఉద్యోగాల భర్తీ కోసం కేవలం 16 నోటిఫికేషన్స్ ఇచ్చింది. అందులో 16,978 మాత్రమే భర్తీ చేసింది. కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్స్ ద్వారా ఇచ్చిన 50,785 ఉద్యోగాలు తమ ఖాతాలో వేసి, 67,763 ఉద్యోగాలు భర్తీ చేశామని గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటు. ఇక ఐదు డీఏలు బాకీ ఉన్న ఏకైక రాష్ట్రం తెలంగాణ కావడం విషాదం. డిజిటల్ హెల్త్ కార్డ్స్ పేరిట ఉద్యోగులు, పెన్షనర్ల నుంచి. 1.5 శాతం కోత ద్వారా ఏడాదికి రూ.600 కోట్లు వసూలుకు సర్కార్ రంగం సిద్ధం చేసింది. మరి ప్రభుత్వం వాటాగా ఇవ్వాల్సిన రూ.600 కోట్లు ఇస్తుందో లేదో తెలియదు.

రిటైర్ అయిన ఉద్యోగుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. 2024 మార్చి నుంచి రిటైర్ అయిన 24,678 మందికి రావలసిన రూ.10,000 కోట్ల పెన్షన్ బకాయిలు చెల్లించకపోవడం అమానవీయం. ప్రభుత్వ వైఖరితో 86 మంది రిటైర్డ్ ఉద్యోగులు అనారోగ్యం, మానసిక ఆందోళనతో మరణించారు. అసెంబ్లీలో బడ్జెట్ చర్చల్లో భాగంగా ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలపై బీఆర్ఎస్ పక్షాన హరీశ్‌రావు, కేటీఆర్ వాయిదా తీర్మానం ద్వారా ప్రశ్నిస్తే ప్రభుత్వం డొంక తిరుగుడు సమాధానాలు చెప్పింది. ఉద్యోగుల పట్ల కాంగ్రెస్ వైఖరి ఏంటో తేలిపోయింది.

> **కేసీఆర్ ప్రభుత్వం పదేండ్లలో రెండు పీఆర్సీలు 73 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చి అమలు చేశారు. రిటైర్ అయిన ఉద్యోగులకు ఆరు నెలలలోపు పెన్షన్ బకాయిలు చెల్లించారు, పీఆర్సీ సకాలంలో వేసి 5 శాతం మధ్యంతర భృతి ఇచ్చారు. రాష్ట్రమంతా వెల్‌నెస్ సెంటర్‌లు ఏర్పా టు చేసి మెరుగైన వైద్య సేవలు అందించారు.**

బీఆర్ఎస్ పాలనలో గణనీయంగా పెరిగిన తలసరి ఆదాయం, జీఎస్డీపీ వృద్ధి రేటు రెండున్నరేండ్ల కాంగ్రెస్ పాలనలో తగ్గింది. గతి తప్పిన పాలననే ఇందుకు కారణం. సంపద పెంచి పేద ప్రజలకు పంచాలనే లక్ష్యంతో సాగిన కేసీఆర్ పాలనపై పదేపదే విమర్శలు, దుష్ప్రచారాలు చేయడం మినహా ప్రస్తుత పాలకులు చేస్తున్న అభివృద్ధి ఏమీలేదు. అన్ని వర్గాల అభివృద్ధికి, సంక్షేమానికి కోతలు విధించడం కాంగ్రెస్ సర్కార్ బడ్జెట్‌లో ఉన్న ప్రత్యేకత. మూడు బడ్జెట్‌లు ముగిశాయి, మిగిలిన రెండు బడ్జెట్‌లపైనా ఆశలేదు. ప్రజావ్యతిరేకత పెల్లుబుకుతున్నా పట్టించుకోకుండా తప్పించుకుంటున్న కాంగ్రెస్‌కు ప్రజలు తగిన సమయంలో తగిన బుద్ధి చెప్తారు.

(వ్యాసకర్త: కార్పొరేషన్ మాజీ చైర్మన్)

> **కేంద్రం సహకరిసున్నది అని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి గుండు సున్న ఇచ్చిందని ఎద్దేవా చేయడం ద్వంద్వనీతికి నిదర్శనం. హామీ మేరకు ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలు ఇవ్వకుండా ప్రభుత్వం మోసం చేసింది. నిరుద్యోగులు ఆందోళన చేస్తే నిర్బంధాల ద్వారా అణచివేసే యత్నం చేస్తున్నది. కాంగ్రెస్ పార్టీ ఇప్పటివరకు 31,798 ఉద్యోగాల భర్తీ కోసం కేవలం 16 నోటిఫికేషన్స్ ఇచ్చింది. అందులో 16,978 మాత్రమే భర్తీ చేసింది.**

అసెంబ్లీ ఎన్నికల ముందు అలవికాని హామీలు గుప్పించిన కాంగ్రెస్, తెలంగాణలో ప్రభుత్వం ఏర్పాటై 27 నెలలు గడుస్తున్నా ఉద్యోగ, ఉపాధ్యాయులు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరించడంలో మీనమేషాలు లెక్కిస్తున్నది.

పీఆర్సీ ఇంకెప్పుడు?



జి. తిరుపతిరెడ్డి
98663 06366



ఎన్నికలకు ముందు పీసీసీ అధ్యక్షుడుగా ఉన్న రేవంత్‌రెడ్డి తమ ప్రభుత్వం రాగానే కొత్త పీఆర్సీని ప్రకటించి ఆరు నెలల్లోగా సిఫారసులను అమలు చేస్తానని హామీ ఇచ్చారు. కానీ నేటివరకు ఆ సిఫారసులు కమిషన్ నుంచి తెప్పించుకోలేదు. పైగా మొదటి వాయిదా ఏప్రిల్ 2024 నుంచి అక్టోబర్ 24 వరకు, రెండవ వాయిదా అక్టోబర్ 24 నుంచి 2026 మార్చి 31 వరకు, 2026 మార్చి నుంచి 2026 సెప్టెంబర్ 30 వరకు ముచ్చటగా మూడోసారి వాయిదా వేసి ఉపాధ్యాయ, ఉద్యోగులను తీవ్ర నిరాశకు గురిచేశారు.

వాస్తవానికి ప్రతి ఐదు సంవత్సరాలకు ఒక సారి ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు వేతనాలను స్థిరీకరించి, తాజాగా వేతనాలను సవరించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు, వేతన సవరణ సంఘం సిఫారసులు చేయాల్సిన అవసరం ఉంటుంది. వేతన సవరణ సంఘం ప్రతిపాదించే పీఆర్సీ తాజా ద్రవ్యోల్బణం, ఐదేండ్లలో ధరల స్థిరీకరణ, సూచికను పరిశీలించాలి. గత పీఆర్సీ నివేదికలను పరిశీలించి, లోపాలను సవరించి, వేతన సవరణ తేదీ నాటికి ఉన్న మూలవేతనం, కరువుభత్యం, ఫిట్మెంట్లను కలిపి, వచ్చిన మొత్తాలను తాజాగా మూలవేతనాలుగా మాస్టర్ స్కేల్, ఇంక్రిమెంట్లు శాస్త్రీయంగా ప్రతిపాదించాల్సిన ఆవశ్యకత కమిటీకి ఉంటుంది.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఆర్ బిశ్వాస్ చైర్మన్‌గా 2018లో మే 18న మొదటి పీఆర్సీ కమిటీని కేసీఆర్ సర్కార్ ఏర్పాటు చేసింది. 2021 నుంచి 43% ఫిట్మెంట్‌తో పీఆర్సీని అమలు చేసింది. ప్రభుత్వంపై ఏడాదికి రూ.12,595 కోట్ల అదనపు భారం పడినా, కరోనా కష్టాలు వెంటాడినా రాష్ట్ర అభివృద్ధిలో ఉపాధ్యాయ, ఉద్యోగుల పాత్రను గుర్తించి అంతటి భారాన్ని కూడా భరించేందుకు సిద్ధపడింది. మొదటి పీఆర్సీ గడువు 2023 జూన్ 30తో ముగిసింది. 2023 జూలై 1 నుంచి రెండో పీఆర్సీ ఇవ్వాల్సి ఉన్నది. కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ సర్కార్ 2023 అక్టోబర్ 2న రిటైర్డ్ ఐఏఎస్ ఆఫీసర్ ఎన్. శివశంకర్‌ను చైర్మన్‌గా వేతన సవరణ సంఘాన్ని నియమించింది. ఆరు నెలల్లోగా రిపోర్టు తయారుచేసి ప్రభుత్వానికి సమర్పించాలని ఆదేశించింది. అనేక పర్యాయాలు చర్చించి ఉద్యోగ సంఘాల నుంచి ప్రతిపాదనలు స్వీకరించింది. సుదీర్ఘ కసరత్తు తరువాత పీఆర్సీ నివేదిక సిద్ధమైంది. రిపోర్టును సమర్పించేందుకు అధికారులు ప్రభుత్వ అనుమతి కోరారు. ఆ తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.

> **ఇదిలావుండగా, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు పెంచాలంటేనే జంకుతున్నారు. ఒకసారి 'నన్ను కోసినా పైసలు లేవు అని, మరొకసారి మీకు జీతాలు పెంచి ఉప్పు, పప్పు, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచాలా? లేక రైతు భరోసా, కల్యాణ లక్ష్మి పథకాలు, సామాజిక పెన్షన్లు తగ్గించాలా?' అంటూ ఉద్యోగ ఉపాధ్యాయులను ప్రశ్నిస్తున్నారు. సీఎం స్థాయిలో ఉన్న వ్యక్తి మాటలు అసమంజసం, ప్రమాదకరం.**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 27 నెలలు గడుస్తున్నా పీఆర్సీ నివేదికను తెప్పించుకోకుండా, దానిని అమలు చేయకుండా బీఆర్ఎస్ సర్కార్‌ను ఆడిపోసుకొని, పబ్బం గడుపుకోవాలని అనుకోవడం దుర్మార్గం. సెప్టెంబర్ 2026 వరకు పీఆర్సీ నివేదికను వాయిదా వేయడం సరైన పద్ధతి కాదు. వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి. తక్షణమే పీఆర్సీ నివేదికను తెప్పించుకొని ఐదు శాతం ఐఆర్‌తో పాటు 40% ఫిట్మెంట్ 2023 జులై 1 నుంచి అమలు చేయాల్సిన బాధ్యత ఎంతో ఉన్నది. ఈ విషయంలో జాప్యం చేస్తే ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల నుంచి తీవ్ర నిరసనను చవిచూడాల్సి వస్తుంది.

(వ్యాసకర్త: టీపీటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు)

రైతన్నకు వెన్నుపోటు

రైతుబంధు లేదు రైతన్నలకు నేడు
వెన్నుపోటు పొడిచి వెన్ను విరిచె
కాంగిరేసు పార్టీ కణికరం లేకుండ
రాజ్యమేలుచుండ్రు బొజ్జపెంచి

కర్షకులకు నేడు కష్టాలు వచ్చెను
చూచెవారులేక మాసె బతుకు
రైతు బతుకులోన కౌతుకమేలేదు
ఆశలన్నీ చెదిరి హార్టు వచ్చె

చెత్త పథకమంటూ చెప్పటానికి నీకు
మనసు ఎలా వచ్చె మంత్రివర్యా
అన్నమిచ్చు రైతన్నల బాధలు
పెరిగిపోయె నేడు పెక్కుగాను



జాధవ్ పుండలిక్‌రావు పాటిల్
94413 33315



శనివారం తెలంగాణభవన్‌లో బీఆర్‌ఎస్వీ గ్రేటర్ హైదరాబాద్ సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్, బాల్క సుమన్, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, నాయకులు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి, బమ్మెర రామ్మూర్తి, కిశోర్‌గౌడ్, చిరుమళ్ల రాకేశ్, శుభప్రద్‌పటేల్, తుంగ బాలు, సతీశ్, స్వామియాదవ్, కృష్ణ తదితరులు

మూసీలో లక్షన్నర కోట్ల అవినీతి!

మొదటిపేజీ తరువాయి...

తేల్చిచెప్పారు. మూసీ సుందరీకరణ ముసుగులో రేవంత్‌రెడ్డి చేస్తున్న భారీ కుంభకోణంపై నగర ప్రజల్లో చైతన్యం కల్పించాలని బీఆర్‌ఎస్వీ నేతలకు కేటీఆర్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ అరాచకాలను అడ్డుకునేందుకు విద్యార్థి విభాగం సిద్ధం కావాలని దిశానిర్దేశం చేశారు. ఏప్రిల్ 2న ప్రెస్‌క్లబ్‌లో ప్రజాసంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటుచేయాలని చెప్పారు. ఏప్రిల్ 4నుంచి 14వరకు వరకు 50బృందాలుగా ఏర్పడి మూసీ పరీవాహక ప్రాంతాలు, బస్తీలు, గల్లీల్లో పర్యటించి ఇంటింటికీ వెళ్లి మూసీ ప్రక్షాళన వెనుక ఉన్న కాంగ్రెస్ కుట్రను వివరించాలని సూచించారు. కరపత్రాలు, పోస్టర్లు, ప్రత్యేక టీషర్టులతో క్యాంపెయిన్ నిర్వహించాలని, విద్యార్థుల దెబ్బకు ప్రభుత్వం దిగొచ్చేలా ప్రజల్లో చైతన్యం తేవాలని పిలుపునిచ్చారు. తెలంగాణ భవన్‌లో శనివారం సాయంత్రం బీఆర్‌ఎస్వీ హైదరాబాద్ నగర నేతలతో నిర్వహించిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. వేల ఇండ్లు కూలగొట్టిన వ్యక్తిగా చరిత్రలో మిగిలిపోతావో.. లేక పద్ధతి మార్చుకుంటావో తేల్చుకో రేవంత్‌రెడ్డి అని హితవు పలికారు. ప్రజలు కాంగ్రెస్‌కు ఓట్లు వేసింది ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు కోసం మాత్రమేనని, పేదల ఇండ్లు కూల్చితే ఊరుకోవడానికి కాదని స్పష్టంచేశారు.

పిచ్చోడిచేతిలో రాష్ట్రం

'పిచ్చోడు కనిపిస్తే దూరంగా వెళ్తాం. అతడి చేతిలో రాయి ఉంటే ఇంకా దూరం వెళ్తాం. కానీ, రేవంత్‌రెడ్డి అనే పిచ్చోడి చేతిలో రాయి కాదు.. ఇప్పుడు రాష్ట్రమే ఉన్నది' అని కేటీఆర్ ఆందోళన వ్యక్తంచేశారు. ఏడాదిలోనే 2లక్షల ఉద్యోగాలు ఇస్తం.. మెగా డీఎస్సీ వేస్తం.. యువతలకు స్కూటీలు ఇస్తం.. విద్యార్థులకు భరోసా కార్డు ఇస్తం.. ఇలా అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అభయహస్తం మ్యానిఫెస్టో.. ఈ శతాబ్దపు అతిపెద్ద మోసమని మండిపడ్డారు. ఒక్క విద్యార్థులను, నిరుద్యోగులనే కాదు రైతు భరోసా, రుణమాఫీ, కౌలు రైతులకు ఏడాది రూ.15 వేలు ఇస్తామని రైతులను సైతం బురిడీ కొట్టించారని విమర్శించారు.

మంత్రులు.. కమల్‌హాసన్‌ను మించిపోయారు

కాంగ్రెస్ మంత్రులు కమలహాసన్ కంటే పెద్ద యాక్టర్లుగా తయారయ్యారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఎన్నికల సమయంలో గ్యారెంటీ కార్డులను 100 రోజులు భద్రంగా పెట్టుకోవాలని భట్టి ప్రజలకు సూచించారని గుర్తుచేశారు. 100 రోజులు కాదు 800 రోజులు దాటాయి ఇప్పుడు ఆ కార్డులు ఎక్కడ పెట్టుకోవాలి? అని ప్రశ్నించారు. కోసినా పైసా లేదని అని చెప్పిన రేవంత్ వ్యాఖ్యలపై కేటీఆర్ స్పందిస్తూ.. నువ్వేమైన సేపువా? జమకాయవా? పిచ్చిపోయిన పుచ్చకాయవు రేవంత్‌రెడ్డీ?' అని విమర్శించారు. మూసీ ప్రాజెక్ట్‌పై అసలు ప్రణాళికలు లేకుండా, డీపీఆర్ కూడా సిద్ధం చేయకుండా అడ్డగోలుగా నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. బఫర్ జోన్ పేరుతో పేదల ఇళ్లు కూల్చివేస్తూ, పెద్దల ఇళ్లను వదిలేస్తున్నారని, ఇది ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని మండిపడ్డారు.

> హైదరాబాద్ నగరాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత యువతదే. మూసీ ప్రక్షాళన ముసుగులో రేవంత్‌రెడ్డి చేస్తున్న లక్షన్నర కోట్ల స్కామ్‌పై ప్రజల్లో చైతన్యం తేవాలి. మూసీ పరీవాహక ప్రాంతాలు, బస్తీల్లో బీఆర్‌ఎస్వీ నేతలు ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ కుట్రను వివరించాలి. కరపత్రాలు, పోస్టర్లు, టీ షర్టులతో క్యాంపెయిన్ చేయాలి. విద్యార్థుల దెబ్బకు ప్రభుత్వం దిగిరావాలి.
> – కేటీఆర్

హైదరాబాద్‌ను కాపాడుకునే బాధ్యత యువతదే..

హైదరాబాద్ నగరాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత యువతపై ఉన్నదని, మూసీ పునరుజ్జీవం పేరుతో పేదల జీవితాలను నాశనం చేయడాన్ని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఇళ్లు కూల్చకుండా, భూములు స్వాధీనం చేసుకోకుండా శాస్త్రీయ పద్ధతిలో మూసీ శుద్ధి చేస్తే బీఆర్‌ఎస్ వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. ప్రస్తుతం వేలాది కుటుంబాలు భయాందోళనలో ఉన్నాయని, ఇల్లు అనేది ప్రతి కుటుంబానికి భావోద్వేగ అంశమని గుర్తుచేశారు. ఇచ్చిన హామీల అమలుకు ఒక్క రూపాయి లేదని చెప్పే సీఎం, తన అవినీతి సొమ్ముల కోసం మూసీ పేరిట లక్షన్నర కోట్ల రూపాయలు ఖర్చు చేస్తానని ప్రకటించడం దారుణమని విమర్శించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.16వేల కోట్లతో రూపొందించిన మూసీ సమగ్ర ప్రణాళికను పక్కన పెట్టి, భారీ అంచనాలతో అవినీతికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వం మూసీ నదిలో మురుగునీటి శుద్ధి కేంద్రాల(ఎస్టీపీ) నిర్మాణాన్ని దాదాపుగా పూర్తి చేసిందని, కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీటిని మూసీలోకి పంపించే ప్రణాళిక కూడా సిద్ధంగా ఉన్నదని పేర్కొన్నారు. అయినా, ప్రస్తుత ప్రభుత్వం అంచనాలను అనవసరంగా పెంచి అవినీతికి బాటలు వేస్తున్నదని విమర్శించారు.

మెస్‌చార్జీలకు డబ్బులుండవు.. మూసీకి మాత్రం ఉంటయా? : సబితాఇంద్రారెడ్డి

ఫీజు రీయింబర్స్‌కు డబ్బులుండవు.. స్కాలర్‌షిప్, మెస్‌చార్జీలకు డబ్బుల్లేవు.. కానీ, మూసీ సుందరీకరణకు మాత్రం డబ్బులొస్తాయా? అని మహేశ్వరం ఎమ్మెల్యే పీ సబితాఇంద్రారెడ్డి ప్రశ్నించారు. మూసీ ప్రాజెక్ట్‌లో భాగంగా మొదటి దఫాలోనే పది వేల ఇండ్లు కూల్చబోతున్నారని ఆరోపించారు. ప్రాజెక్టులో ఇండ్లు కోల్పోతున్నవారికి మనోధైర్యం కల్పించాలని విద్యార్థి విభాగానికి ఆమె పిలుపునిచ్చారు. మూసీ పేరుతో జరిగే అరాచకానికి తాము వ్యతిరేకమని చెప్తున్నా.. అభివృద్ధిని అడ్డుకుంటున్నారని రేవంత్‌రెడ్డి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆక్షేపించారు. రంగారెడ్డి జిల్లా ప్రజలు తమకు ఉన్నత స్థానాలు కల్పించారని, వారికి అండగా నిలబడటం తమ బాధ్యత అని చెప్పారు. ప్రజలకు అన్యాయం జరిగితే కోర్టుకే కాదు. ఎంత దూరమైనా వెళ్తామని హెచ్చరించారు.

మూసీ సుందరీకరణ పేరుతో లూటీ : గెల్లు శ్రీనివాస్

మూసీ సుందరీకరణ పేరుతో ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నారని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ ఆరోపించారు. నాడు చంద్రబాబు నందనవనం పేరుతో తలపెట్టిన ప్రాజెక్టును ఇప్పుడు ఆయన శిష్యుడు రేవంత్‌రెడ్డి మళ్లీ చేపట్టారని విమర్శించారు. బీఆర్‌ఎస్వీ విద్యార్థుల సమస్యలే కాదు. ప్రజాసమస్యలపైనా పోరాటాలు చేసిందని గుర్తుచేశారు. హైదరాబాద్ లేకుండా తెలంగాణ ఇస్తే ఊరుకోబోమని ఆనాడు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టామని చెప్పారు. విద్యాశాఖ మంత్రిగా, మున్సిపల్ మంత్రిగా రేవంత్‌రెడ్డి పనిచేయడం లేదు కానీ, హోం మంత్రి మాత్రం బాగా పని చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

యూనివర్సిటీలకు ఫండ్స్, గ్రామాలకు నిధుల్లేవు: గాదరి కిశోర్

రాష్ట్రంలో యూనివర్సిటీలకు ఫండ్స్ రావు, గ్రామాలకు నిధుల్లేవు కానీ, మూసీ సుందరీకరణ పేరుతో భారీ స్కామ్‌కు తెరతీశారని తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ ఆరోపించారు. రూ.16 వేల కోట్లతో కేసీఆర్ మొదలుపెట్టిన మూసీ అభివృద్ధి ప్రాజెక్టుతో ఏమీ మిగలదని భావించి రూ.1.50 లక్షల కోట్ల ప్రతిపాదనలతో భూదందాకు శ్రీకారం చుట్టారని మండిపడ్డారు. మూసీ సుందరీకరణతో బ్రాండ్ ఇమేజ్ ఎలా పెంచుతారో చెప్పాలని సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. లక్ష మందిని రోడ్డున పడేసి సుందరీకరణ అంటే ఊరుకోమని హెచ్చరించారు. ప్రజాసమస్యలపై గొంతెత్తాలని, అంతా నడుం బిగించాలని ఆయన పిలుపునిచ్చారు.

జైళ్లకు పోయినా అండగా ఉంటాం:బాల్క సుమన్

'జ్ఞానం కోసం చదువు.. జనం కోసం పోరాడు' నినాదంతో బీఆర్‌ఎస్వీ విద్యార్థులు కదంతొక్కాలని మాజీ ఎంపీ బాల్క సుమన్ పిలుపునిచ్చారు. విద్యార్థులు పోరాడాలని, కేసులైనా, జైళ్లకు పోయినా పార్టీపరంగా అండగా ఉంటామని చెప్పారు. మూసీలో గాంధీ విగ్రహం పెట్టండి.. కానీ ప్రజలను రోడ్డున పడేయెద్దని సూచించారు. మూసీపై మేధావులు, జర్నలిస్టులతో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేయాలని చెప్పారు. టీషర్ట్, పోస్టర్లు, డోర్ స్టిక్కర్లు సిద్ధం చేసి, 10–15 రోజులు మూసీ పరీవాహక ప్రాంతాల్లో చైతన్యం కల్పించాలని కోరారు. హైడ్రా దుర్మార్గాలను సైతం ఎండగట్టాలని, గల్లీలో చేపట్టి ఆందోళన ఢిల్లీలో మంటలు పుట్టించాలని పిలుపునిచ్చారు.

ప్రజల పక్షాన నిలబడుతం: పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి

మూసీ రివర్‌ఫ్రంట్ పేరుతో జరిగే విధ్వంసాన్ని ఆపేందుకు ఏ పోరాటానికైనా సిద్ధమేనిని బీఆర్‌ఎస్ యువనేత పట్లోళ్ల కార్తీక్‌రెడి తేల్చిచెప్పారు. ఇండ్లు గుంజుకుంటామంటే తాను కోర్టుకు వెళ్లానని, కోర్టుకే కాదు ఎక్కడికైనా వెళ్లి కొట్లాడుతాని తేల్చిచెప్పారు. బరాబర్ ప్రజల పక్షం నిలబడుతామని స్పష్టంచేశారు. మెట్రో ఇవ్వండి. మూసీ సుందరీకరణ వద్దు అంటూ కార్తీక్‌రెడ్డి నినదించారు. ప్రపంచంలో అన్ని రివర్ ఫ్రంట్ ప్రాజెక్టులు ఫెయిల్ అయ్యాయని విమర్శించారు.

కాంగ్రెస్ అంటేనే కరెప్షన్ : ఎర్రోళ్ల శ్రీనివాస్

త్యాగాల పునాదుల మీద బీఆర్‌ఎస్, తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే.. అబద్ధాల పునాదుల మీద కాంగ్రెస్ నడుస్తున్నదని కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ విమర్శించారు. ఈ రెండున్నరేండ్లలో కాంగ్రెస్ గర్వంగా చెప్పుకొనేలా ఒక్కటీ లేకపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ ఏడాదిన్నరలోనే ఇంటింటికీ తాగునీరు.. 24గంటలకు నాణ్యమైన విద్యుత్తునిచ్చిందని గుర్తుచేశారు. వారి ధ్యాసంతా సంపాదన, కమీషన్ల మీదేనని ఆరోపించారు. మొత్తంగా అన్ని వర్గాలను మోసం చేశారని. నాడైనా, నేడైనా ప్రజల కోసం పోరాడింది బీఆర్‌ఎస్.. బీఆర్‌ఎస్వీ.. మాత్రమేనన్నారు. రేవంత్‌రెడ్డి ధ్యాసంతా భూమి చుట్టే తిరుగుతున్నదని ఆరోపించారు. హైదరాబాద్‌ను విధ్వంసం చేస్తామంటే ఊరుకోబోమని, హైదరాబాద్ బస్తీవాసులకు అండగా ఉంటామని స్పష్టంచేశారు.

ప్రజలకు ఇబ్బందులు కలిగించొద్దు

మూసీ ప్రాజెక్ట్ పేరుతో లక్షలాది ఇళ్లను కూల్చివేయడానికి, దాదాపు 3వేల ఎకరాలను సేకరించి కార్పొరేట్ కంపెనీలకు అప్పగించే ప్రయత్నం జరుగుతున్నదని కేటీఆర్ ఆరోపించారు. ఒకవైపు మూసీ ఒడ్డున ఉన్న ఇండ్లు చట్ట విరుద్ధమని చెప్పే ప్రభుత్వం, అదే ప్రాంతంలో భారీ హోటళ్లు, బిజినెస్ సెంటర్లు నిర్మించాలనుకోవడం ద్వంద్వ వైఖరి కాదా? అని ప్రశ్నించారు. మూసీ పేరిట జరుగుతున్న అవినీతి చర్యలను జాతీయ స్థాయి ప్రముఖులు వ్యతిరేకిస్తున్నారని, గాంధీ కుటుంబసభ్యులు సైతం దీనిపై అభ్యంతరం వ్యక్తంచేశారని గుర్తుచేశారు. తాను చేస్తున్న అవినీతి ప్రశ్నిస్తే శివతాండవం చేస్తా అంటూ సీఎం మాట్లాడటం ఆయన అహంకారానికి నిదర్శనమని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి తన అధికార అహంకారాన్ని తగ్గించుకొని, మూసీ ప్రాజెక్ట్‌ను ప్రజలకు ఇబ్బంది కలగకుండా అమలు చేయాలని, లేదంటే లక్షలాది ఇళ్లను కూల్చిన వ్యక్తిగా చరిత్రలో నిలిచిపోతారని హెచ్చరించారు. బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం చేపట్టే పోరాటానికి పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. 'హైదరాబాద్ మీది... భవిష్యత్తు మీది. రేవంత్‌రెడ్డి ఇష్టమొచ్చినట్టు చేస్తనంటే ఊరుకుందామా? విద్యార్థుల సత్తా ఏమిటో కాంగ్రెస్ సర్కారుకు చూపించాలి. ప్రభుత్వం వణకాలి. బీఆర్‌ఎస్వీ చైతన్య కార్యక్రమాలతో ప్రభుత్వ దెబ్బకు దిగిరావాలి' అని పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, నాయకులు కిశోర్ గౌడ్, చిరుమళ్ల రాకేశ్, శుభప్రద్‌పటేల్, బమ్మెర రామ్మూర్తి, పడాల సతీశ్, తుంగ బాలు, కడారి స్వామియాదవ్, శంభీపూర్ కృష్ణ పాల్గొన్నారు.

సముద్ర తీరం లేని ఏకైక రాష్ట్రం తెలంగాణ!
సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు వైరల్

హైదరాబాద్ సిటీబ్యూరో, మార్చి 28 (నమస్తే తెలంగాణ): వర్తమాన, సామాజిక అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డి తన అజ్ఞానాన్ని మరోసారి బయటపెట్టుకున్నారు. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం మంచిరేవులలో శనివారం ఓంకారేశ్వరస్వామి ఆలయం పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సముద్రపు ఒడ్డు లేని ఏకైక రాష్ట్రం తెలంగాణ అని చెప్పారు. సముద్ర తీరం ఉన్న రాష్ట్రాల్లోని నగరాలు వ్యాపార కేంద్రాలుగా అభివృద్ధి చెందాయని పేర్కొన్నారు. దీంతో అక్కడున్నవారంతా ఒక్కసారిగా అవాక్కయ్యారు. దేశంలో సముద్ర తీరం ఉన్న రాష్ట్రాలు కేవలం తొమ్మిదే కదా.. మిగిలిన రాష్ట్రాలు సముద్రానికి ఆనుకొని లేవు కదా అని చర్చించుకున్నారు. ప్రభుత్వ వార్తలను మీడియాకు పంపించే ఐ అండ్ పీఆర్ కూడా ముఖ్యమంత్రి వ్యాఖ్యలు అన్నవి అన్నట్టుగా గ్రూప్‌లలో షేర్ చేయడం గమనార్హం. దీంతో సీఎం వ్యాఖ్యలు సోషల్‌మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. ఇప్పటికే పలు సందర్భాల్లో తన అజ్ఞానాన్ని బయటపెట్టుకున్న రేవంత్‌రెడ్డి ఆ ఒరవడిని మరోసారి కొనసాగించారని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. ఎక్కడ సభలు, సమావేశాల్లో పాల్గొన్నా ఏదో అంశానికి కొత్త నిర్వచనం చెప్తూ ప్రజల్లో చులకన అవుతూనే ఉన్నారని ఎద్దేవా చేస్తున్నారు. అవగాహన లేని విషయాలను అంతా తనకే తెలుసునన్నట్టుగా మాట్లాడటం.. అభాసుపాలు కావడం రేవంత్‌రెడ్డికి అలవాటుగా మారిందంటూ సెటైర్లు వేస్తున్నారు.

నాడు స్వయంగా కేసులు.. నేడేమో నీతులు

- సీఎం ద్వంద్వ నీతిపై విమర్శలు
- నాడు సెక్రటేరియేట్‌ను వ్యతిరేకిస్తూ ఎన్‌జీటీలో పిటిషన్లు
- నేడు మూసీపై పిటిషన్లు వేసిన వారిపై దబాయింపులు

హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కేసులు వేసి అభివృద్ధి పనులను అడుగడునా అడ్డుకునేందుకు యత్నించారు. ఇప్పుడు అధికార పక్షంలోకి వచ్చాక.. 'కేసులు వేసి పనులను అడ్డుకోవడమేంటి? ప్రజాపతినిధిగా ఉండే అర్హత ఉందా?' అంటూ దబాయిస్తున్నారు. ఇది ఆయన ద్వంద్వ నీతికి నిదర్శనమన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే అనేక అంశాల్లో మాటమార్చడమేకాదు, తన మాటలకు, ఆచరణకు పొంతన ఉండబోదని నిరూపించుకున్న ఆయన మరోమారు తన అవకాశవాదాన్ని బయటపెట్టుకున్నారు. మంచిరేవులలోని వీరభద్రస్వామి ప్రాంగణంలో శనివారం ఆలయ పునర్నిర్మాణానికి భూమిపూజ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా మూసీ నది ప్రక్షాళన పూర్తి చేసి తీరుతామని అన్నారు. 'ఈ ప్రాజెక్టును అడ్డుకోవాలని మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి కుమారుడు కార్తీక్‌రెడ్డి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసు వేశారు. ఎన్నో పదవులు అనుభవించిన ఆ అక్క కొడుకు అభివృద్ధిని అడ్డుకునేందుకు ఎన్జీటీలో కేసు వేశారు. అభివృద్ధిని అడ్డుకునే వారికి ప్రజా ప్రతినిధిగా ఉండే అర్హత ఉందా? మా అక్కకు ఈ వేదికగా విజ్ఞప్తి చేస్తున్నా.. కేసును వెనక్కి తీసుకోండి' అంటూ దబాయింపులకు దిగారు. రేవంత్ వ్యాఖ్యలపై తీవ్రస్థాయిలో విమర్శలు వినిపిస్తున్నాయి. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నూతన సచివాలయం నిర్మాణానికి శ్రీకారం చుట్టగా, ఎంపీగా ఉన్న రేవంత్‌రెడ్డి అడ్డుకొనేందుకు తీవ్రంగా యత్నించారు. నూతన సచివాలయాన్ని హుస్సేన్‌సాగర్ బఫర్‌జోన్‌లో నిర్మిస్తున్నారని, పనులను నిలుపుదల చేయాలని కోరుతూ ఎన్జీటీలో ఆయనే స్వయంగా పిటిషన్ దాఖలు చేశారు. కానీ ఎన్జీటీ ప్రత్యేకంగా ఒక కమిటీని ఏర్పాటు చేసి, వచ్చిన నివేదిక ఆధారంగా సచివాలయానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ప్రజాప్రతినిధిగా ఉండి నాడు ఎన్జీటీని ఆశ్రయించిన రేవంత్‌రెడ్డి.. నేడు కేసులు ఎలా వేస్తారని ప్రశ్నించడం విస్మయం కలిగిస్తున్నది. దీనిపై సోషల్‌మీడియాలో విమర్శలు వినిపిస్తున్నాయి. రేవంత్ ద్వంద్వ నీతిని నెటిజన్లు ఎండగడుతున్నారు.

ఆంక్షల నడుమ మూసీ పనులకు ముగ్గు

- గ్రామస్థులు లేకుండానే మంచిరేవులలో ఆలయ పునర్నిర్మాణానికి భూమిపూజ
- మూసీ పునరుజ్జీవనం పూర్తిచేసి తీరుతామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన
- స్థానిక కాంగ్రెస్ నేతల గృహ నిర్బంధం

హైదరాబాద్ సిటీబ్యూరో, మార్చి 28 (నమస్తే తెలంగాణ): ఎన్ని అడ్డంకులు ఎదురైనా, ఎంత మంది విమర్శించినా మూసీ పునరుజ్జీవనం ప్రాజెక్టును పూర్తి చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టంచేశారు. మూసీ సుందరీకరణ ఫేజ్-1 ప్రాజెక్టులో భాగంగా శనివారం రంగారెడ్డి జిల్లా మంచిరేవులలో ఓంకారేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రూ.700 కోట్లతో ఎనిమిది ఎకరాల విస్తీర్ణంలో ఓంకారేశ్వరస్వామి దేవాలయ నిర్మాణం, వీరభద్రస్వామి, మచిలేశ్వరస్వామి ఆలయాల పునర్నిర్మాణం చేపట్టనున్నట్టు ప్రకటించారు. మూసీ పరీవాహకంలో మతసామరస్యానికి ప్రతీకగా ముస్లింల కోసం మసీదు, సిక్కుల కోసం స్వర్ణ దేవాలయం లాంటి గురుద్వారా, క్రైస్తవుల కోసం చర్చిని నిర్మిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమం ఆద్యంతం ఆంక్షల నడుమ కొనసాగింది. శంకుస్థాపన కార్యక్రమంలో కొద్దిమంది మాత్రమే పాల్గొనేందుకు అవకాశం కల్పించారు. సీఎం కుటుంబసభ్యులతో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీఎస్ రామకృష్ణారావు, వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్, కాలె యాదయ్య, నవీన్ యాదవ్, అనిల్‌కుమార్‌ను మాత్రమే అనుమతించారు. అదే ప్రాంతానికి చెందిన ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్, కాంగ్రెస్ సీనియర్ నేత బొర్రా జ్ఞానేశ్వర్‌ను వేదిక మీదకు ఆహ్వానించకపోవడంతో ఆయన ఎంఆర్‌డీసీఎల్ చైర్మన్ నరసింహారెడ్డితో వాగ్వివాదానికి దిగారు. కనీస ప్రొటోకాల్ పాటించకుండా కార్యక్రమాన్ని ఎలా నిర్వహిస్తారని నిలదీశారు. ఏండ్ల తరబడిగా పార్టీకి సేవ చేసిన వారిని పక్కన పెట్టి కొత్తగా వచ్చిన వారికి పెద్ద పీట వేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు.

గ్రామస్థులకు అనుమతి నిరాకరణ.. గృహ నిర్బంధాలు

మంచిరేవుల గ్రామ పరిధిలోని ఆలయంలో శంకుస్థాపన కార్యక్రమం చేపట్టి ఆ గ్రామస్థులను అనుమతించకపోవడంతో వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. తమను అనుమతించకుండా ఆలయం కట్టేందుకు శంకుస్థాపన ఎలా చేస్తారని వారు ఎంఆర్‌డీసీఎల్ చైర్మన్ నరసింహారెడ్డిని నిలదీశారు. శంకుస్థాపన కార్యక్రమాన్ని అడ్డుకుంటారనే అనుమానంతో పోలీసులు పరీవాహక ప్రాంతంలోని కొంతమంది కాంగ్రెస్ నేతలను గృహ నిర్బంధం చేశారు. హిమయాత్‌సాగర్ మాజీ సర్పంచ్ ఆంజనేయులు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, దర్గా ఖలీజ్‌ఖాన్ మాజీ కార్పొరేటర్ అస్లాం బిన్ అబ్దుల్లా, మాజీ కార్పొరేటర్ ముద్దం రాములను హౌస్‌అరెస్ట్ చేశారు. మూసీ పునరుజ్జీవనం పేరిట భూములను లాక్కోవద్దని సొంత పార్టీ నేతలే వ్యతిరేకించడం, వారిని కాంగ్రెస్ సర్కార్ గృహనిర్బంధంలో ఉంచడం చర్చనీయంగా మారింది.

స్పోర్ట్స్ కల్చరల్ మీట్-2026 ప్రారంభం
మండలి చైర్మన్ గుత్తా, స్పీకర్ ప్రసాద్‌కుమార్‌తో కలిసి ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ) : ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల స్పోర్ట్స్ కల్చరల్ మీట్–2026 శనివారం ఎల్బీ స్టేడియంలో ప్రారంభమైంది. మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌లతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ పోటీలను ప్రారంభించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రభుత్వ సలహాదారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు విద్యార్థులతో కలిసి ఫుట్‌బాల్ ఆడారు. అత్యంత కీలకమైన బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న సమయంలో అర్ధాంతరంగా క్రీడాపోటీలు నిర్వహించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని నిరసిస్తూ బీఆర్‌ఎస్ సభ్యులు స్పోర్ట్స్ కల్చరల్ మీట్‌ను బహిష్కరించారు. ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుబట్టారు.




'తొలిముద్ద'ను ప్రారంభిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు సీతక్క, సురేఖ

పౌష్టికాహారలోపం నివారణకే బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్

- 'తొలిముద్ద'ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి
- అంగన్‌వాడీ టీచర్లకు మొబైల్స్ పంపిణీ

హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ): ఆరేండ్లలోపు చిన్నారుల్లో పౌష్టికాహారలోపం నివారణకే అంగన్‌వాడీ కేంద్రాల్లో బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్‌ను ప్రారంభించామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. అసెంబ్లీ ప్రాంగణంలో మంత్రులు సీతక్క, కొండా సురేఖతో కలిసి శనివారం బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ 'తొలిముద్ద'ను ప్రారంభించారు. అనంతరం అంగన్‌వాడీ సిబ్బందికి మొబైల్ ఫోన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పౌష్టికాహారం లోపంతో చిన్నారుల్లో అనేక ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని గుర్తించే బ్రేక్‌ఫాస్ట్ పథకానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. ప్రభుత్వం చిన్నారుల సంక్షేమానికి ఎన్ని పథకాలు రూపొందించినా అమలు చేయాల్సిన గురుతర బాధ్యత అంగన్‌వాడీ టీచర్లపై ఉన్నదని సూచించారు. వారు చిన్నారులను సొంత బిడ్డల్లా చూసుకొని పౌష్టికాహారం అందించాలని సూచించారు. అంగన్‌వాడీ సిబ్బందిని ప్రభుత్వం కుటుంబసభ్యుల్లా భావిస్తున్నదని చెప్పారు. వారి సమస్యలపై ఎప్పటికప్పుడు చర్చిస్తున్నామని, పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని హామీ ఇచ్చారు. అంగన్‌వాడీ సెంటర్లకు సొంత భవనాలు నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

లోకం పోకడ



ప్రజా సమస్యలపై నిలదీసే సరికి రన్నింగ్ ఆటలంటూ ఒకటే పరుగు!

ఒకవైపు ఎండలు.. మరోవైపు వర్షాలు

- ఏప్రిల్ 3 వరకు మోస్తరు వానలు
- వచ్చే 3 రోజులు గరిష్ఠ ఉష్ణోగ్రతలు
- హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడి



హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో భిన్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో వారం రోజులుగా ఒకవైపు వర్షాలు కురుస్తుండగా, మరోవైపు ఎండలు దంచికొడుతున్నాయని హైదరాబాద్ కేంద్రం తెలిపింది. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. కర్ణాటక మీదుగా దక్షిణ తమిళనాడు వరకు సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ద్రోణి విస్తరించి ఉన్నదని, దీని ప్రభావంతో ఏప్రిల్ 3 వరకు రాష్ట్రంలో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని తెలిపింది. ముఖ్యంగా మహబూబాబాద్, సూర్యాపేట, నల్లగొండ, నిజామాబాద్, నిర్మల్, మంచిర్యాల, కుమ్రంభీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, మల్కాజిగిరి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, వికారాబాద్, ఖమ్మం, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. ఈ జిల్లాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. అదేవిధంగా వచ్చే మూడ్రోజులు గరిష్ఠ ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీల వరకు పెరిగే అవకాశం ఉన్నదని పేర్కొన్నది. శనివారం పది జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటడంతో ఆయా జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలర్ట్ జారీ చేసినట్టు వివరించింది. రాష్ట్రంలో అత్యధికంగా నిజామాబాద్ జిల్లా మోస్రాలో 40.5 డిగ్రీలు నమోదు కాగా, జగిత్యాల, నల్లగొండ, నిర్మల్, సిద్దిపేట జిల్లాల్లో 40.4 డిగ్రీలు, మంచిర్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో 40.2 డిగ్రీలు, జోగులాంబ 40.1, గద్వాల 40.1, ఆదిలాబాద్ , జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యాయని వెల్లడించింది.



ఏఐ కంపెనీలపై పన్ను!

మొదటిపేజీ తరువాయి...

కృత్రిమ మేధ జపం చేస్తుంటే, ఏఐ ఆధారిత కంపెనీలను ఆకర్షించేందుకు దేశాలు, రాష్ట్రాలు పోటీ పడుతుంటే సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం తనదైన శైలిలో విచిత్ర వ్యాఖ్యలు చేశారు. అమెరికాలోని హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ శుక్రవారం నిర్వహించిన 'ఏఐ పాలసీ సింపోజియం'లో వర్చువల్‌గా సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన చేసిన 'ట్యాక్స్' ప్రతిపాదన తీవ్ర చర్చనీయాంశమైంది. ఇది ఆచరణ సాధ్యం కాని, ఏమాత్రం అవగాహన లేని ఆలోచన అంటూ ఐటీ రంగ నిపుణులు మండిపడుతున్నారు.

కంపెనీలు వెనుకడుగు వేసే ప్రమాదం

మల్టీ నేషనల్ కంపెనీలు మన దేశంలో పెట్టుబడులు పెట్టాలంటే పెద్దఎత్తున రాయితీలు ఇవ్వాల్సి ఉంటుంది. ఇప్పటికే గూగుల్, అమెజాన్, సహా ఇతర ప్రపంచ ప్రఖ్యాత కంపెనీలకు ప్రభుత్వాలు రాయితీ ఇస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలు పెట్టుబడులను ఆకర్షించేందుకు ఏఐ కంపెనీలకు పోటీపడి ప్రోత్సాహకాలు ఇస్తున్నాయి. ఈ తరుణంలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు పెట్టుబడులను ఆకర్షించడంలో తీవ్ర ఆటంకంగా మారుతాయని ఐటీరంగ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి నిర్లక్ష్యపు ప్రకటనలతో అంతర్జాతీయ సంస్థలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు వెనుకడుగు వేసే ప్రమాదం పొంచి ఉన్నదని హెచ్చరిస్తున్నారు. మన దేశంలో ఇప్పటికే ప్రధాన నగరాల్లో ఐటీ కంపెనీల పెట్టుబడుల విషయంలో పోటీ నెలకొన్నదని గుర్తుచేస్తున్నారు. కంపెనీలను భయపెట్టేలా సీఎం చేసిన ప్రకటనతో కంపెనీలు ఇతర రాష్ట్రాలకు తరలివెళ్లే ప్రమాదం ఉన్నదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అంతర్జాతీయ వేదికగా అభాసుపాలు

సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు చాలా మందిని అయోమయానికి గురిచేశాయని పేర్కొంటున్నారు. ఏఐని వినియోగించే బహుళజాతి ఐటీ కంపెనీలపై పన్ను వేయడం ఒక రాష్ట్రానికి సాధ్యమేనా? అని ఐటీ నిపుణులు ప్రశ్నిస్తున్నారు. ఏఐ వాడితే శిక్ష వేస్తామన్నట్టుగా హెచ్చరిస్తే ఏ రాష్ట్రమైనా ఏఐ వాడే కంపెనీలపై పన్ను విధిస్తే, అక్కడికి వచ్చి ఎందుకు పెట్టుబడులు పెడతాయని పేర్కొంటున్నారు. ఇలాంటి అజ్ఞానపు ప్రకటనలతో అంతర్జాతీయ వేదికపై రాష్ట్రం పరువును మంటగలిపారని నెటిజన్లు మండిపడుతున్నారు.

రాఘువ కన్‌స్ట్రక్షన్స్ బరితెగింపు

నిబంధనలు తుంగలో తొక్కి దర్జాగా దందా • జీవో 111 పరిధిలోనే అక్రమంగా స్టోన్ క్రషర్లు

- కొత్వాల్‌గూడలో కాలుష్య పరిశ్రమలేవీ పెట్టొద్దు
- కానీ డీజిల్ జనరేటర్లతో భారీ క్రషర్ నడుపుతున్నరు
- మైనింగ్ శాఖలో పెద్ద ఎత్తున అవినీతి, కుంభకోణం
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతున్నది
- కంపెనీ 2 సార్లు పట్టుబడ్డా సర్కార్ మౌనమెందుకు?
- ధైర్యముంటే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించండి
- విపక్ష సభ్యులతో హౌస్ కమిటీ ఏర్పాటు చేయండి
- పొంగులేటి రాజీనామా చేసి విచారణ ఎదుర్కోవాలి
- సభలో బీఆర్‌ఎస్‌ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్
- తాను చెప్పింది తప్పయితే ఉరి తీయాలని సవాల్



హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ) : ఎలాంటి అనుమతులు లేకుండానే జీవో 111 పరిధిలో రాఘువ కన్‌స్ట్రక్షన్స్ భారీ స్టోన్ క్రషర్ ఏర్పాటు చేసిందని, డీజిల్ జనరేటర్లపై నడుపుతూ నిబంధనలను తుంగలో తొక్కి యథేచ్ఛగా అక్రమ దందా కొనసాగిస్తున్నదని బీఆర్‌ఎస్‌ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దీనిపై విపక్ష సభ్యులతో హౌస్ కమిటీ ఏర్పాటు చేయాలని, లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. శనివారం శాసనసభలో మైనింగ్ శాఖ పద్దులపై జరిగిన చర్చ సందర్భంగా హరీశ్ మాట్లాడుతూ మైనింగ్ శాఖలో పెద్ద ఎత్తున అవినీతి, కుంభకోణం జరుగుతున్నదని, దీనివల్ల రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతున్నదని తెలిపారు. అక్రమ మైనింగ్ యథేచ్ఛగా జరుగుతున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నదని విమర్శించారు. రాఘువ కన్‌స్ట్రక్షన్స్ అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నదని పేర్కొంటూ పలు ఆధారాలు, అధికారులు ఇచ్చిన నోటీసులను సభ ముందుంచారు. గనుల శాఖ అనేది ప్రభుత్వానికి నాన్-ట్యాక్స్ రెవెన్యూ తెచ్చిపెట్టే అత్యంత కీలకమైన శాఖ అని, ఇలాంటి శాఖలో అధికారులు, ప్రభుత్వం ఎంత జాగ్రత్తగా పనిచేస్తే ఖజానాకు అంత ఆదాయం వస్తుందని, ఆ నిధులతో అభివృద్ధి, సంక్షేమం చేపట్టవచ్చని తెలిపారు. కానీ ఇవాళ మైనింగ్ శాఖలో పెద్ద ఎత్తున అవినీతి, కుంభకోణం జరుగుతున్నదని, ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతున్నదని, రాష్ట్ర ఆదాయానికి తూట్లు పడొద్దు అన్నదే తమ తపన అని చెప్పారు. హైదరాబాద్ నడిబొడ్డున, నగరాన్ని ఆనుకునే పెద్ద ఎత్తున అక్రమ మైనింగ్ వ్యాపారాలు జరుగుతున్నాయని వివరించారు. 'రాజ్యాంగం మీద ప్రమాణం చేసి వచ్చిన మనందరికీ రాష్ట్ర వనరులను కాపాడే బాధ్యత ఉన్నది. జీవో 111ను ఉల్లంఘిస్తూ రాఘువ కన్‌స్ట్రక్షన్స్ అక్రమ దందా కొనసాగిస్తున్నది. నిబంధనలు పాటించకుండా, అనుమతులు సైతం లేకుండానే దర్జాగా దందా చేస్తున్నది. నిబంధనల ప్రకారం జీవో111 పరిధిలోని శంషాబాద్ మండలం కొత్వాల్ గూడలో (సర్వే నంబర్ 62, 63) ఎలాంటి కాలుష్య పరిశ్రమలు పెట్టకూడదు. కానీ అక్కడ రాఘువ కన్‌స్ట్రక్షన్స్ భారీ స్టోన్ క్రషర్‌ను డీజిల్ జనరేటర్లపై ఇష్టారాజ్యంగా నడుపుతున్నది. ఈ ప్రభుత్వం తెచ్చిన జీవో 26 (స్టోన్ క్రషర్ రూల్స్ 2026) ప్రకారం, స్టోన్ క్రషర్ పెట్టాలంటే మినరల్ డీలర్ లైసెన్స్ (ఎండీఎల్) ఉండాలి. పరిశ్రమల శాఖ నుంచి అనుమతులు తీసుకోవాలి. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి నుంచి సీఏఫ్ఈ (కన్సెంట్ ఆఫ్ ఎస్టాబ్లిష్‌మెంట్), సీఎఫ్‌వో (కన్సెంట్ ఆఫ్ ఆపరేషన్) సర్టిఫికెట్లు తీసుకోవాలి. ఇందులో ఏ ఒక్క నిబంధన కూడా రాఘువ కన్‌స్ట్రక్షన్స్ పాటించలేదు. రాఘవా కన్‌స్ట్రక్షన్స్‌కు ఎండీఎల్ లైసెన్స్ కానీ, సీఎఫ్ఈ, సీఎఫ్‌వో సర్టిఫికెట్లు కానీ లేవు. రిజిస్ట్రేషన్ కూడా లేదు. విద్యుత్తు కనెక్షన్ లేకుండా డీజిల్ జనరేటర్ల మీద క్రషర్ నడుపుతున్నారు. కరెంట్ కనెక్షన్ తీసుకోవాలంటే ఈ అనుమతులన్నీ ఉండాలి. అవి లేనందున డీజిల్ జనరేటర్లతో క్రషింగ్ చేస్తున్నారు' అని ఆధారాలతో వివరించారు.

> ఇక్కడ ఎలాంటి అనుమతులు లేకుండా డీజిల్ జనరేటర్‌పై స్టోన్ క్రషర్ నడుపుతూ కాలుష్యానికి పాల్పడుతున్నారని స్వయంగా మైనింగ్ అధికారులే పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు లేఖ రాసింద్రు. రెండుసార్లు అధికారుల తనిఖీల్లో రాఘువ కన్‌స్ట్రక్షన్స్ పట్టుబడినా ఈ ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉన్నది? ఆ కంపెనీపై ఎందుకింత ప్రేమ?
>
> -హరీశ్‌రావు

ప్రభుత్వం ఎందుకు మౌనం?

ఈ దారుణమైన దోపిడీని క్రోనాలజీ ప్రకారం సభ ముందు పెడుతున్నట్టు హరీశ్ పేర్కొన్నారు.'2025, మే 21న మైనింగ్ శాఖ డైరెక్టర్ జనరల్ స్వయంగా ఈ క్రషర్‌పై తనిఖీకి ఆదేశించగా రెవెన్యూ, పీసీబీ, ఎన్పీడీసీఎల్, మైనింగ్ తదితర శాఖల అధికారులు సంయుక్తంగా దాడులు చేసి 5,130 మెట్రిక్ టన్నుల అక్రమ రఫ్ స్టోన్ నిల్వలు పట్టుకున్నారు. 2026, ఫిబ్రవరి 13న డిమాండ్ నోటీసుకు ఆదేశించారు. కానీ రాఘువ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ పట్టించుకోలేదు. 2026, మార్చి 4న మళ్లీ తనిఖీ చేయగా ఏకంగా 11,200 మెట్రిక్ టన్నుల ముడి సరుకు దొరికింది. 2026, మార్చి 13న మరో షోకాజ్ నోటీస్ (నం-788) ఇచ్చారు. 2026, మార్చి 5న ఎలాంటి అనుమతులు లేకుండా డీజిల్ జనరేటర్‌పై స్టోన్ క్రషర్ నడుపుతున్నారు, కాలుష్యానికి పాల్పడుతున్నారని పేర్కొంటూ స్వయంగా మైనింగ్ అధికారులే పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు లేఖ రాశారు. మైనింగ్ చట్టం ప్రకారం.. ఎండీఎల్ లైసెన్స్ లేకుండా క్వారీ చేస్తే మొదటిసారి రూ.10,000, రెండోసారి కూడా పట్టుబడితే రూ.25 వేల జరిమానాతో పాటు ఏడాది కఠిన కారాగార శిక్ష విధించాలి. రాఘువ కన్‌స్ట్రక్షన్స్ రెండు సార్లు పట్టుబడింది. మరి ఎందుకు ఈ ప్రభుత్వం మౌనంగా ఉన్నది? ఆ కంపెనీపై ఎందుకింత ప్రేమ? ఇప్పటివరకు మీరు తీసుకున్న కఠిన చర్యలు ఏమిటో సమాధానం చెప్పాలి' అని డిమాండ్ చేశారు.

> మూసీలో కాలుష్యం జరుగవద్దని ముఖ్యమంత్రి అంటరు. కానీ ఇక్కడ రాఘువ కన్‌స్ట్రక్షన్స్ వల్ల మూసీ నది, గండిపేట్, హిమాయత్‌సాగర్ కాలుష్యమవుతున్నయని మైనింగ్ అధికారులే లిఖిత పూర్వకంగా రాసిచ్చింద్రు. దీనిపై ముఖ్యమంత్రి ఏం సమాధానం చెప్తరు?
>
> -హరీశ్‌రావు

ప్రతిపక్షానికో న్యాయం.. మంత్రులకో న్యాయమా?

పటాన్‌చెరు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి తమ్ముడి స్టోన్ క్రషర్‌లో చిన్న తప్పు జరిగిందని ఆయనను రాత్రికి రాత్రే అరెస్ట్ చేసి నెల రోజులు జైల్లో పెట్టారని హరీశ్‌రావు గుర్తుచేశారు. రాఘువ కన్‌స్ట్రక్షన్స్ విషయంలో మాత్రం ఎలాంటి చర్యలూ తీసుకోలేదని, ప్రతిపక్షానికి ఒక న్యాయం, అధికార పార్టీ మంత్రులకు ఒక న్యాయం ఉంటుందా? అని ప్రశ్నించారు.

హౌస్ కమిటీ వేయండి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఓబులాపురం మైన్స్‌పై ఆరోపణలు వస్తే అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హౌస్ కమిటీ వేసి, ఆరోపణలు చేసిన నాగం జనార్దన్‌రెడ్డినే కమిటీకి చైర్మన్‌గా వేశారని హరీశ్ గుర్తుచేశారు. ఇప్పుడు కూడా అలానే హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. 'నేను ముఖ్యమంత్రికి, ఈ ప్రభుత్వానికి సవాల్ విసురుతున్నా.. మీ దగ్గర నిజాయితీ ఉంటే.. ఈ కుంభకోణంతో మీకు సంబంధం లేకపోతే.. ప్రతిపక్ష సభ్యులతో హౌస్ కమిటీ వేయండి. లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించండి. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై మాకు ఎలాంటి వ్యక్తిగత ద్వేషం లేదు. ఆయన గతంలో మాతో కలిసి పనిచేసింద్రు. కానీ, తప్పు జరిగినప్పుడు.. ఆ తప్పును ఆధారాలతో సహా బయటకు తీయడం, రాష్ట్ర ఖజానాను కాపాడటం ప్రతిపక్షంగా మా బాధ్యత' అని వివరించారు.

పొంగులేటి రాజీనామా చేయాలి

'రాఘువ కన్‌స్ట్రక్షన్స్‌కు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ఏం సంబంధం? అని మైనింగ్ శాఖ మంత్రి అడుగుతున్నారు. గతంలో ఇదే రాఘువ కన్‌స్ట్రక్షన్స్ అక్రమాలపై మేము ట్విట్టర్‌లో పెడితే మంత్రి పొంగులేటి ప్రెస్ మీట్ పెట్టి 'నాపై మొరిగే కుక్కలను గొలుసు కట్టి ఎలా కట్టేయాలో మాకు బాగా తెలుసు' అన్నారు. ఆయనకేం సంబంధం లేకపోతే ఎందుకు భుజాలు తడుముకున్నారు?' అని హరీశ్ ప్రశ్నించారు. మంత్రి పొంగులేటి తక్షణమే నైతికంగా రాజీనామా చేసి విచారణ ఎదుర్కోవాలని డిమాండ్ చేశారు. 'నిన్న మంత్రి సీతక్క మాట్లాడుతూ 'గత ప్రభుత్వంలో తప్పులు జరిగాయి.. మేం చేస్తే తప్పేంటి?' అన్నట్టు మాట్లాడారు. ఏ ప్రభుత్వమైనా తప్పు చేయడానికి వీల్లేదు. మీరు అధికారంలో ఉన్నరు. కాళేశ్వరం కమిషన్ వేసింద్రు. విద్యుత్తు కమిషన్ వేసింద్రు. మీ చేతుల్లో అధికారం ఉన్నది. ఎంక్వయిరీ చేసుకోండి' అని తేల్చిచెప్పారు.

నేను చెప్పింది తప్పయితే ఉరి తీయండి

హరీశ్ మాట్లాడుతుండగా మంత్రి శ్రీధర్ బాబు జోక్యం చేసుకుంటూ 'వ్యక్తిని, కంపెనీని లక్ష్యంగా చేసుకొని అప్రదిష్టపాలు చేసేలా మాట్లాడటం సరికాదు' అని పేర్కొన్నారు. దీనిపై హరీశ్ స్పందిస్తూ 'నేను అసత్య ఆరోపణలు చేస్తే నన్ను ఉరి తీయండి.. శాసన సభ్యుడిగా సస్పెండ్ చేయండి' అని సవాల్ విసిరారు. అదే సమయంలో తాను చెప్పింది నిజమని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారిక డాక్యుమెంట్లు, డేటా ఆధారంగా తాను మాట్లాడుతున్నట్టు చెప్పారు. స్టోన్ క్రషర్‌లో చిన్న పొరపాటు జరిగిందనే కారణంతో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తమ్ముడిని నెలరోజులు జైల్లో పెట్టారని పేర్కొంటూ, ప్రతిపక్షానికి ఒక న్యాయం, అధికార పక్షానికి మరో న్యాయం ఉంటుందా? అని నిలదీశారు. చట్టం అందరికీ సమానంగా ఉండాలని సూచించారు. 'నేను చేస్తున్నది ఆరోపణలు కాదు.. డిపార్ట్‌మెంట్ అధికారులు ఇచ్చిన నోటీసులనే చదివి చెప్తున్నా.. ఎన్ని విచారణలు చేస్తారో చేయాలి.. కానీ, ముందుగా రాఘువ కన్‌స్ట్రక్షన్స్‌పై చర్యలు తీసుకోవాలి' అని డిమాండ్ చేశారు.

అసెంబ్లీ సాక్షిగా సీఎం పచ్చి అబద్ధాలు

అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి పచ్చి అబద్ధాలు మాట్లాడారని హరీశ్ నిప్పులు చెరిగారు. సభ వాయిదా పడిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, రాఘువ కన్‌స్ట్రక్షన్స్ మంత్రి పొంగులేటిది కాదని ముఖ్యమంత్రి చెప్పడం దుర్మార్గమని పేర్కొన్నారు. మంత్రి పొంగులేటికి ఆయన భార్య, కొడుకు, తమ్ముడు దూరపు బంధువులు ఎలా అవుతారని ప్రశ్నించారు. రాఘువ పేరు స్వయానా పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తండ్రి పేరని, ఆ కంపెనీ ఆయనదేనని లోకమంతా తెలుసని చెప్పారు. పొంగులేటి సతీమణి మాధురి, కొడుకు హర్ష రెడ్డి, తమ్ముడు ప్రసాద్‌రెడ్డి రాఘువ కన్‌స్ట్రక్షన్స్ డైరెక్టర్లుగా ఉన్న కంపెనీ ఇతరులది ఎలా అవుతుందని ప్రశ్నించారు. అయినా అది పొంగులేటి దూరపు బంధువులదని అసెంబ్లీ సాక్షిగా పేర్కొంటూ, సీఎం అసెంబ్లీని తప్పుదోవ పట్టించారని విమర్శించారు. సభలో కాంగ్రెస్ సర్కార్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నదని, అక్రమాలపై ప్రశ్నిస్తే డొంకతిరుగుడు సమాధానాలు చెప్తున్నదని దుయ్యబట్టారు. రాఘువ కన్‌స్ట్రక్షన్స్ అవినీతి, అక్రమాలపై ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జవాబుదారీతనం లేకుండా సభలో దాటవేత ధోరణి ప్రదర్శిస్తున్న కాంగ్రెస్ పాలకుల తీరు శోచనీయమని వాపోయారు.

> రాఘువ కన్‌స్ట్రక్షన్స్‌కు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ఏం సంబంధమని మైనింగ్ శాఖ మంత్రి అడుగుతున్నరు. గతంలో ఇదే రాఘువ కన్‌స్ట్రక్షన్స్ అక్రమాలపై మేం ట్విట్టర్‌లో పెడితే మంత్రి పొంగులేటి ప్రెస్ మీట్ పెట్టి 'నాపై మొరిగే కుక్కలను గొలుసు కట్టి ఎలా కట్టేయాలో మాకు బాగా తెలుసు' అన్నరు. ఆయనకు ఏం సంబంధం లేకపోతే ఎందుకు భుజాలు తడుముకున్నరు?
>
> -హరీశ్‌రావు

అవును.. రాఘువ కన్‌స్ట్రక్షన్స్‌ది తప్పే!

అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్, మైనింగ్ మంత్రి వివేక్ అంగీకారం

కంపెనీ చేసిన అక్రమాలను స్వయంగా వెల్లడించిన మంత్రులు

నోటీసులిచ్చి పన్నులు వసూలు చేసినట్టు మంత్రుల ఒప్పుకోలు

అక్రమ మైనింగ్‌పై అసెంబ్లీ హౌస్ కమిటీ వేసేందుకు నిరాకరణ

హైదరాబాద్, మార్చి 28(నమస్తే తెలంగాణ): రాఘువ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ అక్రమంగా మైనింగ్(క్రషింగ్) చేసినట్టు అసెంబ్లీ సాక్షిగా స్వయంగా సీఎం రేవంత్ అంగీకరించారు. ఆయనతో పాటు మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి సైతం అంగీకరించారు. అసెంబ్లీలో రాఘువ కన్‌స్ట్రక్షన్ చేసిన అక్రమాలను ఇద్దరు మంత్రులు స్వయంగా వెల్లడించారు. సదరు కంపెనీ మంత్రి పొంగులేటి కుటుంబానిదేననే ఆరోపణలున్న నేపథ్యంలో ఒక మంత్రికి సంబంధించిన కంపెనీ అక్రమాలను సీఎం సహా మైనింగ్ శాఖ మంత్రి ఒప్పుకోవడం సంచలనం రేపింది. ఈ వ్యవహారంపై ప్రభుత్వంలో, కాంగ్రెస్‌లో చర్చ జరుగుతున్నది. సీఎం రేవంత్ కల్పించుకొని మరీ రాఘువ కన్‌స్ట్రక్షన్ తప్పు చేసిందని వెల్లడించడమే గాక.. అనుమతులు లేకుండా క్రషర్ నడుతున్నట్టు తెలిపారు. మైనింగ్ అండ్ జియాలజీ రంగారెడ్డి ఏడీ ఫిర్యాదు ఆధారంగా కంపెనీ నుంచి బకాయిలు వసూలు చేశామని తెలిపారు. సదరు కంపెనీ అక్రమంగా మైనింగ్ చేసిందని అంగీకరించడం గమనార్హం. అక్రమ క్రషింగ్‌పై రాఘువ కంపెనీకి నోటీసులు ఇచ్చినట్టు తనకు తెలియదని ఆ శాఖ మంత్రి వివేక్ చెప్పడం గమనార్హం. ఇప్పటివరకు రూ.1.22 కోట్లు, మరో అంశంలో రూ.1.52 కోట్ల బకాయిలను వసూలు చేశామని.. మరో రూ.4లక్షలు చెల్లించలేదని, ఈ మాత్రం దానికే ఇంత రాద్ధాంతం చేస్తారా అంటూ ప్రశ్నించారు. అక్రమ మైనింగ్‌పై నిగ్గుతేల్చేందుకు అసెంబ్లీ హౌస్‌కమిటీని వేయాలనే బీఆర్‌ఎస్ డిమాండ్‌ను కొట్టిపారేశారు. 'ఈ చిన్న విషయానికే హౌస్ కమిటీకి ఒప్పుకొనేది లేదు. శాఖా పరమైన విచారణ చేస్తాం.. అందులో ఏమైనా తేలితే అప్పుడు హౌస్ కమిటీ వేస్తాం' అంటూ మంత్రి ప్రకటించారు. మంత్రి అక్రమాలు ఎక్కడ ప్రజలకు తెలుస్తాయోననే హౌస్ కమిటీ వేసేందుకు సర్కార్ వెనుకంజ వేస్తున్నదని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ఆరోపించారు.

అసెంబ్లీలో మైనింగ్ మంటలు

రాఘువ కన్‌స్ట్రక్షన్స్‌పై సీబీసీఐడీ విచారణ

తప్పుచేసింది కాబట్టే నోటీసులు ఇచ్చి పన్నులు వసూలు చేశాం

2014 నుంచి అన్ని మైనింగ్ లీజులపై విచారణ చేయిస్తాం

సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన

ఆ కంపెనీతో మంత్రి పొంగులేటికి, ఆయన కుటుంబసభ్యులకు సంబంధం లేదని వెల్లడి

హైదరాబాద్, మార్చి 28(నమస్తే తెలంగాణ): రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కుటుంబానికి సంబంధించినదని ఆరోపణలున్న రాఘువ కన్‌స్ట్రక్షన్స్ అక్రమ మైనింగ్‌పై సీబీసీఐడీ విచారణకు ఆదేశిస్తున్నట్టు సీఎం రేవంత్ అసెంబ్లీలో ప్రకటించారు. 2014 జూన్ 2నుంచి ఇప్పటివరకు జరిగిన మైనింగ్ లీజులపైనా వచ్చే అసెంబ్లీ సమావేశాల్లోపు విచారణ నివేదికను సభలో ప్రవేశపెట్టి నిజానిజాలు నిగ్గుతేలుస్తానని హెచ్చరించారు. మంత్రి అక్రమాలను బీఆర్‌ఎస్ బయటపెట్టిందనే కోపంతో సీఎం రేవంత్ బీఆర్‌ఎస్ మాజీ మంత్రులపై మరోసారి తన అక్కసు వెళ్లగక్కారు. ఈ సందర్భంగా ఒక్కొక్కడి సంగతి చూస్తానంటూ బీఆర్‌ఎస్ మాజీ మంత్రులను ఉద్దేశించి వ్యాఖ్యానించడం గమనార్హం. శనివారం రాఘువ కన్‌స్ట్రక్షన్స్ అవకతవకలపై అసెంబ్లీలో మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన ఆరోపణలపై సీఎం స్పందించి.. ఆ కంపెనీ తప్పు చేసినట్టు ఒప్పుకొన్నారు. సదరు సంస్థకు నోటీసులు ఇచ్చి బకాయిలు తీసుకోవడమే కాకుండా అనుమతులు కూడా పరిశీలించి చర్యలు తీసుకోవాలని సూచించినట్టు తెలిపారు. పొంగులేటి కుటుంబానికో లేదా వారి బంధువులకు వ్యాపారాలుంటే మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ఏం సంబంధమని సీఎం ప్రశ్నించారు. ఏపీ, తెలంగాణలో ఏ రెడ్డిని తీసుకున్నా ఒక రెడ్డికి మరో రెడ్డికి దూరపు బంధుత్వమో, దగ్గరి బంధుత్వమో ఉంటుందని సెలవిచ్చారు. ఇలా మంత్రి కుటుంబానికి గల వ్యాపారాలతో సదరు మంత్రికి సంబంధం ఉండదంటూ సీఎం ప్రకటించడం గమనార్హం. అయితే వాస్తవ విషయం ఏమిటంటే రాఘువ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీలోని రాఘువ పేరు స్వయంగా పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తండ్రి పేరు కావడం గమనార్హం. అదే విధంగా ఈ కంపెనీలో డైరెక్టర్లుగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తనయుడు హర్ష, సోదరుడు ప్రసాద్‌రెడ్డి, ఆయన భార్య సైతం డైరెక్టర్లుగా ఉండడం గమనార్హం. ఇలా కంపెనీలో డైరెక్టర్లుగా ఉన్న కొడుకు, సోదరుడు దూరపు బంధువులు ఎలా అవుతారనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.

మొదటిపేజీ తరువాయి...

దిగారు. హరీశ్‌రావు వ్యాఖ్యలపై స్పందించిన మంత్రి శ్రీధర్‌బాబు.. ఆ వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని, పొంగులేటికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. దీంతో నిబంధనలకు విరుద్ధంగా క్రషింగ్ జరుగుతుంటే.. అతనిపై చర్యలు తీసుకోకుండా, తమను క్షమాపణ చెప్పమంటరా? అంటూ బీఆర్‌ఎస్ నేతలు మండిపడ్డారు. ఇదే విషయమై మంత్రులు పదేపదే అడ్డు తగులుతూ.. హరీశ్‌రావు స్పీచ్‌కు భంగం కలిగించారు. అయితే, గతంలో ఓబులాపురం గనుల్లో జరిగిన అక్రమాలపై నాడు వైఎస్‌ఆర్ ఆరోపణలు చేసిన సభ్యుడినే చైర్మన్‌గా నియమిస్తూ 'హౌస్ కమిటీ' వేశారని హరీశ్‌రావు గుర్తుచేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తమ చిత్తశుద్ధిని నిరూపించుకునేందుకు రాఘువ కన్‌స్ట్రక్షన్స్ అక్రమాలపై కూడా 'హౌస్ కమిటీ' వేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని, అప్పటివరకూ ఆయన నైతిక బాధ్యత వహిస్తూ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మంత్రి పదవికి రాజీనామా చేయాలని హరీశ్‌రావు పట్టుబట్టారు.

నినాదాలు, చప్పట్లతో దద్దరిల్లిన సభ..

మంత్రి పొంగులేటి తక్షణం రాజీనామా చేయాలంటూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు సభలో పెద్దపెట్టున నినాదాలు చేశారు. 'విప్ వాంట్ హౌస్ కమిటీ' 'మైనింగ్ స్కామ్ చేస్తున్న పొంగులేని శ్రీనివాస్‌రెడ్డి రాజీనామా చేయాలి' 'తప్పు చేయకపోతే భయం ఎందుకు?' 'పొంగులేటి.. రాజీనామా చేయాలి' అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. మాజీ మంత్రి కేటీఆర్ నినాదాలు ఇస్తుండగా.. మిగతా సభ్యులు గట్టిగా మద్దతు పలికారు. ఈ క్రమంలో మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పదేపదే అడ్డంకులు సృష్టించారు. దీంతో పోడియం వద్ద కూర్చున్న వారికి మద్దతుగా మాజీ మంత్రులు కేటీఆర్, పద్మారావు గౌడ్, మల్లారెడ్డి, తలసాని, వేముల ప్రశాంత్ రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాణిక్‌రావు, చింతా ప్రభాకర్, సునీతాలక్ష్మారెడ్డి, కోవా లక్ష్మి, అనిల్‌జాదవ్ తదితరులు వారి పక్కనే నిలబడి నినాదాలతో హోరెత్తించారు. బీఆర్‌ఎస్ నేతల ఆందోళనతో నేరుగా రేవంత్ రెడ్డి రంగంలోకి దిగాల్సి వచ్చింది.

అర్ధాంతరంగా సభ నేటికి వాయిదా

నినాదాలు, నిరసనలతో రెండు గంటలుగా బీఆర్‌ఎస్ సభ్యులు రెండు గంటల పాటు సభను స్తంభింపచేశారు. ప్రతిపక్షం పూర్తి ఆధారాలతో మంత్రి పొంగులేటికి చెందిన రాఘువా కన్‌స్ట్రక్షన్స్ అవినీతిని బయటపెట్టడంతో అధికారపక్షం ఒక్కసారిగా అవాక్కయింది. దానిని కవర్ చేసుకునేందుకు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రులు, విప్‌లు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు నానా తంటాలు పడ్డారు. చివరకు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల ఆందోళనతో దిగొచ్చిన రేవంత్‌రెడ్డి.. పొంగులేటికి చెందిన రాఘువ కన్‌స్ట్రక్షన్స్‌పై సీబీసీఐడీ విచారణ జరిపిస్తాం అంటూ సభలో ప్రకటన చేశారు. దీంతో పద్దులపై ఎలాంటి చర్చ లేకుండానే అర్ధాంతరంగా శాసనసభను ప్యానల్ స్పీకర్ బాలునాయక్ ఆదివారానికి వాయిదా వేశారు. అనంతరం బీఆర్‌ఎస్ సభ్యులు నినాదాలు చేసుకుంటూ లాబీల్లోకి వచ్చారు. అక్కడ కూడా పెద్దపెట్టున నినాదాలు చేస్తూ.. హౌస్ కమిటీ వేయాలని, పొంగులేటి రాజీనామా చేయాలని కోరారు. దీంతో బీఆర్‌ఎస్‌ఎల్పీ వద్ద భారీగా పోలీసులతో మోహరించారు.



స్పీకర్ పోడియం వద్ద నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు

పోడియం వద్ద కూర్చొని నిరసన

రాఘువ కన్‌స్ట్రక్షన్స్‌కు మంత్రి పొంగులేటికి ఎలాంటి సంబంధం లేదని మంత్రి శ్రీధర్ బాబు స్టేట్‌మెంట్ ఇవ్వడంపై సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. ఆ వెంటనే మైక్ అందుకున్న హరీశ్‌రావు.. 'నేను చెప్పే మాటల్లో అబద్ధమైతే నన్ను ఉరి తీయండి.. లేదంటే సభ నుంచి సస్పెండ్ చేయండి. నా ఆరోపణలు నిజమైతే.. వెంటనే పొంగులేటితో రాజీనామా చేయించండి' అని డిమాండ్ చేశారు. ఇందుకు కాంగ్రెస్ మంత్రులు ఒక్కొక్కరిగా కలుగజేసుకుంటూ పదేపదే హరీశ్‌రావుకు అడ్డుతగులుతుండటం, స్పీకర్ మైక్ ఇవ్వకపోవడంతో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు తీవ్ర నిరసన తెలిపారు. హరీశ్‌రావుకు మైక్ ఇవ్వాలని, హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, బండారు లక్ష్మారెడ్డి, విజయుడు, పాడి కౌశిక్‌రెడ్డి, డాక్టర్ సంజయ్, కాలేరు వెంకటేశ్, కేవీ వివేకానంద, కొత్త ప్రభాకర్‌రెడ్డి తదితరులు స్పీకర్ పోడియం వద్ద కూర్చొని నిరసన తెలిపారు. చీఫ్ మార్షల్ సభలోకి వచ్చి.. మరింత మంది మార్షల్స్‌తో మోహరించారు. శాంతియుతంగానే పోడియం వద్ద నిరసన తెలుపుతుండగా.. 12 మంది మార్షల్స్‌ను రంగంలోకి దించారు.

ఆరుగురు మంత్రులు.. 15 సార్లు అడ్డగింత

మైనింగ్‌శాఖ పద్దులపై చర్చ బీఆర్‌ఎస్ తరపున హరీశ్‌రావు మాట్లాతుండగా ఆరుగురు మంత్రులు సుమారు 15సార్లు అడ్డుతగిలారు. అయినా, కాంగ్రెస్ మంత్రులకు, విప్‌లకు ఆయన దీటుగా సమాధానం చెప్పారు. ఆధారాలతో సహా చెప్పి, అధికారపక్షం గుండెల్లో రైళ్లు పరుగెత్తించారు. సభలో హరీశ్‌రావు స్పీచ్ ప్రారంభించిన కొద్దిసేపటికే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కల్పించుకొని.. అసెంబ్లీలో ఆ అంశం మరొకసారి మాట్లాడొద్దు అంటూ పద్దులపైనే మాట్లాడాలని డైవర్ట్ చేశారు. దీంతో ప్యానెల్ స్పీకర్‌గా ఉన్న బాలునాయక్ కూడా పద్దులపైనే మాట్లాడాలని హరీశ్‌రావుకు సూచించారు. ఇక బీఆర్‌ఎస్ ప్రస్తావించిన అంశం తమకు ఇబ్బంది కలుగుతుందని గ్రహించిన మైనింగ్‌శాఖ మంత్రి వివేక్.. అధికారుల నుంచి వివరాలు తెప్పించుకున్నారు. అక్రమ క్రషింగ్‌పై రాఘువ కన్‌స్ట్రక్షన్ కంపెనీకి నోటీసులు ఇచ్చినట్టు తనకు ఇప్పటివరకు తెలియదని నోరు జారారు. దీన్ని కవర్ చేసుకునేందుకు వెంటనే మైక్ అందుకున్న మంత్రి శ్రీధర్‌బాబు.. ఈ అక్రమ మైనింగ్‌లో ఉన్నది ఎంతటి వారైనా చర్యలు తీసుకుంటామని చెప్పారు. వెంటనే హరీశ్‌రావుకు మైక్ రావడంతో.. 'నేను అసత్య ఆరోపణలు చేస్తే నన్ను ఉరి తీయండి.. శాసన సభ్యుడిగా సస్పెండ్ చేయండి' అని సవాల్ విసిరారు. అదే సమయంలో తాను చెప్పింది నిజమని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారిక డాక్యుమెంట్లు, డేటా ఆధారంగా తాను మాట్లాడుతున్నట్టు చెప్పారు. ప్రతిపక్షానికి ఒక న్యాయం, అధికార పక్షానికి మరో న్యాయం ఉంటుందా? అని నిలదీశారు. చట్టం అందరికీ సమానంగా ఉండాలని సూచించారు. ఆ వెంటనే మంత్రి వివేక్ వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. ఆ తర్వాత మంత్రి వాకిటి శ్రీహరి కల్పించుకొని గత ప్రభుత్వంలోనూ మైనింగ్‌లో అక్రమాలు జరిగాయంటూ ఆధారాలు లేకుండా పొలిటికల్ స్పీచ్ ఇచ్చారు. ఆ తర్వాత పర్యావరణ సంస్థల నుంచి నోటీసులు అందుకున్న రాఘువ కన్‌స్ట్రక్షన్ నిర్వాహకులను ఎందుకు అరెస్టు చేయరు? అని డిమాండ్ చేసినప్పుడు మళ్లీ మైక్ కట్ చేశారు. అప్పుడు శ్రీధర్‌బాబు మైక్ అందుకొని హరీశ్‌రావు క్షమాపణ చెప్పాలని కొత్తరాగం అందుకున్నారు. ఒక్కసారిగా పొంగులేటికి మద్దతుగా మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, సీతక్కలు అడ్డుతగిలారు. అయినా మైక్ ఇవ్వకుండా మళ్లీ వివేక్, శ్రీధర్‌బాబు, శ్రీహరి, విప్ ఆది శ్రీనివాస్‌లు పొంగులేటిని అనుకూలంగా మాట్లాడారు. హరీశ్‌రావుకు మైక్ ఇవ్వకపోవడంతో ప్రతిపక్ష నుంచి నిరసనలు మిన్నంటాయి. బీఆర్‌ఎస్ ఆధారాలతో సహా సభలో వెలుగు తీసిన అక్రమాలను కవర్ చేసేందుకు స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి రావాల్సి వచ్చింది. వచ్చీ రావడంతోనే అధికారుల వద్దకు వెళ్లి పలు అంశాలపై రిపోర్టులు కోరారు. సీఎం కూడా రిపోర్టుల కోసం సుమారు 15 నిమిషాలు వేచి చూడాల్సి వచ్చింది.

రేవంత్ ఇన్.. పొంగులేటి ఔట్

హైదరాబాద్, మార్చి 28(నమస్తే తెలంగాణ): రాఘువ కన్‌స్ట్రక్షన్ అక్రమాలపై అసెంబ్లీ హౌస్ కమిటీ వేయాలని, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని మంత్రివర్గం నుంచి భర్తరఫ్ చేయాలని బీఆర్‌ఎస్ ఆందోళన చేస్తున్న సమయంలో ఆసక్తికర ఘటన చోటుచేసుకున్నది. అప్పటివరకు సభలోనే ఉన్న మంత్రి పొంగులేటి.. సీఎం రేవంత్ రెడ్డి సభలోకి రాగానే వెళ్లిపోయారు. ఆ తర్వాత మళ్లీ సభలోకి రాలేదు. ఇలా సీఎం సభలోకి రావడం, పొంగులేటి వెళ్లిపోవడంపై అక్కడ చర్చ జరిగింది. తనపై చర్చ జరుగుతున్నప్పుడు సభలో ఉండడం పద్ధతి కాదనే ఉద్దేశంతోనే ఆయన బయటికి వెళ్లిపోయారని అధికార పార్టీ నేతలు చెబుతున్నారు. ఒకవేళ అదే నిజమైతే అంతకు ముందు వరకు ఆయనపై చర్చ జరుగుతున్నప్పుడు ఎందుకు సభలోనే ఉన్నారనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. అయితే రాఘువ కన్‌స్ట్రక్షన్ అక్రమాలపై సీఎం రేవంత్‌రెడ్డి విచారణకు ఆదేశిస్తారని, సీబీసీఐడీ విచారణ వేస్తారనే విషయం తెలిసే పొంగులేటి సభ నుంచి వెళ్లిపోయారనే చర్చ జరుగుతున్నది.



అసెంబ్లీ మీడియా హాల్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యేలు వివేకానంద, పాడి కౌశిక్‌రెడ్డి, మాణిక్‌రావు, డాక్టర్ సంజయ్, విజయుడు

బండారం బయటపెడితే బ్లాక్ మెయిలా?

- రాఘువ కన్‌స్ట్రక్షన్స్ అక్రమ మైనింగ్‌ను అసెంబ్లీ సాక్షిగా బట్టబయలు చేసిన హరీశ్‌రావు
- సమాధానం చెప్పలేకే ఎదురుదాడి
- సీబీసీఐడీ పేరిట బెదిరింపులు
- కాంగ్రెస్ ప్రభుత్వ బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు తలొగ్గేది లేదు
- మాజీ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి ఆగ్రహం

హైదరాబాద్, మార్చి 28(నమస్తే తెలంగాణ): అసెంబ్లీ సాక్షిగా రాఘువ కన్‌స్ట్రక్షన్స్ అక్రమ మైనింగ్ బండారాన్ని బయటపెట్టిన బీఆర్‌ఎస్‌పై అధికార కాంగ్రెస్ బ్లాక్ మెయిల్ రాజకీయాలకు దిగుతున్నదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జీ జగదీశ్‌రెడ్డి ధ్వజమెత్తారు. అసెంబ్లీలో అడ్డంగా దొరికిపోయి తప్పించుకోలేక ఎదురుదాడికి దిగడం దుర్మార్గమని నిప్పులుచెరిగారు. శనివారం అసెంబ్లీ మీడియా హాల్‌లో ఎమ్మెల్యేలు వివేకానంద, పాడి కౌశిక్‌రెడ్డి, మాణిక్‌రావు, డాక్టర్ సంజయ్, విజయుడుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ సొంత ఆస్తులు పెంచుకొనేందుకు యత్నిస్తున్న మంత్రి అవినీతి పర్వాన్ని బీఆర్‌ఎస్‌ఎల్పీ డిప్యూటీ లీడర్ హరీశ్‌రావు ఆధారాలతో బట్టబయలు చేశారని గుర్తుచేశారు. స్పందించాల్సిన మంత్రి మిన్నకుండి పోతే, సభలోని ఎనిమిది మంది మంత్రులు పొంతనలేకుండా మాట్లాడడం ఆక్షేపణీయమని మండిపడ్డారు. మైనింగ్ శాఖ మంత్రి ఆలస్యంగా తేరుకొని రూ.4లక్షలకే సభా సంఘం అడుగుతారా? సిట్టింగ్ జడ్జితో విచారణ వేయమంటరా? అని మాట్లాడిన తీరును చూసి ప్రజలు నివ్వెరపోయారని చెప్పారు. మంత్రి చెప్పినట్టు అది 4లక్షల వ్యవహారం కాదని, అసలు రాఘువ కన్‌స్ట్రక్షన్స్‌కే అనుమతుల్లేవని, అందుకే అధికారులు గుర్తించి నోటీసులు ఇచ్చారని తెలిపారు. కానీ ప్రభుత్వం మాత్రం చర్యలు తీసుకోవడంలో ఉద్దేశపూర్వకంగానే తాత్సారం చేసిందని ఆరోపించారు.

పట్టుకున్న వారిపై విచారణా?

చట్టసభల సాక్షిగా పట్టుబడ్డ దొంగలను శిక్షించాల్సిన సీఎం రేవంత్.. పట్టుకున్న వారిపై విచారణ చేయిస్తామని చెప్పడం సిగ్గుచేటని జగదీశ్‌రెడ్డి దుయ్యబట్టారు. 'గతంలో రూ.50లక్షలతో రేవంత్ పట్టుబడితే.. ప్రస్తుతం వారి మంత్రి పక్కా ఆధారాలతో దొరికిపోయాడు.. ఇక తప్పించుకొనే అవకాశం లేదని తెలిసి ఎదురుదాడికి దిగాడు. ఎవరో అన్నదమ్ములో.. దూరపు బంధువులో అయితే మంత్రికేం సంబంధమని వితండవాదన చేశాడు' అంటూ విమర్శలు గుప్పించారు.

విచారణలకు బీఆర్‌ఎస్ భయపడదు

మంత్రి అవినీతిని కప్పిపుచ్చేందుకే పదేండ్ల కిందటి వ్యవహారాలను సీఎం ముందుకు తెచ్చి విచారణ పేరుతో బెదిరించడం శోచనీయమని జగదీశ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పటికే కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్ లాంటి అంశాలపై విచారణ జరిపించి తేల్చిందేమిటో ప్రజల ముందుపెట్టాలని డిమాండ్ చేశారు. 'గతంలో హరీశ్‌రావు అడిగినందునే కాళేశ్వరంపై, కేటీఆర్ అడిగినందుకే ట్యాపింగ్‌పై విచారణ జరిపిస్తున్నామని పోజులు కొట్టిన రేవంత్.. మరీ ఇప్పుడు 'రాఘువ' అవినీతిపై బీఆర్‌ఎస్ సభాసంఘం వేయాలని అడిగితే, సీబీసీ ఐడీ అంటున్నరు.. మీ బెదిరింపులకు, ఉడుత ఊపులకు బీఆర్‌ఎస్ భయపడబోదు' అని కుండబద్దలు కొట్టారు.

మైనింగ్ ఆదాయం పెంచింది కేసీఆరే..

రాష్ట్రం రాకముందు రూ.39 కోట్లు ఉన్న మైనింగ్ ఆదాయాన్ని రూ.5వేల కోట్లకు పెంచిన ఘనత కేసీఆర్‌కే దక్కిందని జగదీశ్ రెడ్డి తెలిపారు. కానీ అక్రమాలకు తెరలేపిన అధికార పార్టీ 30శాతం ఆదాయం పెంచామని గొప్పలు చెప్పుకోవడం హాస్యాస్పదమని పేర్కొన్నారు.

'నేరెళ్ల' తర్వాత కేటీఆర్ 2సార్లు గెలిచారు

అవినీతి ఊబిలో కూరుకుపోయిన ప్రభుత్వ పెద్ద.. బీఆర్‌ఎస్‌పై బురదజల్లుతూ పబ్బం గడుపుతున్నారని జగదీశ్‌రెడ్డి ధ్వజమెత్తారు. అడ్డంగా దొరికిన ప్రతిసారీ నేరెళ్ల ఘటనను తెరపైకి తెస్తారని విమర్శించారు. ఈ ఘటన తర్వాత కేటీఆర్ రెండుసార్లు గెలిచారని, ఆ గ్రామంలోనూ 500ఓట్లకు పైగా మెజారిటీ వచ్చిన విషయాన్ని గుర్తుచేశారు.

గ్రామాల అభివృద్ధికి నిధులేవి?

- బిడ్డలు పుట్టి, పుట్టినరోజులు వచ్చినా కల్యాణలక్ష్మి వస్తలేదు
- కొత్త పింఛన్లు ఇస్తలేరని సునీతాలక్ష్మారెడ్డి ఆగ్రహం
- కాంగ్రెస్ మోసపూరిత హామీలకు నిరసనగా వాకౌట్



హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ పాలనలో గ్రామాలకు నిధులు ఇవ్వకపోవడంతో అభివృద్ధి కుంటుపడిందని మాజీ మంత్రి సునీతాలక్ష్మారెడ్డి ఆరోపించారు. శనివారం అసెంబ్లీలో పంచాయతీరాజ్‌శాఖ పద్దుల సందర్భంగా జరిగిన చర్చలో ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం విడుదల చేసిన రూ.599 కోట్లు పంచాయతీ కార్మికులు, సిబ్బంది జీతాలకే వెళ్లాయని, గ్రామాల అభివృద్ధికి నిధులు ఎప్పుడు ఇస్తారని నిలదీశారు. 99 రోజుల ప్రణాళికలోనూ నిధులు కేటాయించకపోగా, పంచాయతీ సిబ్బంది సొంత నిధులతో ప్రణాళికను విజయవంతం చేయాలని ఆదేశాలివ్వడం దారుణమని మండిపడ్డారు. ఇందిరా మహిళాశక్తికి గతంలో రూ.110 కోట్లు కేటాయించినా రూపాయి ఖర్చు చేయలేదని ఆరోపించారు. ఈ బడ్జెట్‌లో మళ్లీ రూ.110 కోట్లు కేటాయించారని, ఈ నిధులతోనైనా పట్టణాల్లో భవనాలు పూర్తి చేయాలని కోరారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద 20 రోజుల పనిదినాలు తొలగించి, పూర్తిస్థాయిలో 5.14 లక్షల మందికి పని కల్పించాలని కోరారు.

కొత్తగా ఒక్క పింఛనూ ఇవ్వలే..

కాంగ్రెస్ ప్రభుత్వంలో నేటికీ ఒక్క కొత్త పింఛనూ ఇవ్వలేదని సునీతాలక్ష్మారెడ్డి ఆరోపించారు. భర్త చనిపోతే భార్యకు వితంతు పింఛన్ కింద కన్వర్ట్ చేస్తున్నారే తప్ప, కొత్తగా దరఖాస్తు చేసుకున్నవారికి ఇవ్వడం లేదని పేర్కొన్నారు. దివ్యాంగుల సర్టిఫికెట్లు రెన్యువల్ చేయించకుండా ఉన్న పింఛన్లు తొలగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ నిలిచిపోయాయని, అర్హులైన లబ్ధిదారులకు పెండ్లిళ్లు అయ్యి, పిల్లలు పుట్టి, వారి బర్త్‌డేలు జరుగుతున్నా ఆ చెక్కులు అందకపోవడం దారుణమన్నారు. కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యేలతో కాకుండా ఇన్‌చార్జి మంత్రులు, ఓడిన అభ్యర్థులతో ఇప్పిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలుచేయనందుకు నిరసనగా బీఆర్‌ఎస్ పార్టీ తరపున సభ నుంచి వాకౌట్ చేస్తున్నట్టు సునీతాలక్ష్మారెడ్డి ప్రకటించారు.

గ్రామాల్లో బ్లీచింగ్ కొనేందుకూ నిధుల్లేవు

- బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు

హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ) : గ్రామాల్లో బ్లీచింగ్ కొనేందుకు కూడా ప్రభుత్వం నుంచి నిధులు రావడం లేదని బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు ఆరోపించారు. శనివారం పంచాయతీరాజ్ పద్దులపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ వేసవికి గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. 'అంగన్‌వాడీ భవనాల పూర్తికి నిధులు లేవు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు చెప్పినట్టు ఈ ప్రభుత్వం కొత్త పింఛన్లు ఇవ్వడం లేదు. సిర్పూర్, ఆసిఫాబాద్‌లలో కూడా కొత్త పింఛన్లు ఇవ్వలేదు' అని ఆరోపించారు. మంత్రి సీతక్క వివరణ ఇస్తూ.. నీటి ఎద్దడి నివారణకు రూ.200 కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు.

లోక్‌అదాలత్‌కు విశేష స్పందన

హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌కు కక్షిదారుల నుంచి అనూహ్య స్పందన లభించింది. ఒకేరోజు 11,19,079 కేసులను పరిష్కరించారు. వీటిలో 85,231 ప్రీలిటిగేషన్ కేసులు, 10,31,317 క్రిమినల్ కేసులు, 2,531 సివిల్ కేసులున్నాయి. వివిధ కేసుల్లో లబ్ధిదారులకు రూ.397 కోట్లు పరిహారం చెల్లింపులపై ఉత్తర్వులు జారీచేశారు. మొత్తం 373 లోక్‌అదాలత్ బెంచ్‌లను ఏర్పాటుచేశారు. హైకోర్టులో రెండు, రుణ రికవరీ ట్రిబ్యునల్ రెండు కలుపుకొని మొత్తం 341 బెంచ్‌లను అందుబాటులో ఉంచారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, టీఎస్‌ఎల్‌ఎస్‌ఏ పాట్రన్ ఇన్ చీఫ్ జస్టిస్ అపరేశ్‌కుమార్‌సింగ్, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ పీ శ్యాంకోషి మార్గదర్శకాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా లోక్‌అదాలత్ నిర్వహించారు. మహబూబ్‌నగర్ జిల్లాలో జస్టిస్ శ్యాంకోషి లోక్‌అదాలత్‌ను ప్రారంభించారు.

కేసీఆర్ హయాంలో 46వేల పోలీస్ ఉద్యోగాలు

- బీఆర్‌ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు
- రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు రూ.20వేల కోట్లు ఎక్కడ?
- మాజీ మంత్రి గంగుల నిలదీత
- పోలీసులు, ఆర్టీసీ, బీసీల సంక్షేమంపై ప్రభుత్వ వైఖరికి నిరసనగా బీఆర్‌ఎస్ వాకౌట్



హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ) : కేసీఆర్ హయాంలో రాష్ట్రంలో 46 వేల పోలీస్ ఉద్యోగాలు భర్తీ చేసినట్టు బీఆర్‌ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు వెల్లడించారు. ఈ మేరకు శనివారం అసెంబ్లీలో పోలీసులు, ఆర్టీసీ, బీసీ సంక్షేమంపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్త కమీషనరేట్ల ఏర్పాటు, ఆరోగ్య భద్రత పథకాన్ని కేసీఆర్ అమలుపర్చారని గుర్తుచేశారు. పోలీసులకు సంబంధించి ఏడు టీఏలు, మూడు సరెండర్ లీవులు, ఐదు డీఏలు పెండింగ్ ఉన్నాయని పేర్కొన్నారు. పోలీసుల భద్రత పథకాన్ని కాంగ్రెస్ సర్కార్ లక్షకు పరిమితం చేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. కొత్తగూడెం జిల్లాలో 72 టీఏలు పెండింగ్ ఉన్నాయని, కొన్ని జిల్లాల్లో టీఏలు ఇచ్చి మరికొన్ని జిల్లాల్లో పెండింగ్ పెట్టడమేంటని ప్రశ్నించారు. పోలీస్‌శాఖ ముఖ్యమంత్రి వద్ద ఉన్నా నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. పోలీసుల సంక్షేమానికి గత ఏడాదితో పోలిస్తే రూ.400 కోట్లను తగ్గించారని పేర్కొన్నారు. పెంచాల్సిన బడ్జెట్ ఎందుకు తగ్గిందో చెప్పాల్సిన మంత్రి, ఎలాంటి హామీ ఇవ్వడం లేదని మండిపడ్డారు.

బీసీలకు ఎన్ని కాంట్రాక్టులిచ్చారు : గంగుల

బీసీలకు బడ్జెట్‌లో రూ.20వేల కోట్లు పెడతామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం, గత రెండు బడ్జెట్లలో పెట్టలేదని, తాజా బడ్జెట్‌లోనైనా బీసీలకు రూ.20వేల కోట్లు కేటాయించాలని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం అసెంబ్లీలో బీసీ సంక్షేమం, ఆర్టీసీపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 42శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉంటామని చెప్పి కాంగ్రెస్ బీసీల ఓట్లు కొల్లగొట్టిందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రూ.80 వేల కోట్ల నుంచి రూ.లక్ష కోట్ల టెండర్లు పిలిచారని, అందులో బీసీలకు ఎన్ని ఇచ్చారో చెప్పాలని గంగుల డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆత్మగౌరవ భవనాలను నిర్మించకపోవడంతో నియోపోలిస్ వద్ద భారీ భవనాలకు సంబంధించిన నిర్మాణ వ్యర్థాలు పెద్దఎత్తున చేరుకుంటున్నాయని గంగుల ఆరోపించారు. నిర్మాణ వ్యర్థాలు తొలగించేందుకు రూ.20-25 కోట్లు ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించాలని డిమాండ్ చేశారు. ఓవర్సీస్ స్కాలర్‌షిప్ సెకండ్ ఫేజ్ నిధులు విడుదల చేయాలని కోరారు. ఆర్టీసీ చైర్మన్‌గా బీసీ వ్యక్తిని నియమించాలని డిమాండ్ చేశారు.

బీఆర్‌ఎస్ సభ్యుల వాకౌట్

పోలీసులు, ఆర్టీసీ, బీసీ సంక్షేమంపై ప్రభుత్వ వైఖరికి నిరసనగా అసెంబ్లీ నుంచి బీఆర్‌ఎస్ సభ్యులు వాకౌట్ చేశారు. పోలీసుల టీఏలు, డీఏలు, సరెండర్ లీవులు విడుదల చేయకపోవడం, ఆరోగ్య భద్రతా పథకం, పోలీస్‌శాఖలో 17వేల ఖాళీల భర్తీపై సమాధానం చెప్పకపోవడంతో బీఆర్‌ఎస్ వాకౌట్ చేస్తున్నట్టు అసెంబ్లీలో హరీశ్‌రావు ప్రకటించారు. బీసీల ఆత్మగౌరవ భవనాల విషయంలో స్పష్టత, బీసీ సబ్‌ప్లాన్ నిధుల కేటాయింపు, ప్రభుత్వ ఉద్యోగులుగా ఆర్టీసీ ఉద్యోగుల అపాయింట్ డేట్ చెప్పనందుకు వాకౌట్ చేస్తున్నట్టు చెప్పారు.

50% ఇండ్లకు చేరని తాగునీరు

- 98 శాతం నివాసాలకు తాగునీరు ఉన్నట్టు రోజువారీ డ్యాష్ బోర్డుల్లో అధికారుల రిపోర్టు
- గ్రామాల్లో తీరని నీటి వెతలు
- రాష్ట్రంలో నీటి కష్టాలపై చర్చ
- మంత్రి సీతక్క సమాధానంపై సభ్యుల తీవ్ర అసంతృప్తి



హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో తాగునీటి ఎద్దడిపై అసెంబ్లీ వేదికగా సర్కార్ తీరును ప్రతిపక్ష సభ్యులు ఎండగట్టారు. ప్రభుత్వ డ్యాష్‌బోర్డులో రాష్ట్రంలోని 98 శాతం ఇండ్లకు మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందుతున్నట్టు అధికారులు రికార్డుల్లో చూపుతున్నారని, కానీ 50 శాతం ఇండ్లకు కూడా తాగునీరు చేరడం లేదని ఆరోపించారు. ప్రభుత్వ రికార్డులకు, గ్రామాల్లోని వాస్తవ పరిస్థితులకు పొంతనే లేదని ధ్వజమెత్తారు. బడ్జెట్ పద్దులపై చర్చ సందర్భంగా శనివారం ప్రతిపక్ష సభ్యులు సభలో లేవనెత్తిన ప్రధానాంశాలు ప్రభుత్వ వైఫల్యాన్ని వేలెత్తి చూపాయి. అధికారుల గణాంకాలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని విమర్శించారు. అత్యవసరంగా బోర్లు వేద్దామన్నా ఎమ్మెల్యేలు, కలెక్టర్ల వద్ద నిధుల్లేవని విమర్శించారు. ఫలితంగా ఎన్నో తాగునీటి పథకాలు అటకెక్కాయని ఆవేదన వ్యక్తం చేశారు.


మంత్రి సమాధానంపై సభ్యుల విస్మయం

ప్రతిపక్ష సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సీతక్క 'కేంద్ర ప్రభుత్వం నిధులిచ్చి సహకరిస్తేనే గ్రామాలను అభివృద్ధి చేస్తాం' అని పేర్కొనడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. గ్రామ కార్యదర్శులకు రూ.50 కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉన్నట్టు మంత్రి అసెంబ్లీ సాక్షిగా అంగీకరించారు. ఏజెన్సీ ప్రాంతాల ప్రజలు తాగునీటి కోసం మైళ్ల దూరం నడుస్తున్నా.. ప్రభుత్వం కేంద్ర నిధుల కోసం ఎదురుచూడటంపై నిరసన వ్యక్తమవుతున్నది. నీటి ఎద్దడిని పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

మహిళల్లో అభద్రతా భావం

శాసనసభలో మంత్రి సీతక్క

హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ): మహిళల్లో ఉద్యోగం చేయడానికి అభద్రతాభావంతో ఉన్నారని మంత్రి సీతక్క అన్నారు. మహిళా భద్రతపై అసెంబ్లీలో శనివారం జరిగిన చర్చలో ఆమె మాట్లాడారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఉద్యోగాలు, ఉపాధి, పెండ్లి పేరుతో మహిళలను వంచిస్తూ, అక్రమ రవాణాకు పాల్పడుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. మహిళల రక్షణ కోసం ప్రభుత్వం మంచి పాలసీ తీసుకొస్తున్నదని చెప్పారు. మహిళలను లైంగికంగా వేధిస్తే.. ఎలాంటి కఠిన చర్యలు ఉంటాయో చిన్ననాటి నుంచే అవగాహన కల్పించాలని కోరారు. ముఖ్యంగా మహిళల పట్ల ప్రవర్తించాల్సిన విషయాలపై శిక్షణ ఇస్తూనే.. వేధింపులపై పడే శిక్షల గురించి పాఠ్యాంశాల్లో ఉండాలని పేర్కొన్నారు.



బడ్జెట్ బుక్‌లు కాపీ పేస్ట్!

- అవుట్ కమ్ బడ్జెట్, తాజా గ్రాంట్స్ బుక్ సేమ్
- ఈ నిర్లక్ష్యానికి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి
- సర్కార్ నడుపుతున్నరా? సర్కస్ నడిపిస్తున్నరా?
- ప్రభుత్వం తప్పు ఒప్పుకొని సభకు వివరణ ఇవ్వాలి
- అసెంబ్లీ లాబీలో చిట్‌చాట్‌లో ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి



హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ): 'కీలకమైన బడ్జెట్ బుక్‌లు కాపీ పేస్ట్‌లా ఉన్నాయి. అవుట్ కమ్ బడ్జెట్ బుక్, ఈ ఏడాది గ్రాంట్స్ బుక్ రెండూ ఒకేలా ఉండటం ఏమిటి?' అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ప్రశ్నించారు. డిమాండ్ బుక్స్‌లో అవుట్ కమ్ బడ్జెట్ వివరాలు ముద్రించడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని విమర్శించారు. గతంలో సాధించిన ఫలితాలు, ఈ ఏడాది గ్రాంట్స్‌పై ప్రభుత్వానికి స్పష్టత లేదు. పవిత్రమైన అసెంబ్లీలో ప్రవేశపెట్టే బిల్లులపై ఇంత నిర్లక్ష్యంగా ఉంటే ఎలా? నిలదీశారు. అసెంబ్లీ ప్రాంగణంలో శనివారం ఆయన మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఇంత నిర్లక్ష్యంగా ఉంటే ఎలా? అసలు మీరు సర్కార్‌ను నడుపుతున్నరా? లేక సర్కస్ నడిపిస్తున్నరా? అని ఘాటుగా ప్రశ్నించారు. అత్యంత కీలకమైన బడ్జెట్ అంశంలో అధికారులు ఇంత బాధ్యతారహితంగా వ్యవహరించడం గర్హనీయమని పేర్కొన్నారు. 'ఆర్థికశాఖ మంత్రి తన సొంత ఆర్థిక కారణాలతో బిజీగా ఉన్నట్టు కనిపిస్తున్నది. అందుకే ఇలాంటి తప్పిదాలు జరుగుతున్నాయి. తక్షణమే ఈ తప్పును సరిదిద్దుకొని బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలి' అని డిమాండ్ చేశారు. 'ఇది పొరపాటు కాదు నేరమే. సభలో ఇదే విషయంపై మాట్లాడుతా. ఉన్నది ఉన్నట్టు రెండు బుక్‌లు తయారు చేస్తే ఎలా ప్రభుత్వం నడుపుతున్నట్టు' అని నిలదీశారు. ప్రభుత్వం తక్షణమే ఈ తప్పుపై సభకు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సమస్యల నిలయాలుగా ఆర్టీసీ, సింగరేణి

- సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



తెలంగాణ ఉద్యమంలో ఆర్టీసీ, సింగరేణి కార్మికుల పాత్ర కీలకమని, కానీ నేడు ఆ సంస్థలు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం అసెంబ్లీలో పోలీసు, ఆర్టీసీ, బీసీ సంక్షేమంపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికులు తమ సమస్యలు చెప్పుకొనేందుకు యూనియన్ లేకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ అంశం కేంద్రం పరిధిలో ఉన్నందున అన్ని పార్టీలను ఢిల్లీకి తీసుకెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన సూచించారు. ప్రతి కులానికి కార్పొరేషన్ ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ట్రాఫిక్ పోలీసులు అనేక ఇబ్బందులు పడుతున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు. గంటల తరబడి నిలబడటం వారికి సమస్యగా మారిందని, దీనికి పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని కోరారు. పోలీస్ వ్యవస్థలో షిఫ్ట్ సిస్టమ్ తీసుకొచ్చి వారికి ఉపశమనం కల్పించాలని కూనంనేని డిమాండ్ చేశారు.

010 పద్దు ద్వారానే వేతనాలివ్వాలి

- సర్కార్‌కు గురుకుల ఉద్యోగ, ఉపాధ్యాయుల డిమాండ్

హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ): ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాల్లోనూ 010 పద్దు ద్వారానే వేతనాలు చెల్లించాలని ఆయా గురుకులాల ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతినెలా ఒకటో తేదీన వేతనాలు చెల్లిస్తుండగా, సొసైటీల్లో మాత్రం ఒక నియమిత తేదీ అంటూ లేకుండా పోయింది. ఒక్కో సొసైటీలో ఒక్కో తేదీన వేతనాలు చెల్లిస్తున్న దుస్థితి నెలకొన్నది. తమకు సైతం 010పద్దు ద్వారా ప్రభుత్వమే ప్రతి నెలా 1న వేతనాలు చెల్లించాలని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్నాయి. సర్కార్ మాత్రం ఆ దిశగా చర్యలు చేపట్టిందిలేదు. తాజాగా తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ) రద్దుచేసి, సిబ్బందికి 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలని సర్కార్ నిర్ణయించింది. గురుకుల ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు సైతం నేరుగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నాయి.

దవాఖానల నిర్వహణ గ్రూప్-1 అధికారులకా?

- సర్కార్‌పై వైద్యసంఘాల మండిపాటు

హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ దవాఖానల పరిపాలన గ్రూప్-1 అధికారులకు ఇవ్వడం ఏంటీ..? అని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం (టీజీజీడీఏ), తెలంగాణ టీచింగ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్(టీటీజీడీఏ), తెలంగాణ సీనియర్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ (టీ-ఎస్‌ఆర్డీఏ), హెల్త్ కేర్ రిఫార్మ్స్ డాక్టర్స్ అసోసియేషన్ (హెచ్‌ఆర్డీఏ) సంఘాలు వేర్వేరు ప్రకటనల్లో మండిపడ్డాయి. ఎయిమ్స్, జిప్మర్, పీజీఐఎంఈఆర్, ఈఎస్‌ఐలాంటి సంస్థల్లో ఈ విధానం అమల్లో లేదని గుర్తుచేశాయి. డబ్ల్యూహెచ్‌వో, సీడీసీల్లో సైతం డాక్టర్ ఆధారిత పాలన సత్ఫలితాలు ఇస్తున్నట్టు వివరించాయి. పరిపాలనను గ్రూప్-1 అధికారులకు ఇవ్వాల్సిన అవసరం లేదని, సూపరింటెండెంట్లు, ఆర్‌ఎంవోలను బలోపేతం చేయాలని డిమాండ్ చేశాయి. గుర్తింపు పొందిన సంఘాలను అన్ని కమిటీలు, విధాన నిర్ణయాల్లో భాగస్వామ్యం చేయాలని కోరాయి. ఈ ప్రతిపాదనను ప్రభుత్వం పునఃసమీక్షించాలని విజ్ఞప్తిచేశాయి.

సర్కార్‌లో 'ఎవని జాగీరు' ప్రకంపనలు

మొదటిపేజీ తరువాయి...

దందా బట్టబయలైంది. ఏడు దశాబ్దాలుగా రైతులు సాగు చేసుకుంటున్న 373.22 ఎకరాల భూములను చడీచప్పుడు కాకుండా కైంకర్యం చేసేందుకు తెరవెనుక ప్రభుత్వ పెద్దలు రచించిన కుట్రల గుట్టు రట్టయింది. ఆ భూములను నిషేధిత జాబితాలో పొందుపరిచి.. కండ్ల ముందు నిర్మాణ సంస్థలు దర్జాగా దౌర్జన్యకాండను సాగిస్తున్నా వ్యూహాత్మకంగా మౌనం వహించిన రెవెన్యూ ఉన్నతాధికారుల బాగోతం చట్టాలతో సహా అందరికీ తేటతెల్లమైంది. ప్రభుత్వ రికార్డుల పరంగా నిషేధిత జాబితాలో ఉన్నప్పటికీ ఆ భూములపై నిర్మాణ సంస్థలకు చెందిన వ్యక్తులు ఎలా వచ్చారు? ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు ఎలా చేపడుతున్నారు? అసలు వారి వద్ద ఉన్న న్యాయస్థానాల ఉత్తర్వులు ఏమిటి? ఆ కేసుల తాజా పరిస్థితులతో నివేదిక ఇవ్వాలని కలెక్టర్‌ను సర్కార్ సూచించినట్టు సమాచారం. దీంతోపాటు శనివారం ఉదయం నుంచే ఇంటెలిజెన్స్, ఎస్‌బీ పోలీసులు పెద్ద ఎత్తున నమస్తే కథనంపై ఆరా తీయడం మొదలుపెట్టారు. జర్నలిస్టులు, అధికారులు, స్థానిక పోలీసులు, నాదర్‌గుల్ గ్రామస్తుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో రెవెన్యూ అధికారులు ఉరుకులు, పరుగులు పెట్టినట్టు తెలిసింది. ఆ భూములకు సంబంధించిన పాత రికార్డులు తీసి, ఇతర కోర్టు కేసులు, సుప్రీంకోర్టులో దాఖలు చేసిన కౌంటర్ అఫిడవిట్ వివరాలన్నింటితో ప్రభుత్వానికి నివేదిక సమర్పించే పనిలో పడ్డట్టు తెలిసింది.

జీహెచ్‌ఎంసీ సమావేశంలో చర్చ

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సమావేశంలో కూడా 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక కథనంపై విస్తృతంగా చర్చ జరిగినట్టు తెలిసింది. నాదర్‌గుల్ ఉండే బడంగ్‌పేట సర్కిల్ కార్యాలయం జీహెచ్‌ఎంసీ పరిధిలోకి వస్తున్నందున ఉన్నతాధికారులు కూడా ఈ అంశంపై దృష్టి సారించారు. ఈ క్రమంలో బడంగ్‌పేట సర్కిల్ కార్యాలయం నుంచి హాజరైన అధికారులకు పలు సూచనలు చేసినట్టు తెలిసింది. సర్వేనంబరు 613 భూములు వివాదాస్పదంగా ఉన్నందున అందులో ఎలాంటి అనుమతులు ఇవ్వొదని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ నుంచి కూడా బడంగ్‌పేట సర్కిల్ కార్యాలయానికి పలువురు అధికారులు వచ్చి ఆరా తీశారు. 613 సర్వేనంబరులో ప్రహరీ కానీ, ఇతర నిర్మాణాలకు ఏమైనా అనుమతులు ఇచ్చారా? అన్న వివరాలు సేకరించారు. వాస్తవానికి ఆ భూముల్లో తిష్టవేసిన ఓ నిర్మాణ సంస్థ గత నెల 27న బడంగ్‌పేట సర్కిల్ కార్యాలయానికి ప్రహరీ నిర్మాణం కోసం అనుమతులు కోరుతూ దరఖాస్తు చేసుకొన్నది. దాని వెంట వివిధ కోర్టు ఉత్తర్వులు, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లతో కూడిన భారీ పుస్తకాలు (వాల్యూమ్స్) అందజేశారు. ఒక దశలో అనుమతులు ఇచ్చేందుకు సర్కిల్ ఉన్నతాధికారులు ప్రాథమికంగా కసరత్తు చేసినట్టు వినికిడి.



తమ భూములను కాపాడుకునేందుకు ఏం చేయాలనే దానిపై శనివారం సమావేశమైన నాదర్‌గుల్ గ్రామ రైతులు, హాజరైన రైతు సంఘం నేతలు, సీపీఎం నాయకులు

రైతులకు న్యాయం చేయాలి: సీపీఎం


ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని నాదర్‌గుల్ బాధిత రైతులకు న్యాయం చేయాలని సీపీఎం జిల్లా నాయకులు కాడిగల్ల భాస్కర్ డిమాండ్ చేశారు. నాదర్‌గుల్ రైతులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం న్యాయస్థానాల్లో తగిన వాదనలు వినిపించి ప్రభుత్వ భూములను కాపాడి, రైతులకు పంపిణీ చేయాలని కోరారు. రెవెన్యూ, పోలీస్ యంత్రాంగాలు భూకబ్జాదారుల ప్రయోజనాల కోసం పని చేస్తున్నాయని ధ్వజమెత్తారు. వ్యవసాయం చేసుకుంటున్న రైతులను బెదిరించి, అడ్డుకొంటున్న భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జాగీర్ల రద్దు, భూ సంస్కరణ సీలింగ్ చట్టాలను తుంగలో తొక్కి దళిత, బలహీనవర్గాల రైతుల పొట్టలుగొట్టేందుకు ప్రభుత్వ వైఖరి కారణమని పేర్కొన్నారు. భూకబ్జాదారులకు ఈ భూములను తనఖా పెట్టి పెద్ద ఎత్తున తీసుకొన్న రుణాల విషయంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) వెంటనే దృష్టి సారించాలని కోరారు. బాధిత రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు కర్రె యాదయ్య, శేష్‌పాల్, సీపీఎం నాయకులు కిషన్, తదితరులు పాల్గొన్నారు.

నివేదికలేనా? భూముల్ని కాపాడతారా?

నాదర్‌గుల్‌లోని సర్వేనంబరు 613లోని భూముల కథ బయటి ప్రపంచానికి కొత్తదే అయినా.. జిల్లా కలెక్టర్ మొదలుకొని రెవెన్యూ అధికారులందరికీ ఆ భూముల కథ తెలియనిది కాదు. పైగా ప్రస్తుతం కలెక్టర్ నారాయణరెడ్డి రెవెన్యూ, స్టాంపుల శాఖ కమిషనర్‌కు పంపిన నిషేధిత జాబితాలో ఈ సర్వేనంబరు కూడా ఉన్నది. వీటన్నింటికీ మించి ఏ పహాణీల్లోనూ వారసుల పేర్లు నమోదు కాలేదు. ఏజీపీఏ, సేల్ డీడ్స్ చేయించుకొన్న వ్యక్తుల, కంపెనీ పేర్లు కూడా మ్యుటేషన్ కింద రికార్డుల్లోకి ఎక్కలేదు. కానీ రెండేండ్లుగా ఆ భూముల్లో పాగా వేసి... ఇప్పుడు చుట్టూ ప్రహరీ నిర్మించేందుకు ఓ నిర్మాణ సంస్థ యుద్ధప్రాతిపదికన పనులు చేస్తున్నా ఉన్నతాధికారులు వ్యూహాత్మక మౌనాన్ని ప్రదర్శిస్తున్నారు. ఎవరు అడిగినా అది ప్రభుత్వ భూమే, పనులను నిలిపివేశాం కదా! అని సమాధానమిస్తూ చాపకింద నీరులా పనులు కొనసాగేందుకు పరోక్ష సహకారాన్ని అందించారనేది బహిరంగ రహస్యం. అంటే ఆ పనులు పూర్తి కాగానే సదరు నిర్మాణ సంస్థ వాటి ఆధారంగా మరిన్ని న్యాయస్థానాల ఉత్తర్వులు తీసుకొచ్చి, రాత్రికి రాత్రే రికార్డులను తారుమారు చేయాలనే పన్నాగం దాగి ఉన్నది. ఆపై హెచ్‌ఎండీఏ నుంచి అనుమతులతో కార్పొరేట్ తరహా భారీ రియల్ దందాకు స్కెచ్ వేశారని తెలుస్తున్నది.

నాదర్‌గుల్‌లో 'నమస్తే' కథనం హల్‌చల్

'ఎవని జాగీరు!' అన్న శీర్షికన 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక కథనం నాదర్‌గుల్ గ్రామంలో తీవ్ర చర్చకు దారితీసింది. ఎకరా రూ.15 కోట్లకు పైగా విలువ చేసే 373.22 ఎకరాల భూములు తమ కండ్ల ముందు ఓ నిర్మాణ సంస్థ ఆధీనంలోకి వెళ్లడంతో బాధిత రైతులకు 'నమస్తే కథనం' కొండంత ఊరటనిచ్చింది. తాము ఏడు దశాబ్దాలుగా నమ్ముకొని సాగు చేసుకొంటున్న ఆ భూముల్లోకి రెండేండ్లుగా తమను వెళ్లనీయడం లేదని బాధిత రైతులు ఆవేదన చెందుతున్నారు. గత కొన్నిరోజులుగా ప్రజాప్రతినిధులతోపాటు తాసిల్దార్, ఆర్డీవో, కలెక్టర్, హైడ్రా, పోలీసులకు బాధిత రైతులు ఫిర్యాదులు చేస్తూ న్యాయం కోసం చకోర పక్షుల్లా తిరుగుతున్నారు. కానీ ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇదే సమయంలో 'నమస్తే తెలంగాణ' కథనం రావడంతో వారిలో చైతన్యం చిగురించింది. పత్రిక కథనాలు చూసిన గ్రామంలోని బాధిత రైతులంతా స్థానిక బస్టాండ్ వద్దకు చేరుకొని సమావేశమయ్యారు. నిర్మాణ సంస్థ ఇచ్చే ఐదారు లక్షలకు ఆశపడితే కోట్ల విలువైన భూమితోపాటు కుటుంబాలకు ఆధారంగా ఉన్న వ్యవసాయానికి దూరం అవుతామని చర్చించుకొన్నారు. న్యాయపరంగా పోరాడుదామని రైతులందరూ ప్రతినబూనారు. ఈ మేరకు శనివారం మధ్యాహ్నమే న్యాయవాదులను కూడా కలిసినట్టు తెలిసింది. అందుబాటులో లేని రైతులనూ కలుపుకొని పోవాలని నిర్ణయించారు. ఈ సమావేశానికి రైతుసంఘం, సీపీఎం జిల్లా నాయకులు కూడా వచ్చి రైతులకు సంఘీభావం తెలిపారు.





రెండేండ్లలో రూ.3,236 కోట్లు

- పెరిగిన 'వైటీపీఎస్' వ్యయం

హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ): 'యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్) పనులు నిర్లక్ష్యానికి గురయ్యాయి. ఎన్జీటీ అనుమతులు సాధించలేదు. ఆర్థికభారం పెరిగింది' ఇవీ ప్రభుత్వ పెద్దల ఆరోపణలు. కాంగ్రెస్ సర్కార్ కొలువుదీరి రెండేండ్లు దాటినా ఈ ప్లాంట్ అందుబాటులోకి రాలేదు. రెండేండ్లలో వైటీపీఎస్ ఆర్థిక భారం రూ.3,236 కోట్లు పెరిగింది. 2023 నాటికి రూ.34, 545 కోట్లుగా ఉన్న ప్రాజెక్టు నిర్మాణ వ్యయం రూ.37, 781.18 కోట్లకు చేరినట్టు ప్రభుత్వం ప్రకటించింది.

2 యూనిట్లు మరింత ఆలస్యం

వైటీపీఎస్‌లో 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 5 యూనిట్లు ఉన్నాయి. 2,400 మెగావాట్ల సామర్థ్యం గల మూడు యూనిట్లు ప్రారంభమయ్యాయి. 2025 జూలై 12న యూనిట్-1, 2025 జనవరి 25న యూనిట్-2, ఈ ఏడాది జనవరి 8న యూనిట్-4 కమిషనింగ్ అయ్యాయి. రెండు యూనిట్లు ఇంకా అందుబాటులోకి రాలేదు. ఈ ఏడాది మే నెలలోగా యూనిట్-3ను, జూన్ నాటికి యూనిట్-5ను అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం గడువుగా నిర్ణయించుకున్నది. ఈ రెండు యూనిట్ల ప్రారంభానికి తెలంగాణ విద్యుత్తు నియంత్రణ మండలి (ఈఆర్సీ) విధించిన గడువు ముగిసింది.


ఇప్పటికైనా సాదాబైనామాలు పరిష్కారమయ్యేనా?

- నిబంధనల్లో సర్కార్ మార్పులు
- ఆర్డీవోలు చొరవ తీసుకుంటారా?

హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ సర్కార్ హయాంలో సాదాబైనామా దరఖాస్తులకు ఇప్పటికైనా మోక్షం కలుగుతుందా? లేదా? అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. సాదాబైనామాల పరిష్కారం కోసం భూభారతి చట్టంలో ప్రభుత్వం. 'అమ్మకందారు అఫిడవిట్ ఇవ్వాలనే అనాలోచితమైన నిబంధన'ను పొందుపరిచింది. అయితే దీనిపై రైతుల నుంచి పెద్దఎత్తున విమర్శలు రావడం, దరఖాస్తులు ఎక్కడికక్కడే పేరుకుపోవడంతో తాజాగా ఆ నిబంధనను ఎత్తేస్తూ రెవెన్యూ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పుడు కేవలం కొనుగోలుదారు (కబ్జాలో ఉన్న వ్యక్తి) అఫిడవిట్ ఇస్తే సరిపోతుందని పేర్కొన్నది. 2014 జూన్ 2వ తేదీకి ముందు భూమి కొనుగోలుకు సంబంధించి ఒప్పందం జరిగి 2020 అక్టోబర్ 12 నుంచి నవంబర్ 10వ తేదీ వరకు చేసుకున్న దరఖాస్తులను పరిష్కరించాలని నిర్ణయించింది. అయితే, ఇప్పటికైనా దరఖాస్తులకు మోక్షం లభిస్తుందా? లేదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో బీఆర్‌ఎస్ సర్కార్ సాదాబైనామాల దరఖాస్తులను పరిష్కరించి రైతులకు మేలు చేసింది. అయితే, రైతులకు మేలు చేయాలనే ఉద్దేశం లేని కాంగ్రెస్ సర్కార్ భూభారతి చట్టంలో సాదాబైనామాల దరఖాస్తులకు అడ్డుకట్టవేసేలా అమలుకు సాధ్యంకాని నిబంధన పెట్టింది. దరఖాస్తు పరిష్కరించాలంటే ఆ భూమి అమ్మకందారు నుంచి అఫిడవిట్ తీసుకురావాలంటూ నిబంధన పొందుపరిచింది. ఏండ్ల క్రితం తెల్లకాగితంపై ఒప్పందం ఆధారంగా కొనుగోలు చేసిన భూమికి సంబంధించి అమ్మకందారు ఇప్పుడెలా అఫిడవిట్ ఇస్తారని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇందులో గతంలో భూములు విక్రయించిన వారు కొంతమంది మరణించగా. మరికొంతమంది ఎక్కడెక్కడికో ఉన్నారు. ఒకవేళ అందుబాటులో ఉన్నప్పటికీ, అఫిడవిట్ ఇచ్చేందుకు అంగీకరించడంలేదని రైతులు చెప్తున్నారు. డబ్బులు డిమాండ్ చేస్తున్నారని, భూమిలో వాటాలు అడుగుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

ఆర్డీవోల తిరకాసు

సాదాబైనామాల కింద ప్రభుత్వానికి తొమ్మిది లక్షల దరఖాస్తులు అందాయి. పదుల సంఖ్యలో మాత్రమే దరఖాస్తులను పరిష్కరించారు. వీటి పరిష్కారానికి అమ్మకందారు అఫిడవిట్ నిబంధన అడ్డంగా మారింది. సాదాబైనామాల పరిష్కార బాధ్యత ఆర్డీవోలకు అప్పగించడమే కారణమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆర్డీవోలు క్షేత్రస్థాయిలోదరఖాస్తులను పరిశీలించడంలేదని తెలిసింది. ఎమ్మార్వో రిపోర్ట్‌పై ఆధారపడి ఆర్డీవోలు దరఖాస్తులను పరిష్కరిస్తున్నారని సమాచారం. ఎమ్మార్వోలు తప్పుడు నివేదికలు ఇస్తే, భవిష్యత్‌లో ఇబ్బంది అవుతుందనే ఆలోచనలో ఆర్డీవోలు ఉన్నారని తెలిసింది. దీంతో దరఖాస్తులను తిరస్కరిస్తున్నారని తెలిసింది. దరఖాస్తుల పరిష్కార బాధ్యత ఎమ్మార్వోలకే అప్పగించాలనే సూచనలొస్తున్నాయి.



సహ జీవనానికి విడాకులు తప్పనిసరి!

- అవసరం లేదన్న అదే అలహాబాద్ హైకోర్ట్
- రోజుల వ్యవధిలో ఒకే కోర్ట్ భిన్న తీర్పులు



న్యూఢిల్లీ, మార్చి 28: వివాహితుల సహజీవనంపై కొన్ని రోజుల వ్యవధిలోనే అలహాబాద్ హైకోర్టు రెండు పరస్పర విభిన్నమైన తీర్పులను వెలువరించింది. మార్చి 20న జస్టిస్ వివేక్ కుమార్ సింగ్ నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం వెలువరించిన తీర్పులో ఇప్పటికే వివాహమై జీవిత భాగస్వామి బతికే ఉన్న వ్యక్తి ముందుగా విడాకులు తీసుకోకుండా చట్టబద్ధంగా మరొక భాగస్వామితో సహ జీవనంలోకి ప్రవేశించలేరని స్పష్టం చేశారు. ఈ తీర్పు వెలువడిన కొన్ని రోజులకే డివిజన్ బెంచ్ ఇచ్చిన మరో తీర్పులో పెండ్లయిన పురుషుడు ఒక మహిళతో సహ జీవనంలోకి ప్రవేశించడం చట్ట ప్రకారం నేరం కాదని పేర్కొంది. మార్చి 20 నాటి కేసులో అప్పటికే వేర్వేరు భాగస్వాములతో వివాహం చేసుకున్న ఒక జంట తమ కుటుంబాల నుండి వస్తున్న బెదిరింపుల నుండి రక్షణ కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌ను సింగిల్ బెంచ్ విచారించింది. తాము బార్యాభర్తలల్లా కలిసి జీవిస్తున్నామని, తమ ప్రాణాలకు ముప్పు ఉందని వారు వాదించారు. అయితే వారిద్దరూ విడాకులు తీసుకోనందున వారి సంబంధం చట్ట విరుద్ధమని పేర్కొంటూ రాష్ట్ర ప్రభుత్వం ఈ అభ్యర్థనను వ్యతిరేకించింది. ప్రభుత్వ వాదనతో ఏకీభవించిన కోర్టు రక్షణ కల్పించడానికి నిరాకరించింది. పరస్పర మమకారంతో ఇద్దరు మేజర్లు కులం, మతం లేదా సామాజిక అడ్డంకులతో సంబంధం లేకుండా ఎటువంటి జోక్యం లేకుండా కలిసి జీవించే హక్కును కలిగి ఉన్నప్పటికీ ఈ హక్కు సంపూర్ణమైనది కాదని పేర్కొంది. ఈ తీర్పు వెలువడిన కొన్ని రోజులకే దీనికి విరుద్ధంగా జస్టిస్ జేజే మునీర్, జస్టిస్ తరుణ్ సక్సేనాలతో కూడిన డివిజన్ బెంచ్ వివాహితుడైన ఒక పురుషుడు, 18 ఏండ్ల యువతికి సంబంధించిన వేరొక కేసును విచారిస్తూ వివాహితుడైన పురుషుడు, మేజర్ అయిన మహిళతో పరస్పర అంగీకారంతో సహ జీవనం చేయడం నేరంగా పరిగణించరాదని స్పష్టం చేసింది. పెళ్లయిన పురుషుడు, మేజర్ అయిన మహిళతో ఆమె సమ్మతితో సహ జీవనం చేస్తున్నంత మాత్రాన అది నేరం కాదని, నైతికతను, చట్టాన్ని వేరుగా ఉండాలని డివిజన్ బెంచ్ తెలిపింది.

భార్యతో అసహజ సెక్స్ రేప్ కాదు

మధ్యప్రదేశ్ హైకోర్టు తీర్పు

భోపాల్, మార్చి 28: భార్యతో అసహజ శృంగారం(సెక్స్) అత్యాచారం కింద పరిగణించకూడదని మధ్యప్రదేశ్ హైకోర్టు తీర్పు చెప్పింది. తన భర్త తనను లైంగికంగా వేధించాడంటూ ఒక మహిళ పెట్టిన కేసును హైకోర్టు గ్వాలియర్ బెంచ్ విచారించింది. 'వయోజనురాలైన భార్యపై భర్త చేసే లైంగిక చర్య లేదా శృంగార చేష్టలు అత్యాచారం కిందకు రావు. ఇందులో అంగీకారానికి సంబంధించిన విషయం అప్రధానమైనది' అని సింగిల్ బెంచ్ జడ్జి జస్టిస్ మిలింద్ రమేశ్ ఫడ్కే తీర్పు చెప్పారు. ఈ కేసులో అత్యాచార నిర్వచనాన్ని విస్తరించి మలద్వార, ముఖ మైథునం వంటి చర్యలను కూడా అందులో చేర్చినట్టు బెంచ్ గమనించింది. భార్యాభర్తల శృంగారంలో అలాంటి చర్యలకు భారత శిక్షాస్మృతి 377 సెక్షన్‌ను వర్తింప చేయరాదని బెంచ్ పేర్కొంది. ఈ సందర్భంగా ఆ మహిళ దాఖలు చేసిన పిటిషన్‌ను పాక్షికంగా కొట్టివేస్తూ తీర్పు చెప్పింది.

భారత్‌లో తగ్గిన ప్రసూతి మరణాలు

30 ఏండ్లలో 80 శాతం తగ్గుదల

న్యూఢిల్లీ, మార్చి 28: భారత్‌లో గత కొన్ని దశాబ్దాలుగా ప్రసూతి మరణాల సంఖ్య తగ్గుతూ వస్తున్నది. ప్రసూతి, గైనకాలజీ, మహిళా ఆరోగ్య పత్రిక లాన్సెట్ ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించిన సర్వే ప్రకారం భారత్‌లో 1990 నుంచి 2023 వరకు ప్రతి లక్ష సజీవ జననాల్లో ప్రసూతి మరణాల రేటు 508 నుంచి 116కు తగ్గింది. ఈ 80 శాతం తగ్గుదల ప్రపంచ సగటు కన్నా మెరుగ్గా ఉంది. 2023లో భారత్‌లో 24,700 ప్రసూతి మరణాలు నమోదయ్యాయి. ఇది ప్రతి లక్ష జననాలకు 116 మాతృ మరణాల రేటుకు సమానం. ప్రపంచ వ్యాప్తంగా ఈ ప్రసూతి మరణాలు గత మూడు దశాబ్దాలుగా తగ్గుతూ వస్తున్నా, ఈ ప్రగతిలో ఇటీవల తగ్గుదల ఏర్పడింది. అలాగే ఒక దేశానికి, మరో దేశానికి మధ్య తీవ్ర వ్యత్యాసాలు కన్పించాయి.

ఎక్కువ కాలం కొనసాగదు!

నెలల్లో కాదు.. వారాల్లోనే యుద్ధం ముగిస్తాం ▪ అమెరికా విదేశాంగ మంత్రి మార్క్ రూబియో



వాషింగ్టన్, మార్చి 28: ఇరాన్‌తో యుద్ధాన్ని అయితే దౌత్యంతో లేదా తీవ్రమైన దాడులతో ముగించాలని అమెరికా భావిస్తున్నట్టు ఉంది. ఆ దేశ విదేశాంగ మంత్రి వ్యాఖ్యలు దీన్ని బలపరుస్తున్నాయి. యుద్ధం ఎక్కువ కాలం కొనసాగదని, భూతల దాడులు లేకుండానే ఆ దేశాన్ని లొంగదీస్తామని అమెరికా విదేశాంగ శాఖ మంత్రి మార్కో రూబియో స్పష్టం చేశారు. భూతల బలగాలను దించకుండానే అమెరికా తన లక్ష్యాలని నెరవేర్చుకుంటుందని ఆయన చెప్పారు. అయితే ఆకస్మిక పరిస్థితులు తలెత్తితే సర్దుబాటు చేసుకోవడానికి, గరిష్ఠ అవకాశం కల్పించేందుకు ఆ ప్రాంతానికి కొన్ని బలగాలను పంపుతున్నట్టు ఆయన అంగీకరించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వాషింగ్టన్ ఆపరేషన్ షెడ్యూల్ ప్రకారం లేదా దానికంటే ముందే ఉందని, యుద్ధాన్ని నెలల్లో కాదు, వారాల్లో ముగించాలని ఆశిస్తోందని పేర్కొన్నారు. హొర్ముజ్ జలసంధి ద్వారా జరిగే వాణిజ్యం కారణంగా యూరోపియన్, ఆసియన్ దేశాలకే ఎక్కువగా ప్రయోజనం చేకూరుతుందని, ఇప్పుడు దాన్ని ఇరాన్ మూసేయడం వల్ల వాటికే ఎక్కువగా నష్టం వాటిలిల్లుతున్నదని అన్నారు. ఈ క్రమంలో ఆ జలసంధి గుండా సాఫీగా వాణిజ్యం జరిగేందుకు అమెరికా చేస్తున్న ప్రయత్నాలకు ఆ దేశాలు కలిసి రావాలని ఆయన కోరారు. కాగా, శనివారం కూడా ఇరాన్, ఇతర దేశాల మధ్య యుద్ధం కొనసాగింది. ఇరాన్ నుంచి తమపై క్షిపణుల దాడి జరిగిందని, వాటిని సమర్థంగా అడ్డుకున్నామని, అనంతరం టెహ్రాన్‌పై ప్రతీకార దాడులు చేసినట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది. అయితే యెమన్ నుంచి ఒక క్షిపణిని తమపై ప్రయోగించినట్టు గుర్తించామన్నారు. కాగా, తమపై క్షిపణి దాడులు కొనసాగినట్టు యూఏఈ, బహ్రెయిన్ దేశాలు తెలిపాయి. సౌదీ అరేబియాలోని ఒక ఎయిర్‌బేస్‌పై ఇరాన్ శుక్రవారం జరిపిన దాడిలో 12 మంది యూఎస్ మిలిటరీ సైనికులు గాయపడ్డారు. అందులో ఇద్దరి పరిస్థితి ప్రమాదకరంగా ఉందని అమెరికా అధికారులు వెల్లడించారు. డ్రోన్లు, క్షిపణులతో ఇరాన్ దాడులు కొనసాగిస్తూనే ఉందని యూఎస్ తెలిపింది.

మొజ్తబా చనిపోయి ఉంటారు : ట్రంప్

ఇరాన్ కొత్త సుప్రీం నాయకుడు మొజ్తబా ఖమేనీ చనిపోయి ఉంటారని లేదా తీవ్రంగా గాయపడి ఉంటారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్లక్ష్యంగా వ్యాఖ్యానించారు. పశ్చిమాసియాలో యుద్ధం నిరాటంకంగా కొనసాగుతున్నందున అమెరికా సైనిక చర్యలు ఇరాన్ నాయకత్వాన్ని సమర్థవంతంగా తుడిచిపెట్టాయని ఆయన నొక్కి చెప్పారు. "ఇరాన్ నాయకులు మరణించారు. వారి సుప్రీం నాయకుడు ఇకపై సుప్రీం లీడర్ కాదు. ఆయన చనిపోయారు. ఆయన కుమారుడు కూడా చనిపోయి ఉండవచ్చు. లేదా చాలా విషమ పరిస్థితిలో ఉండవచ్చు. ఎందుకంటే ఆయన(మొజ్తబా) నుండి ఎటువంటి సమాచారం లేదు. నన్ను ఈ రొంపిలోకి లాగవద్దు అని ఆయన అంటుండవచ్చని నేను భావిస్తున్నాను" అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

అలాంటి వారికి సాయం ఎందుకు?

పశ్చిమాసియా యుద్ధం అమెరికాకు, దాని సంప్రదాయ మిత్ర దేశాలకు మధ్య చీలికలను సృష్టించింది. దాంతో ఆ దేశాలు తటస్థంగా ఉండిపోయాయి. వారి మద్దతు లేకపోవడం పశ్చిమ దేశాల అత్యంత ముఖ్యమైన కూటమి అయిన నాటోపై ప్రభావం చూపుతుందని డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. 'మేము ఎల్లప్పుడూ వారికి అండగా ఉండేవాళ్లం. కానీ ఇప్పుడు వారి చర్యలను బట్టి చూస్తే, మనం వారికి అండగా ఉండాల్సిన అవసరం లేదనుకుంటా' అని మయామిలో ట్రంప్ వ్యాఖ్యానించారు.

పౌరులపై క్షిపణి శకలాలు.. ఐదుగురు భారతీయులకు గాయాలు

గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులు శనివారం కూడా కొనసాగాయి. ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులను అడ్డుకోవడంతో వాటి శకలాలు మీదపడి ఖలీఫా ఎకనమిక్ జోన్స్ అబుదాబి(కేజెడ్)లో ఆరుగురు గాయపడ్డారు. ఉదయం గగనతల రక్షణ వ్యవస్థలు ఇరాన్ బాలిస్టిక్ క్షిపణిని విజయవంతంగా అడ్డుకున్న తర్వాత వాటి శకలాలు మీదపడి ఐదుగురు భారతీయ పౌరులు, ఒక పాకిస్థాన్ పౌరుడు స్వల్పంగా గాయపడినట్లు అధికారులు చెప్పారు. శనివారం దుబాయ్‌లో అమెరికా సైన్యం దాగి ఉన్న రెండు సైనిక కేంద్రాలపై ఇరాన్ డ్రోన్లు, క్షిపణులతో దాడి చేసింది. ఈ కేంద్రాల్లో 500 మందికి పైగా సైనికులు ఉన్నారని, వారంతా గాయపడ్డారని ఐఆర్‌జీసీ వెల్లడించింది. అయితే ఇరాన్ జరిపిన దాడిలో తమ సైనికులపై ఎలాంటి దాడి జరగలేదని అమెరికా సెంట్రల్ కమాండ్ పేర్కొంది. కాగా, కువైట్ అంతర్జాతీయ విమానాశ్రయంపై ఇరాన్ పలుసార్లు డ్రోన్లతో దాడి చేసింది. ఈ దాడుల్లో విమానాశ్రయ రాడార్ వ్యవస్థ దెబ్బ తిందని, అయితే ఎవరూ గాయపడలేదని అధికారులు తెలిపారు.

ఇజ్రాయెల్ పైకి యెమెన్ క్షిపణులు

యెమెన్ నుంచి శనివారం ఉదయం క్షిపణులు దూసుకువచ్చినట్టుగా ఇజ్రాయెల్ అధికార వర్గాలు తెలిపాయి. ఆ దేశం నుంచి క్షిపణి దాడి జరగడం ఇదే మొదటిసారి అని పేర్కొన్నాయి. ఓవైపు ఇరాన్, హెజ్బొల్లా దాడులు కొనసాగిస్తూనే ఉన్నాయి. బీర్ షేబాతోపాటు ప్రధాన అణు పరిశోధన కేంద్రంవద్ద మూడు సార్లు సైరన్లు మోగాయి.

సామాన్యుల జీవితాల్లో 'చిచ్చు'

- పశ్చిమాసియా యుద్ధంతో లక్షలాది మంది వలసలు
- ప్రాణాలు కాపాడుకొనేందుకు పొరుగు దేశాలకు ప్రజల పరుగులు



టెహ్రాన్, మార్చి 28: పశ్చిమాసియా యుద్ధం సామాన్య పౌరుల జీవితాల్లో చిచ్చు రేపింది. ఎప్పుడు ఏ బాంబు మీద పడుతుందో తెలియని స్థితిలో వేలాది మంది పౌరులు ప్రాణాలు అర చేతిలో పెట్టుకుని వలస బాట పడుతున్నారు. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి, పక్క దేశానికి ప్రాణ భయంతో పరుగులు పెడుతున్నారు. ఇరాన్ నుంచి లెబనాన్ దాకా ఇదే పరిస్థితి నెలకొని ఉంది. ఇక్కడ ఉండి ప్రాణాలు పోగొట్టుకునే కన్నా స్వదేశానికి పోయి కలో గంజో తాగొచ్చంటూ పలువురు సొంత దేశాలకు పయనమవుతున్నారు. ఇరాన్‌తో యూఎస్-ఇజ్రాయెల్ యుద్ధం ఇప్పట్లో తగ్గే పరిస్థితులు కన్పించకపోవడంతో పలువురు ఇరాన్ దేశస్థులు ఇతర దేశాలకు వలసపోతున్నారు. అలాగే అక్కడ నివసిస్తున్న విదేశీయులు స్వదేశాలకు పారిపోతున్నారు. యుద్ధం ప్రారంభమైన ఫిబ్రవరి 28 నుంచి ఈ నెల 26 వరకు 51,500 మంది ఇరానీయులు తుర్కియేలోకి ప్రవేశించారని ఐరాస కాందిశీకుల ఏజెన్సీ వెల్లడించింది. ఇదే సమయంలో 24,500 మంది లెబనీయులు సిరియాలోకి ప్రవేశించారు. సంక్షోభం ప్రారంభమైనప్పటి నుంచి 1.65 లక్షల మంది సిరియన్లు, 41,900 మంది అఫ్ఘన్లు స్వదేశాలకు తిరిగి వచ్చేశారు. పశ్చిమాసియా సంక్షోభం ప్రారంభమైన తర్వాత అనేక దేశాల్లో అంతర్గత స్థానభ్రంశం పెరిగింది. లెబనాన్‌లో అత్యధికంగా 10.49 లక్షల మంది స్థానభ్రంశం చెందారు. అలాగే అఫ్ఘాన్‌లో 1.15 లక్షల మంది నిరాశ్రయులు అయ్యారు. కాగా, యుద్ధం కారణంగా మార్చి 26 వరకు ఇరాన్‌లో 1,094, లెబనాన్‌లో 1,937, ఇరాక్‌లో 89, సిరియాలో నలుగురు మరణించారు.

శాంతి కావాలంటే మేం చెప్పినట్టు వినాలి

గల్ఫ్ దేశాలకు ఇరాన్ హెచ్చరిక

టెహ్రాన్: అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త సైనిక దాడుల నేపథ్యంలో గల్ఫ్ దేశాలపై ఇరాన్ విరుచుకుపడుతున్నది. ఈ క్రమంలో ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజిష్కియాన్ తమ పొరుగు దేశాలకు హెచ్చరికలు చేశారు. గల్ఫ్ దేశాల్లో దాడులు ఆగాలన్నా..శాంతి, అభివృద్ధి నెలకొనాలన్నా తాము చెప్పినట్టు వినాలన్నారు. ఆయా దేశాల గగనతలాలను వినియోగించుకొని శత్రువులు తమపై దాడి చేస్తున్నారని అన్నారు. గగనతలాలను వినియోగించుకోవడానికి అమెరికా, ఇజ్రాయెల్‌లకు అనుమతి ఇవ్వొద్దని గల్ఫ్ దేశాలకు సూచించారు. శత్రు స్థావరాలు భూస్థాపితం అయ్యే వరకు దాడులు కొనసాగిస్తామని అన్నారు.

'రేప్ కేసుల్లో బాధితుల పేర్లను వెల్లడించొద్దు'

న్యూఢిల్లీ : అత్యాచార కేసుల్లో బాధితుల పేర్లను ప్రస్తావించడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. బాధితుల పేర్లు, వారి కుటుంబ సభ్యుల వివరాలు వెల్లడించకూడదని హైకోర్టులకు ఆదేశాలు జారీ చేసింది. 2018 నాటి తన తీర్పులో ఏ వ్యక్తి అయినా తమ ఆదేశాలను ఉల్లంఘించి బాధితుల పేర్లను ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలో ముద్రించడం, ప్రచురించడం చేయకూడదని ఆదేశించింది. ఇది వరకు వెల్లడించిన తీర్పుల్లో బాధితులు, వారి కుటుంబీకుల పేర్లను ప్రస్తావించడంతో వారికి ఎదురయ్యే కళంకం గురించి తెలియకపోవచ్చని ధర్మాసనం పేర్కొన్నది.

ఉగ్రవాది అంటూ విద్యార్థిపై తిట్ల వర్షం

ప్రొఫెసర్ సస్పెండ్

బెంగళూరు: బెంగళూరులోని పీఈఎస్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఒకరు తరగతి గదిలో ఓ ముస్లిం విద్యార్థిని పదే పదే ఉగ్రవాది అని సంబోధించారు. మార్చి 24న జరిగిన ఈ ఘటనను మరో విద్యార్థి తన సెల్‌ఫోన్ కెమెరాలో చిత్రీకరించాడు. ఆ వీడియో ప్రకారం ప్రొఫెసర్ మురళీధర్ దేశ్‌పాండే ఆ విద్యార్థిపై గట్టిగా కేకలు వేస్తూ ఉగ్రవాది అన్న పదాన్ని ఉపయోగించడం ఆ క్లిప్‌లో వినిపించింది. దీనిపై ఓ విద్యార్థి సంఘం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా, మురళీధర్‌ని సస్పెండ్ చేస్తూ యూనివర్సిటీ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఇండిగో విమానం అత్యవసర ల్యాండింగ్

ఇంజిన్ వైఫల్యమే కారణం?

న్యూఢిల్లీ: విశాఖపట్నం నుంచి వస్తున్న ఇండిగో విమానం(6ఈ579) ఇంజన్ విఫలమైనట్లు అనుమానం రావడంతో ఢిల్లీ విమానాశ్రయ రన్‌వేపై పూర్తిస్థాయి అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. అత్యవసర ప్రోటోకాల్స్‌ని విమానాశ్రయ అధికారులు వెంటనే అమలు చేయడంతో రన్‌వే 28ని హై అలర్ట్‌లో ఉంచారు. కాగా, 161 మంది ప్రయాణికులతో వస్తున్న బోయింగ్ విమానం ఉదయం 11 గంటల సమయంలో రన్‌వేపై సురక్షితంగా దిగింది. ఈ ఘటనలో ఎటువంటి నష్టం జరగలేదని అధికార వర్గాలు తెలిపాయి. ల్యాండింగ్ కావడానికి కొన్ని క్షణాల ముందు సాంకేతిక లోపాన్ని గుర్తించినట్లు ఇండిగో ఓ ప్రకటనలో వెల్లడించింది.

అయోధ్య యజ్ఞశాలలో భారీ అగ్ని ప్రమాదం

లక్నో: అయోధ్యలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. శ్రీరామ నవమి సందర్భంగా ఏర్పాటు చేసిన మహా యజ్ఞశాలలో శనివారం మధ్యాహ్నం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సరయూ నది తీరంలోని జమ్తారా ఘాట్ వద్ద నిర్వహించిన శ్రీ లక్ష్మీనారాయణ మహా యజ్ఞంలో ప్రమాద ఘటన చోటుచేసుకున్నది. యజ్ఞశాలలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఒక ఎకరం విస్తీర్ణంలో వెదురు, గడ్డితో నిర్మించిన మండపం క్షణాల్లో కాలి బూడిదైంది. కాగా, ప్రమాద సమయంలో ఘటనా స్థలిలో యూపీ రవాణా మంత్రి దయాశంకర్ సింగ్, పలువురు ఉన్నతాధికారులు ఉన్నారు. అదృష్టవశాత్తు ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు.



మోదీకి ఎన్నికలే ముఖ్యం

- దేశ ప్రజల కష్టాలు ఆయనకు అనవసరం
- చమురు నిల్వలు ఏడెనిమిది రోజులకేనా?
- రాజ్యసభ స్వతంత్ర ఎంపీ కపిల్ సిబల్ విమర్శ

న్యూఢిల్లీ: పశ్చిమాసియా యుద్ధం కారణంగా భారత దేశమే ఎక్కువగా నష్టపోతున్నదని రాజ్యసభలో స్వతంత్ర ఎంపీ కపిల్ సిబల్ ఆవేదన వ్యక్తం. మన ప్రధాని నరేంద్ర మోదీకి 'దేశమే ప్రథమం' అన్న దృక్పథం కొరవడిందని, దేశంలో తీవ్ర సంక్షోభం నెలకొన్నా.. కేవలం ఎన్నికల్లో గెలవడం పైనే ఆయన దృష్టి ఉందని విమర్శించారు. సంక్షోభం వచ్చినప్పుడు మాత్రమే ఆయన టీమ్ ఇండియాను గుర్తు చేసుకుంటారని, పార్లమెంట్‌లో కానీ, ఇతర సమయాల్లో కానీ దాని గురించి ఆలోచించరని సిబల్ ఆరోపించారు. శనివారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ చమురు సంక్షోభాన్ని పరిశీలిస్తే మన దేశ అవసరాల్లో 88 శాతం ముడి చమురును గల్ఫ్ నుంచే భారత్ దిగుమతి చేసుకుంటుందన్నారు. భారత్ 50 లక్షల బ్యారెళ్ల చమురును దిగుమతి చేసుకుంటుండగా, అందులో 30 లక్షల బ్యారెళ్లు పశ్చిమాసియా నుంచే వస్తున్నాయన్నారు. ప్రస్తుతం అక్కడ బ్యారెల్ 160 డాలర్ల ధర పలుకుతున్నదని, ఇది నిర్దేశిత ధర కన్నా 60 శాతం ఎక్కువని తెలిపారు. అలాగే యూరియాను కూడా 50 శాతం ఎక్కువ ధరతో కొనుగోలు చేస్తున్నామన్నారు. మన దేశంలో వ్యూహాత్మక చమురు నిల్వలు కేవలం 7, 8 రోజులకే సరిపోవడమేమిటని ఆయన ప్రధాని మోదీని నిలదీశారు. పశ్చిమాసియా సంక్షోభం హఠాత్తుగా ఏర్పడిందేమీ కాదని, ఒక వేళ హొర్ముజ్‌ను మూసివేస్తే మన దిగుమతుల పరిస్థితి ఏమిటని మీరు ముందస్తుగా ఆలోచించలేదా? అని ఆయన ప్రశ్నించారు. ఎందుకు ఆలోచించ లేదంటే మీకు దేశ ప్రయోజనాలు కన్నా రాబోయే ఎన్నికల్లో నెగ్గడమే చాలా ముఖ్యమని, అందుకే ప్రజలు బాధలు మీకు పట్టవని విమర్శించారు.

ఖరీదైన టెక్నాలజీ కారు చౌకగానా?

- ఇస్రో, డీవోఎస్‌పై పార్లమెంటరీ స్థాయీ సంఘం విమర్శలు
- ప్రైవేట్ సంస్థలే ఎక్కువగా లబ్ధి పొందుతున్నాయని వెల్లడి



న్యూఢిల్లీ, మార్చి 28: జాతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో), దాని అనుబంధ ప్రభుత్వ సంస్థలు అభివృద్ధి చేసిన అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని తక్కువ విలువకే ప్రైవేట్ సంస్థలకు బదిలీ చేస్తున్నారని పార్లమెంటరీ కమిటీ ఒకటి ఆందోళన వ్యక్తం చేసింది. ఉపగ్రహాలు, రాకెట్లు, రసాయనాలు, అధునాతన పదార్థాలు, ఉన్నత స్థాయి వ్యవస్థల్లో ఉపయోగించే ఉప భాగాలకు సంబంధించిన సాంకేతికతలను అత్యంత కారు చౌక ధరలకు బదిలీ చేస్తున్నట్లు కమిటీ పేర్కొంది. సాంకేతికతలు తరచుగా ప్రైవేట్ సంస్థలకు తక్కువ విలువకే బదిలీ అవుతున్నాయని, దీనివల్ల ఆ భాగస్వాములు గణనీయమైన లాభాలు అర్జిస్తుండగా, వాటిని అందించిన సంస్థలు మాత్రం సృష్టించిన విలువలో కేవలం నామమాత్రపు వాటాను మాత్రమే పొందుతున్నాయని గమనించినట్లు సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగంపై నియామకమైన స్టాండింగ్ కమిటీ తన నివేదికలో పేర్కొంది. ప్రధాని కార్యాలయం ప్రత్యక్ష పర్యవేక్షణలో పనిచేసే అత్యంత కీలకమైన అంతరిక్ష శాఖ(డీఓఎస్) పనితీరుని కూడా కమిటీ సమీక్షించింది. ప్రభుత్వ నిధులతో అభివృద్ధి చేసిన సాంకేతికతలకు చెందిన నిజమైన వాణిజ్య విలువ, ప్రత్యేకత, సామాజిక ప్రభావాన్ని టెక్నాలజీ లైసెన్సింగ్ ఫీజులు సముచితంగా ప్రతిబింబించాలని కమిటీ సూచించింది. పారదర్శకత, జవాబుదారీతనం నిర్ధారించడానికి అన్ని టెక్నాలజీ బదిలీ ఒప్పందాలు కాలానుగుణంగా థర్డ్ పార్టీ ఆడిట్‌లకు లోబడి ఉండాలని కమిటీ సిఫార్సు చేసినట్లు వివిధ విపక్ష పార్టీలకు చెందిన 40 మంది ఎంపీల కమిటీ సలహా ఇచ్చింది.

నిజమైన ధురంధర్ అతడే!

- పాకిస్థాన్ ఆర్మీలో ఉద్యోగిగా ఉంటూ రవీంద్ర కౌశిక్ గూఢచర్యం
- రా ఏజెంట్‌గా ఉన్నా పాక్ ఆర్మీ ఉన్నత అధికారులతో స్నేహం
- వేరే గూఢచారి తప్పు వల్ల ఐఎస్ఐకి చిక్కి యావజ్జీవ జైలు శిక్ష, మృతి



న్యూఢిల్లీ: ధురంధర్ 2 సినిమా విడుదల తర్వాత దేశం కోసం తమ ప్రాణాలను పణంగా పెట్టిన భారతీయ గూఢచారుల గురించి తెలుసుకోవాలనే ఆసక్తి ప్రేక్షకుల్లో పెరిగిపోయింది. ఈ నేపథ్యంలో దేశం కోసం తన ప్రాణాలను త్యాగం చేసిన రవీంద్ర కౌశిక్ కథ కూడా మళ్లీ వెలుగులోకి వచ్చింది. జర్నలిస్టు అనిరుద్ధ మిత్రా ఒక పాడ్‌కాస్ట్‌లో అతడి భావోద్వేగ కథను వివరించారు. అతనే అసలైన హమ్జా అని ఆయన నమ్ముతున్నారు. రవీంద్ర కౌశిక్ కథ ఎందుకు ముఖ్యమైనదని భాను పాఠక్ పాడ్‌కాస్ట్‌లో రవీంద్ర కౌశిక్‌ని ప్రశ్నించగా "ఇది చాలా భావోద్వేగభరితమైన కథ. ఇది ఒక విషాద వీరుడి కథ" అని జవాబిచ్చారు. అనిరుద్ధ ఇంకా ఏం చెప్పారంటే...

నటనపై ఆసక్తే అలా మార్చింది!

రవీంద్రకు నాటక రంగంపై అమితాసక్తి. నటుడు కావాలనుకున్నాడు. ఒకరోజు రా(రీసెర్చ్ అనాలిసిస్ వింగ్)కి చెందిన ఒక వ్యక్తి రవీంద్రను కలుసుకుని మీ నాటకాల్లో చాలా దేశభక్తి భావన చూపుతున్నారని, జాతీయ ప్రయోజనాల గురించి మాట్లాడుతున్న మీరు నిజ జీవితంలో ఇలా చేస్తే ఎలా ఉంటుందని అడిగాడు. దానికి రవీంద్ర అంగీకరించారు.

పాక్‌లోనే చదివి.. దేశం కోసం ప్రాణాలర్పించి..

గూఢచారిగా శిక్షణ తర్వాత పాకిస్థాన్ చేరుకున్న రవీంద్ర అక్కడే న్యాయ విద్యను పూర్తి చేశారు. ఆ తర్వాత పాక్ సైన్యంలో అకౌంట్స్ విభాగంలో ఉద్యోగం సంపాదించాడు. ఆడిటింగ్ పని నిమిత్తం ఓ ఊరెళ్లిన ఆయన ఆ ఊర్లోని ఓ వ్యక్తి కూతురిని ప్రేమించి పెండ్లి చేసుకున్నాడు. తన భార్య తండ్రి ద్వారా ఆర్మీ అధికారులు హాజరయ్యే పార్టీలకు వెళ్లడం మొదలుపెట్టారు. తన స్నేహ సంబంధాలతో ఆర్మీలో సీనియర్ ర్యాంకు ప్రమోషన్ కూడా రవీంద్ర పొందారు. తాను సేకరించిన సమాచారాన్ని భారత్‌కు చేరవేసేవారు. అయితే 1983లో 'రా' కొత్తగా నియమించిన ఓ జూనియర్ గూఢచారి ఐఎస్ఐకి దొరికిపోయాడు. ఇంటరాగేషన్‌లో అతను రవీంద్రను కలుసుకోవాల్సిన ఓ పార్కు పేరు చెప్పేశాడు. దీంతో రవీంద్రను ఐఎస్ఐ పట్టుకుంది. "అవును నేను రా ఏజెంట్‌ని. నేను నా విధిని నిర్వర్తించాను. నేను మీకేమీ చెప్పను. మీరు ఏం చేయదలచుకున్నారో చేసుకోండి" అని రవీంద్ర ఐఎస్ఐకి తెగేసి చెప్పారు. 1983లో రవీంద్రకు యావజ్జీవ కారాగార శిక్ష పడింది. పోలీసులు ఎన్ని చిత్ర హింసలకు గురి చేసినా నోరు మెదపని ఆ దేశ భక్తుడు చివరకు 2001లో కన్నుమూశారు.

'ఉత్తరం' ఓటు ఎటు?

- *'నయా నార్త్ బెంగాల్' నినాదంతో జనంలోకి బీజేపీ*
- *ఆ ప్రాంతంపై తృణమూల్ వివక్ష చూపిందని ఇంటింటి ప్రచారం*
- *మళ్లీ పట్టు సాధించేందుకు టీఎంసీ అన్ని తీవ్ర ప్రయత్నాలు*



పంచతంత్రం

న్యూఢిల్లీ, మార్చి 28: పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఉత్తర బెంగాల్ ఓటర్ల నిర్ణయం కీలకం కానున్నది! రాష్ట్రంలో రెండు వంతుల మెజారిటీపై కన్నేసిన భారతీయ జనతా పార్టీ ఆ ప్రాంతంలోని 54 సీట్లను గెలుచుకోగలిగితే అధికార పీఠం తమకే దక్కుతుందని భావిస్తున్నది. అధికార తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) ఈ ప్రాంతానికి ద్రోహం చేసిందన్న ప్రచారాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఇంటింటి ప్రచారాన్ని సైతం ఆ పార్టీ చేపట్టింది. కొత్త ఉత్తర బెంగాల్‌ను నిర్మిస్తామన్న వాగ్దానాన్ని కూడా ప్రజలకు చేరవేసేందుకు ప్రయత్నిస్తున్నది. మరోవైపు ఈ ప్రాంతంపై తమ పట్టును నిలుపుకొనేందుకు టీఎంసీ అన్ని ప్రయత్నాలు చేస్తున్నది. బీజేపీ తన ప్రచారంలో భాగంగా రాష్ట్ర బడ్జెట్ కేటాయింపుల్లో ఉత్తర బెంగాల్‌పై మమత ప్రభుత్వం వివక్ష చూపుతున్నదని ఆరోపిస్తున్నది. రాష్ట్ర బడ్జెట్ కేటాయింపుల్లో దక్షిణ బెంగాల్‌తో పోలిస్తే ఉత్తర బెంగాల్‌కు కేవలం 0.002 శాతం మాత్రమే దక్కిందన్నది బీజేపీ వాదన. రూ.5,899 కోట్ల విపత్తు సహాయ నిధుల్లో వరదలు, కొండ చరియలు విరిగిపడిన ఘటనల బాధితులకు అన్యాయం జరిగిందన్న అంశాన్ని కూడా ఎన్నికల ప్రచారాస్త్రంగా ఈ ప్రాంతంలో వాడుకోవాలని బీజేపీ యోచిస్తున్నది. స్మగ్లింగ్ ముఠాలకు, రాజకీయ హింసకు ప్రభుత్వం నుంచి అండదండలు ఉన్నాయని ఆరోపిస్తున్న బీజేపీ... ఆ ఆరోపణలనే ప్రచార అస్త్రాలుగా మలచుకోవాలని ఆలోచిస్తున్నది.

ఎందుకు కీలకం అంటే...?

రానున్న ఎన్నికల్లో 54 సీట్లు ఉన్న ఉత్తర బెంగాల్ రాజకీయంగా కీలకం కానున్నది. డార్జిలింగ్ లోక్‌సభ నియోజకవర్గం కూడా ఇందులో భాగంగా ఉంది. 2009 నుంచి ఈ లోక్‌సభ స్థానంలో బీజేపీ జైత్రయాత్ర కొనసాగుతున్నది. ఇక్కడ తన బలాన్ని మరింత పటిష్టం చేసుకోవాలని బీజేపీ భావిస్తుండగా ఈ ప్రాంతంపై తిరిగి పట్టు సాధించేందుకు టీఎంసీ ప్రయత్నిస్తున్నది. చారిత్రకంగా ఉత్తర బెంగాల్ కాంగ్రెస్, లెఫ్ట్ ఫ్రంట్‌కు కంచుకోటగా ఉండేది. గిరిజనులు, మైనారిటీలు అధిక సంఖ్యలో ఇక్కడ నివసిస్తున్నారు. అనేక ఏండ్లపాటు వెనుకబడినా ఇటీవలే అక్కడ టీఎంసీ బలం క్రమంగా పెరుగుతోంది. 2016 అసెంబ్లీ ఎన్నికల్లో ఉత్తర బెంగాల్‌లో టీఎంసీ 25 గెలుచుకుంది. అయితే 2021 ఎన్నికల్లో ఈ ప్రాంతంలో బీజేపీ 35 సీట్లలో గెలుపొంది ఆధిక్యతను చాటింది. ఈ నేపథ్యంలో ఉత్తర బెంగాల్‌లోని 54 అసెంబ్లీ స్థానాల్లో మెజారిటీ సీట్లను కైవసం చేసుకోవడానికి బీజేపీ ప్రయత్నాలు చేస్తున్నది.



ఒకే రకమైన మీల్స్‌తో బరువు తగ్గొచ్చు!

తాజా అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ: సరళమైన, క్రమబద్ధమైన ఆహారపు అలవాట్ల ప్రాముఖ్యాన్ని పరిశోధకులు శాస్త్రీయంగా కనుగొన్నారు. ప్రతి రోజూ ఒకే రకమైన భోజనం చేయటమన్నది..వేగంగా బరువు తగ్గడానికి సహాయపడొచ్చని పరిశోధకులు గుర్తించారు. 'హెల్త్ సైకాలజీ' జర్నల్ కథనం ప్రకారం, సాధారణ ఆహారపు అలవాట్లు డైటింగ్‌ను ఎలా సులభతరం చేయగలదో ఈ అధ్యయనం తెలియజేసింది. ఒరేగాన్ (అమెరికా) రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ పరిశోధకులు 12 వారాల్లో బరువు తగ్గే కార్యక్రమాన్ని నిర్వహించారు. దీంట్లో పాల్గొన్న 112 మందికి ఉన్న అధిక బరువు, ఊబకాయాన్ని విశ్లేషించారు. వీళ్లంతా ఒక మొబైల్ యాప్ ద్వారా తాము రోజూ తీసుకుంటున్న ఆహారాన్ని, బరువును నిరంతరం రికార్డ్ చేశారు. ఇలా 12 వారాలు గడిచిన తర్వాత వారి గణాంకాల్ని పరిశోధకులు విశ్లేషించారు. స్థిరమైన ఆహార అలవాట్లను పాటించినవారు 5.9 శాతం బరువు తగ్గగా, రకరకాల ఆహారాలు తీసుకున్నవారు 4.3 శాతం బరువును కోల్పోయారు.



నోయిడా ఎయిర్‌పోర్ట్ తొలి దశ ప్రారంభం

నోయిడా: నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయం తొలి దశను ప్రధాని నరేంద్ర మోదీ శనివారం జేవర్‌లో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు పాల్గొన్నారు. ప్రధాని సందర్శన సందర్భంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. రూ.11,200 కోట్ల అంచనా వ్యయంతో ఈ విమానాశ్రయం తొలి దశను నిర్మించారు. రోడ్డు, రైలు, మెట్రో, ప్రాంతీయ రవాణా వ్యవస్థల ద్వారా నిరంతరాయ అనుసంధానంతో మల్టీ మోడల్ రవాణా హబ్‌గా దీన్ని రూపొందించారు. ఈ ప్రాజెక్టులో మల్టీ మోడల్ కార్గో హబ్ కూడా భాగం. ఏడాదికి 2.5 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా కార్గోను ఇది ప్రాథమికంగా నిర్వహించగలదు. దీన్ని దాదాపు 18 లక్షల మెట్రిక్ టన్నుల వరకు విస్తరించే అవకాశం ఉంటుంది.ఈ సందర్భంగా జరిగిన సభలో మోదీ మాట్లాడుతూ పశ్చిమాసియా యుద్ధం వల్ల ఏర్పడిన సవాళ్లను మన దేశం సమర్థంగా ఎదుర్కొంటున్నదన్నారు.



నిర్మల్‌లో రాగాలు పలికే రాళ్లను చూపుతున్న చరిత్ర పరిశోధకుడు దేవరావు

నిర్మల్ గుట్టలపై రాగాలు పలికే రాళ్లు

నిర్మల్ అర్బన్, మార్చి 28 : నిర్మల్ గుట్టలపై పలుచోట్ల రాగాలు పలికే అరుదైన రాళ్లను గుర్తించినట్టు ప్రముఖ కవి, చరిత్ర పరిశోధకుడు తుమ్మల దేవరావు శనివారం తెలిపారు. ఈ రాళ్లను అరుదైన భౌతిక వారసత్వంగా రక్షించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఇవి బాసర గుట్టలు, నిర్మల్ పట్టణంలోని గండిరామన్న గుట్టపైన ఖిల్లా గుట్ట పశ్చిమ వైపు రాళ్ల శ్రేణిలో ఉన్నాయని తెలిపారు. 66 మిలియన్ ఏండ్ల క్రితం దక్కన్ పీఠభూమిలో అగ్ని పర్వతాల విస్ఫోటాల వల్ల పైకి వచ్చిన లావా గట్టిపడి బాస్టాల్ శిలగా మారిందని వివరించారు. ఈ ప్రక్రియలో ఏర్పడిన కొన్ని శిలలు ఘన నిర్మాణం కారణంగా శబ్ద తరంగాలను ప్రత్యేకంగా ప్రతిధ్వనింపజేస్తాయని పేర్కొన్నారు. ఈ అరుదైన రాళ్లను జియో హెరిటేజ్ స్పాట్‌గా అభివృద్ధి చేసి రక్షించాలని సూచించారు. ఈ క్షేత్ర పర్యటనలో నేరెళ్ల హన్మంతు, అబ్బడి రాజేశ్వర్, దొంతుల భీమేశ్ ఉన్నారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే పేరిట గుట్టలు ధ్వంసం

- మొరం కోసం జేసీబీలతో తొలిచేస్తున్న కాంట్రాక్టర్
- మాయమవుతున్న వందలాది చెట్లు
- కనుమరుగువుతున్న ప్రకృతి సంపద

చిట్యాల, మార్చి 28 : గ్రీన్‌ఫీల్డ్ హైవేకు అవసరమైన మట్టి కోసం గుట్టలను ధ్వంసం చేస్తున్నారు. అభివృద్ధి పేరిట జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం శాంతినగర్ సమీపంలో గుట్టలపై ఉన్న చెట్లు నరికి, గుట్టలను తోడేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం రెండేండ్ల క్రితం వరంగల్-మంచిర్యాల రహదారిని మంజూరు చేసింది. దీంతో చిట్యాల, టేకుమట్ల మండలాల్లో కాల్వపల్లి, గిద్దెముత్తారం, పంగిడిపల్లి, రామకృష్ణాపూర్(టీ), అంకుషాపూర్, నవాబుపేట శివార్లలో రహదారి పనులు 3నెలల క్రితం ప్రారంభమయ్యాయి. రోడ్డు నిర్మాణ పనులకు మట్టి అవసరం ఏర్పడటంతో గుట్టల్లోకి భారీ యంత్రాలు, జేసీబీలు దిగుతున్నాయి. కలపతోపాటు మట్టిని అడ్డూఅదుపు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా తీసుకెళ్తున్నారని రైతులు చెప్తున్నారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులకు కొందరు గుట్టల మట్టిని అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారని మండిపడుతున్నారు.



భూపాలపల్లి జిల్లా శాంతినగర్‌లోని గుట్టపై జేసీబీ సాయంతో తవ్వకాలు

కనుల పండువగా శ్రీరామ మహాపట్టాభిషేకం





శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో శ్రీసీతారామచంద్రస్వామి వారికి పట్టాభిషేకం నిర్వహిస్తున్న వేద పండితులు.. రామయ్యకు పట్టువస్త్రాలు సమర్పిస్తున్న గవర్నర్ శివప్రతాప్ శుక్లా దంపతులు

- స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించిన గవర్నర్ ఎస్పీ శుక్లా
- హాజరైన మంత్రి తుమ్మల తదితరులు

ఖమ్మం, మార్చి 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం పట్టణంలో శనివారం శ్రీరామ మహాపట్టాభిషేకాన్ని కనులపండువగా నిర్వహించారు. శ్రీరామనవమి సందర్భంగా శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణం జరిగిన మరుసటి రోజు మహా పట్టాభిషేకం నిర్వహించడం ఆనవాయితీ. మహా పట్టాభిషేకానికి రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా హాజరై రామయ్యకు పట్టువస్త్రాలు సమర్పించారు. గవర్నర్‌కు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్‌రాజు, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ఘనస్వాగతం పలికారు. ఆలయానికి విచ్చేసిన గవర్నర్ దంపతులకు దేవస్థానం అధికారులు పూర్ణకుంభం, వేదమంత్రాలతో స్వాగతం పలికారు. భక్తులు స్వామివారికి చేయించిన స్వర్ణ సింహాసనాన్ని మిథిలా స్టేడియంలో ఏర్పాటు చేసి దానిపై శ్రీరాముడికి పట్టాభిషేక తంతు నిర్వహించారు. తొలుత శ్రీరామ బంగారు పాదుకలు, రాజనీతిని తెలియజేసే రాజదండం, రాజముద్రిక, భక్తరామదాసు చేయించిన పచ్చల పతకం శ్రీరామునికి, చింతాకు పతకం సీతమ్మకు, శ్రీరామమాడ లక్ష్మణస్వామికి, తామరం, బంగారం ఛత్రం, రాజ ఖడ్గాన్ని అర్చక స్వాములు పట్టాభిషిక్తుడైన రామయ్యకు సమర్పించారు. ప్రధాన లాంఛనమైన సామ్రాట్ కిరీటాన్ని రామయ్యకు ధరింపజేయగా భక్తజన కోటి కరతాళ ధ్వనులతో జేజేలు పలికారు. దేవేంద్రుడు రామయ్యకు కానుకగా పంపినట్టు చెప్పే ముత్యాల హారాన్ని రామచంద్రమూర్తికి, ఆ తర్వాత సీతమ్మ తల్లికి, చివరగా రామభక్త సామ్రాజ్యానికి రారాజు అయిన హనుమంతునికి సమర్పించి అర్చకులు ప్రోక్షణ గావించారు. వేదాశీర్వచనం, అష్టోత్తర శతహారతి 108 ఒత్తులతో వెలిగించి శ్రీరామచంద్ర ప్రభువుకు సమర్పించడంతో మహాపట్టాభిషేకం సుసంపన్నమైంది. కార్యక్రమంలో ఎంపీ బలరాంనాయక్, కలెక్టర్ అంకిత్, ఐటీడీఏ పీవో రాహుల్, భద్రాద్రి దేవస్థానం ఈవో దామోదర్‌రావు, న్యాయమూర్తి శివనాయక్ తదితరులు పాల్గొన్నారు.

నవమి ప్రకటనలో సురేఖ ఫొటో గల్లంతు!

- దేవాదాయ శాఖ మంత్రి ఫొటో లేకుండానే జారీ
- సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఫొటోలతోనే సరి
- యాడ్‌లో ఫొటో లేకపోవడంపై మంత్రి కొండా మనస్తాపం!
- మంత్రి పొంగులేటే ఫొటో వద్దన్నట్టుగా జోరుగా ప్రచారం

హైదరాబాద్, మార్చి 28(నమస్తే తెలంగాణ): శ్రీరామనవమి పర్వదినాన ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ వివిధ పత్రికల్లో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ప్రకటన (అడ్వర్టైజ్‌మెంట్)ల్లో దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఫొటో గల్లంతైంది. భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో నిర్వహించిన సీతారామ కల్యాణ మహోత్సవానికి ఆహ్వానం తెలుపడంతో



పాటు ఆలయ అభివృద్ధి, గోదావరి పుష్కర ఘాట్ల నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి భూమి పూజ చేస్తారని ఆ ప్రకటనలో ప్రభుత్వం పేర్కొన్నది. ఆ ప్రకటనలో కనీసం ఆమె పేరు కూడా ఎక్కడా లేకపోవడం గమనార్హం. కేవలం సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఫొటోలతోనే ఆ ప్రకటన జారీచేశారు. దేవాదాయ శాఖ మంత్రి ఫొటో లేకుండా కార్యక్రమ ప్రకటన జారీచేయడంపై సర్వత్రా చర్చనీయాంశమైంది. దీనిపై ఇటు కాంగ్రెస్‌లో అటు అధికార వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతున్నది. ఇది కచ్చితంగా దేవాదాయ శాఖ మంత్రిని అవమానించడమేననే అభిప్రాయాలను వ్యక్తమవుతున్నాయి. ఇది తనను అవమానించడమేనంటూ కొండా సురేఖ తన సన్నిహితుల వద్ద ఆవేదన వ్యక్తం చేసినట్టుగా తెలిసింది.

పొంగులేటి హస్తం ఉన్నదా?

ప్రభుత్వం ఇచ్చిన యాడ్‌లో మంత్రి కొండా సురేఖ ఫొటో లేకుండా చేయడంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హస్తం ఉన్నదనే చర్చ కొండా సురేఖ అనుచర వర్గంలో జరుగుతున్నది. తన ఫొటో వేస్తే మంత్రి కొండా సురేఖ ఫొటో కూడా వేయాల్సి వస్తుందనే ఆలోచనతో పొంగులేటి తన ఫొటో కూడా వద్దన్నట్టుగా తెలిసింది. ఇప్పటికే మంత్రి పొంగులేటికి, మంత్రి కొండా సురేఖ నడుమ నెలకొన్న వైరం బహిరంగ రహస్యమే. ఈ నేపథ్యంలోనే మంత్రి పొంగులేటి ఇలా చేశారనే చర్చ జరుగుతున్నది.

ఫార్మా సిటీ జీవోను రద్దు చేయాలి

- రైతు సంఘం కార్యదర్శి పశ్య పద్మ డిమాండ్

హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ): ఫార్మా సిటీని రద్దు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం దానికి సంబంధించిన జీవోను రద్దు చేయలేదని రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి పశ్యపద్మ విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఫార్మాసిటీని రద్దుచేసి, అక్కడి భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని డిమాండ్ చేశారు. శనివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. హైకోర్టు తీర్పు తర్వాత కూడా రైతుల పేర్లను అసైన్డ్ భూముల రికార్డుల నుంచి తొలగించి తెలంగాణ రాష్ట్ర ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్‌లో చేర్చారని ఆరోపించారు. పట్టా భూములను ఆన్‌లైన్‌లో నమోదుచేసి, బాధిత రైతులకు న్యాయం చేయాలని కోరారు.



ఆస్తి పన్ను బకాయిల వసూలులో భాగంగా శనివారం మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలోని మేరు సంఘ భవనానికి తాళం వేస్తున్న మున్సిపల్ కమిషనర్, సిబ్బంది



హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో ఆశా వర్కర్లతో కలిసి ధర్నా చేస్తున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ముఠా జయసింహ



ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో ఆశా కార్యకర్తను లాక్కెళ్తున్న మహిళా పోలీసులు

ఆశావర్కర్ల అరెస్టు

'చలో హైదరాబాద్'ను అడ్డుకున్న పోలీసులు • అరెస్టులతో అట్టుడికిన ఆర్టీసీ క్రాస్ రోడ్స్ • పలువురు 'ఆశా'లకు గాయాలు

మద్దతుగా ధర్నాలో పాల్గొన్న ఎమ్మెల్యే పల్లా • పల్లాను అసెంబ్లీకి తరలింపు • ప్రభుత్వ అణచివేత తగదు: జాన్‌వెస్లీ

చిక్కడపల్లి, మార్చి 28: కాంగ్రెస్ సర్కార్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని శనివారం ఆశా వర్కర్లు శాంతియుతంగా తలపెట్టిన 'చలో హైదరాబాద్' కార్యక్రమంపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. వివిధ జిల్లాల నుంచి భారీ సంఖ్యలో వచ్చిన ఆశా కార్యకర్తలను పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకొని అరెస్టు చేశారు. దీంతో ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ వద్ద ఉద్రిక్తత పరిస్థితి నెలకొన్నది. దాదాపు గంటపాటు ఆశా కార్యకర్తల అరెస్టులతో ఆ ప్రాంతం అట్టుడికింది. పలువురు ఆశా కార్యకర్తలకు గాయాలయ్యాయి. ములుగు జిల్లా నుంచి వచ్చిన అనిత అనే ఆశావర్కర్ అస్వస్థతకు గురికాగా, గాంధీ దవాఖానకు తరలించి చికిత్స అందించారు. రేవంత్ సర్కార్ రాష్ట్ర వ్యాప్తంగా ఆశాకార్యకర్తలను ఎక్కడికక్కడే అరెస్టు చేసి, పోలీస్ స్టేషన్లకు తరలించింది. అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి ఇచ్చిన రూ. 18 వేల కనీస వేతనం హామీని నెరవేర్చాలని, నెలల తరబడి బకాయిలను వెంటనే విడుదల చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ శనివారం 'చలో హైదరాబాద్'కు ఆశా కార్యకర్తలు, భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ (బీఆర్‌టీయూ) పిలుపు ఇచ్చింది. ఇందిరాపార్కులోని ధర్నా చౌక్ వద్ద ధర్నా చేయడానికి సర్కార్ శుక్రవారం సాయంత్రం అనుమతి ఇచ్చి అదే రోజు రాత్రి రద్దు చేసింది. కానీ శనివారం ఉదయం 'చలో హైదరాబాద్' కార్యక్రమానికి ఆశా కార్యకర్తలు భారీగా నగరానికి చేరుకున్నారు. దీంతో పోలీసులు వారిని ఎక్కడికక్కడే అక్రమ అరెస్టు చేశారు. దీంతో బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షురాలు సంతోషితోపాటు ఆశా వర్కర్లు ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 'ఇదేమీ రాజ్యం ఇదేమీ రాజ్యం.. దోపిడీ రాజ్యం దొంగల రాజ్యం', 'సీఎం డౌన్ డౌన్', 'చెట్టు మీద కొంగ.. రేవంత్ రెడ్డి దొంగ', 'ప్రజా పాలన కాదు.. రజాకార్ల పాలన' అనే నినాదాలతో ఆర్టీసీ క్రాస్ రోడ్స్ దద్దరిల్లింది. బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్‌ను శుక్రవారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయన వద్ద ఉన్న సెల్‌ఫోన్ సైతం తీసుకున్నారు. మీడియాతో మాట్లాడకుండా నిర్బంధించారు. శనివారం సాయంత్రం విడుదల చేశారు. ఆశావర్కర్లను అడ్డుకొని, అరెస్టులు, నిర్బంధాలకు ప్రభుత్వం పాల్పడటం దారుణమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ విమర్శించారు. శనివారం ప్రభుత్వ చర్యలను ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనే వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి హాజరైన మహిళలను పోలీసులు లాఠీలతో కొట్టి, గాయపర్చడాన్ని జాన్‌వెస్లీ తప్పుపట్టారు.

హామీలు అమలును ప్రశ్నిస్తే అరెస్టులా?

ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఫైర్

చిక్కడపల్లి, మార్చి 28: ఆశావర్కర్లకు ఇచ్చిన హామీలు అమలు చేయమంటే ప్రభుత్వం పోలీసులచేత అరెస్టు చేయిస్తున్నదని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మండిపడ్డారు. ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో శనివారం ఆశావర్కర్లకు మద్దతుగా ధర్నా నిర్వహించారు. బీఆర్ఎస్ యువనాయకుడు ముఠా జయసింహ, ఆశావర్కర్స్ యూనియన్ అధక్షురాలు సంతోషి, బీఆర్ఎస్ నాయకులు, ఆశావర్కర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్ని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. ఇందిరా పార్కు వద్ద ధర్నాకు అనుమతి ఇచ్చినట్టే ఇచ్చి రద్దు చేయడం దారుణమని సర్కార్‌పై, అక్రమ అరెస్టులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ యువ నేత ముఠా జయసింహ మాట్లాడుతూ మోసపూరిత హామీలతో అధికారంలో వచ్చిన కాంగ్రెస్ వాటిని అమలు చేయమంటే అరెస్టులు చేస్తున్నారని విమర్శించారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డిని పోలీసులు అసెంబ్లీకి తరలించి, ఆశా వర్కర్లను అరెస్టు చేశారు.



పోలీస్‌స్టేషన్‌లో రాంబాబుయాదవ్



గద్వాల జిల్లా అయిజలో ఆశా కార్యకర్తలను ముందస్తుగా అదుపులోకి తీసుకొన్న పోలీసులు

జర్నలిస్టు కేవీఆర్ అరెస్టు అప్రజాస్వామికం

తెలంగాణలో ఏపీ రాజకీయాలా?

రాష్ట్రంలో ఎల్లో కాంగ్రెస్ పాలన

రౌండ్‌టేబుల్ మీటింగ్ వక్తలు

ఖైరతాబాద్, మార్చి 28: జర్నలిస్టు కేవీఆర్‌ను ఏపీ పోలీసులు అరెస్టు చేయడం అప్రజాస్వామికమని, తక్షణమే ఆయనపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. తెలంగాణ సమాఖ్య ఆధ్వర్యంలో 'ప్రమాదంలో తెలంగాణ అస్తిత్వం' అనే అంశంపై శనివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీనియర్ జర్నలిస్టు పల్లె రవికుమార్ మాట్లాడుతూ తెలంగాణ జర్నలిస్టు కేవీఆర్ అరెస్టు వెనుక ఏపీకి చెందిన పెద్ద వ్యవస్థ పనిచేసిందని ఆరోపించారు. కేవీఆర్‌పై దాడి, అక్రమ అరెస్టును ఇక్కడి అస్తిత్వంపై దాడిగానే భావిస్తున్నామని అన్నారు. సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తెలంగాణలో పరిశ్రమలన్నింటినీ మూసివేయించాడని, నిజాం షుగర్స్‌కు చెందిన 32 వేల ఎకరాల చెరుకు భూములను ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేశాడని విమర్శించారు. నాటి బాబు పాలనకు వ్యతిరేకంగానే తెలంగాణ ఉద్యమం వచ్చిందని తెలిపారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభు త్వ హయాంలో నదులు, నిధులు, నియామకాలన్నీ ఏపీకే పోతున్నాయని, సీఎం ఆఫీసు నిండా బాబు మనుషులే ఉన్నారని మండిపడ్డారు. ఎల్లో కాంగ్రెస్, ఎల్లో మీడియా కలిసి ఇక్కడ దురాగతాలకు పాల్పడుతున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. జర్నలిస్టు కేవీ రెడ్డి మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక పాలనను ఎండగట్టినందుకే తనను అక్కడి పోలీసులు అరెస్టు చేసి వేధింపులకు గురిచేశారని తెలిపారు. తెలంగాణలో ఆంధ్రా రాజకీయాలు కొనసాగుతున్నాయని, తన గొంతు నొక్కేస్తే అలాంటి విషయాలు వెలుగులోకి రావని తనపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని అన్నారు. తెలంగాణ సమాఖ్య కన్వీనర్ కరుణాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశం లో సినీ దర్శకుడు, సామాజికకార్యకర్త సయ్యద్ రఫీ, సీనియర్ జర్నలిస్టు మామిడి సోమయ్య, తెలంగాణ క్రాంతిదళ్ అధ్యక్షుడు పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.





స్కోచ్ అవార్డును అందుకుంటున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌కు జాతీయ గుర్తింపు

- ఎస్పీ, కలెక్టర్లకు 'స్కోచ్' అవార్డులు
- 'పోలీస్ అక్క' కార్యక్రమంతో పేద విద్యార్థినులకు బాసట
- 'అమ్మరక్షిత పథకం' ద్వారా జిల్లాలో మాతృ మరణాల కట్టడి
- ఢిల్లీ వేదికగా అవార్డుల స్వీకరణ

నిర్మల్, మార్చి 28 (నమస్తే తెలంగాణ) : నిర్మల్ జిల్లాలో కొనసాగుతున్న పరిపాలన ప్రతిభకు జాతీయ స్థాయిలో పట్టంకట్టారు. నిర్మల్ ఎస్పీ డాక్టర్ జానకీషర్మిల ఆధ్వర్యంలో కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లోని విద్యార్థినులను అకాడమిక్ దిశగా బలోపేతం చేసేందుకు చేపట్టిన పోలీస్ అక్క కార్యక్రమానికి, కలెక్టర్ అభిలాష అభినవ్ గర్భిణుల మాతృ మరణాల కట్టడికి అమల్లోకి తీసుకొచ్చిన అమ్మ రక్షిత పథకం కార్యక్రమానికి జాతీయ స్థాయి గుర్తింపు లభించాయి. ఎస్పీ, కలెక్టర్ చేపట్టిన ఈ కార్యక్రమాలకు వేర్వేరుగా స్కోచ్ అవార్డులు లభించడం ప్రాధాన్యతను సంతరించుకున్నది. వీరిద్దరికీ శనివారం ఢిల్లీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో స్కోచ్ యాజమాన్యం అవార్డులు అందజేసింది. ప్రస్తుత సమాజంలో మహిళలు, విద్యార్థినుల భద్రతకు భరోసా కల్పించేలా ఎస్పీ జానకీషర్మిల ప్రారంభించిన 'పోలీస్ అక్క' కార్యక్రమం కమ్యూనిటీ పోలీసింగ్ మోడల్‌గా నిలిచి దేశ వ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటున్నది. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించడమే కాకుండా, భావోద్వేగ, మానసిక, శారీరక భద్రతపై శిక్షణ అందిస్తున్నారు. మహిళా పోలీస్ సిబ్బంది గ్రామాల్లో పెట్రోలింగ్ చేస్తూ డయల్ 100 కాల్స్‌కు స్పందించి అత్యవసర సేవలు అందిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఇప్పటి వరకు ఏడు వేల మంది విద్యార్థినులు, మహిళలకు నేరుగా ప్రయోజనం చేకూరింది. రాష్ట్రంలోనే తొలిసారిగా నిర్మల్ జిల్లాలో మాత్రమే ప్రవేశపెట్టిన ఈ పోలీస్ అక్క కార్యక్రమం.. నేడు జాతీయ స్థాయిలో గుర్తింపును సాధించి ప్రతిష్ఠాత్మక స్కోచ్ అవార్డుకు ఎంపికైంది. ఈ అవార్డును అందుకున్న ఎస్పీ సోషల్ మీడియా ట్రెండింగ్‌లో జాతీయ స్థాయిలో రెండోస్థానంలో నిలిచారు. డీజీపీ ఎక్స్ వేదికగా ఎస్పీ జానకీషర్మిలకు అభినందనలు తెలిపారు.



ఢిల్లీలో స్కోచ్ యాజమాన్యం నుంచి అవార్డు అందుకుంటున్న నిర్మల్ ఎస్పీ డాక్టర్ జానకీషర్మిల

మాతృ మరణాల కట్టడికి 'అమ్మ రక్షిత పథకం'

నిర్మల్ జిల్లాలో గర్భిణుల మాతృ మరణాలు కట్టడికి కలెక్టర్ అభిలాష అభినవ్ రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా అమ్మ రక్షిత పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలుచేశారు. ఇందులో భాగంగా మహిళలు గర్భం దాల్చిన నాటి నుంచి డెలివరీ అయిన 45 రోజుల వరకు సమీపంలోని ప్రభుత్వ దవాఖానల్లో అన్ని రకాల వైద్య సహాయాన్ని అందజేసేందుకు ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయించారు. గతంలో జిల్లా వ్యాప్తంగా ఏటా 25 వరకు మాతృమరణాలు చోటు చేసుకోగా, ఈ కార్యక్రమం అమలైన తర్వాత మరణాల సంఖ్య మూడుకు చేరుకున్నది. జిల్లా వైద్యారోగ్యశాఖ ద్వారా అందించిన ఈ సేవలను గుర్తించిన స్కోచ్ యాజమాన్యం కలెక్టర్‌కు అవార్డును అందజేయగా.. వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజేందర్ పాల్గొన్నారు. జిల్లా ఉన్నతాధికారులు ఇదరూ జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మక అవార్డులను అందుకోవడంపై పలుశాఖల అధికారులతోపాటు, ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు.



హనుమాన్ టేక్డీలోని బీసీ సాధికారత భవన్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సత్యనారాయణ

బీసీల రాజకీయ పార్టీ రావాలి

- రాజ్యాధికారం దిశగా బడుగుల అడుగులు
- ఏప్రిల్ 7న బీసీల రాజకీయ కార్యాచరణ
- బడుగులను దగా చేసిన కాంగ్రెస్, బీజేపీ
- తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ

సుల్తాన్‌బజార్, మార్చి 28: బీసీ రాజ్యాధికారం దిశగా ఏప్రిల్ 7న రాజకీయ కార్యాచరణ ప్రకటిస్తామని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ వెల్లడించారు. ఈ మేరకు ఆ రోజు అన్ని బీసీ సంఘాలు, పార్టీల ప్రతినిధులు, సానుభూతిపరులతో విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేసి చర్చిస్తామని తెలిపారు. బీసీల నేతృత్వంలో రాజకీయ పార్టీని ఏర్పర్చుకొని అధికారంలోకి రావడం మినహా మరో మార్గం లేదని, ఉద్యమ దిశను అటువైపే పయనించాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ హనుమాన్ టేక్డీలోని బీసీ సాధికారత భవన్‌లో శనివారం పాండుయాదవ్, కాశీనాథ్ అధ్యక్షతన బీసీ కులాల ఐక్యవేదిక జనరల్ బాడీలో సత్యనారాయణ మాట్లాడారు. తాము కేంద్రంలో అధికారంలో కొస్తే బీసీ డిక్లరేషన్ అమలుపరిచే వాళ్లమని అసెంబ్లీ నిండు సభ సాక్షిగా సీఎం రేవంత్‌రెడ్డి తమ మోసాన్ని ఒప్పుకొన్నారని ధ్వజమెత్తారు. ఈ నేపథ్యంలో బీసీలు సంఘటితంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. హిందుత్వ పేరుతో ఫ్యూడల్ స్వభావంతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీసీలను అణచివేస్తున్నదని ధ్వజమెత్తారు. అన్నిరంగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని ప్రగల్భాలు పలికి గద్దెనెక్కిన కాంగ్రెస్.. రెండున్నరేండ్లు దాటినా కోర్టు తీర్పు వైపుగా దిశను మళ్లించి చేతులు దులుపుకొన్నదని బీసీ నేత వీజీఆర్ నారగోని విమర్శించారు. కాంట్రాక్టుల్లో 42 శాతం రిజర్వేషన్లు తదితర హామీలనూ అమలు చేయకుండా అగ్రకుల అనుకూల పాలన కొనసాగిస్తున్నారని దుయ్యబట్టారు. సమావేశంలో బీసీసీఈ ఇన్‌చార్జి రచయిత ఇంద్రవెల్లి రమేశ్, బీసీ సంక్షేమ సంఘం సభ్యులు గుజ్జ కృష్ణ, చీమల జగదీశ్‌యాదవ్, వేముల రామకృష్ణ, సంధ్యారాణి, విజయ్ మహేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూమ్ ఇండ్లలో అక్రమ ప్రవేశాలు

- ప్రజాప్రతినిధుల అండతో కాంగ్రెస్ కార్యకర్తల కబ్జా!
- పట్టించుకోని రెవెన్యూ, పోలీసు అధికారులు

పాలకుర్తి, మార్చి 28 : అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నేతల అండదండలతో కొందరు అక్రమంగా డబుల్ బెడ్రూమ్ ఇండ్ల తాళాలు ధ్వంసం చేసి స్వాధీనం చేసుకున్న ఘటన జనగామ జిల్లా పాలకుర్తి మండలం సిరిసన్నగూడెంలో చోటు చేసుకున్నది. నిరుపేదలకు డబుల్ బెడ్రూమ్ ఇండ్లు ఇవ్వాలనే ధ్యేయంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం సిరిసన్నగూడెంలో 20 ఇండ్లు నిర్మించింది. ఇంతలో అసెంబ్లీ ఎన్నికలు రావడంతో లబ్ధిదారుల ఎంపిక వాయిదా పడింది. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. రెండున్నరేండ్లు గడిచినా సర్కార్ లబ్ధిదారులను ఎంపిక చేయలేదు. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు నాయకులు ఎమ్మెల్యే అండదండలతో పలువురి నుంచి డబ్బులు వసూలు చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలు 20 మంది బుధవారం రాత్రి అక్రమంగా డబుల్ బెడ్రూమ్ ఇండ్ల తాళాలు పగులగొట్టి స్వాధీనం చేసుకున్నారు. వీరంతా ఆర్థికంగా ఉన్నవారేనని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సింగరేణి తీరుపై భగ్గుమన్న టీబీజీకేఎస్

- తక్షణమే మెడికల్ బోర్డు ప్రారంభించాలని డిమాండ్
- అంతటా ధర్నా, రాస్తారోకోలు
- భూపాలపల్లిలో సీఎం రేవంత్ దిష్టిబొమ్మ దహనం
- పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, మార్చి 28: సింగరేణిలో మెడికల్ బోర్డును వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ శనివారం సింగరేణి వ్యాప్తంగా టీబీజీకేఎస్ నేతృత్వంలో కార్మికులు ఆందోళనకు దిగారు. టీబీజీకేఎస్, బీఆర్ఎస్ నాయకులు భూపాలపల్లి ఏరియాలోని అంబేద్కర్ సెంటర్‌లో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, వరంగల్ జడ్పీ మాజీ చైర్‌పర్సన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి పాల్గొన్నారు.. అనంతరం టీబీజీకేఎస్, బీఆర్ఎస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ.. నెలకు రెండు మెడికల్ బోర్డులు నిర్వహిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నేడు వాటిని రద్దు చేసేందుకు కుట్ర చేస్తున్నదని మండిపడ్డారు. 27 నెలల కాంగ్రెస్ పాలనలో ఎన్ని మెడికల్ బోర్డులు పెట్టి ఉద్యోగాలిచ్చారో కార్మికులకు తెలుపాలని డిమాండ్ చేశారు. టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి మాట్లాడుతూ.. సింగరేణి సంస్థకు ప్రభుత్వం ఇవ్వాల్సిన రూ. 50 వేలకోట్లను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పెద్దపల్లి జిల్లా పరిధిలో సింగరేణి మూడు రీజియన్లలోని బొగ్గు గనులు, డిపార్టుమెంట్ల వద్ద టీబీజీకేఎస్ నాయకులు, కార్మికులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. సింగరేణిలో మెడికల్ బోర్డు, కారుణ్య నియామకాలపై డిప్యూటీ సీఎం భట్టి వ్యాఖ్యలు, కాంగ్రెస్ వైఖరిని తప్పుబట్టారు. భద్రాద్రి కొత్తగూడెంలోని అన్ని సింగరేణి ఏరియాల్లో ఆయా సంఘాల ఆధ్వర్యంలో వినూత్నంగా నిరసనలు తెలిపారు. కొత్తగూడెం పీవీకే5 గనిలో ఏఐటీయూఈసీ ఆధ్వర్యంలో కార్మికులు ముఖాలకు నల్లరిబ్బన్లు కట్టుకొని ప్లకార్డులతో ఆందోళన చేసి, బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి వినతిపత్రం అందజేశారు. ఇల్లెందులో కార్మికులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. పాత పద్ధతిలో మెడికల్ బోర్డు నిర్వహించే వరకు ఉద్యమిస్తామని టీబీజీకేఎస్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ రంగనాథ్ అన్నారు. ఈ నెల 30న జీఎం కార్యాలయం ఎదుట జరిగే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



భూపాలపల్లిలో రాస్తారోకో నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, టీబీజీకేఎస్ అధ్యక్షుడు రాజిరెడ్డి తదితరులు



నీలి మల్లేశం కుటుంబానికి న్యాయం చేయాలని కరీంనగర్‌లో ఆందోళన చేస్తున్న ఆటో కార్మిక సంఘం నాయకులు, కుటుంబ సభ్యులు

గుండెపోటుతో ఆటో డ్రైవర్ మృతి

- కరీంనగర్ జిల్లా కేంద్రంలో విషాదం
- ఆటో కార్మిక సంఘం ఆందోళన
- ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్


కరీంనగర్ తెలంగాణచౌక్, మార్చి 28: ఆటో నడువక.. ఇల్లు గడువక ఆటో డ్రైవర్ మనోవేదనతో గుండెపోటుకు గురై మృతిచెందాడు. కరీంనగర్ జిల్లా కేంద్రంసుభాష్‌నగర్‌కు చెందిన నీలి మల్లేశం (50) ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇతడికి భార్య, కొడుకు, కూతురితోపాటు వృద్ధురాలైన తల్లి ఉన్నది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ పథకంతో గిరాకీ లేక కొద్దిరోజులుగా సతమతమవుతున్నాడు. శనివారం తన కూతురిని ఆటోలో పదోతరగతి పరీక్ష కేంద్రం వద్ద దింపాడు. కిరాయిల కోసం వెళ్తుండగా ఛాతి నొప్పి వచ్చింది. వెంటనే అతడి స్నేహితులు ప్రైవేట్ దవాఖానలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

ఆటో డ్రైవర్ల నిరసన

ఆటో డ్రైవర్ మల్లేశం కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఆటో కార్మిక సంఘం జేఏసీ ఆధ్వర్యంలో డ్రైవర్లు కరీంనగర్ జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించి, ధర్నా చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం జేఏసీ జిల్లా ఇన్‌చార్జి మద్దెల రాజేందర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు అనేక హామీలు ఇచ్చి అమలు చేయకపోవడంతో కుటుంబాలను పోషించుకోలేే డ్రైవర్లు మనోవేదనతో చనిపోతున్నారని అన్నారు. మల్లేశం కుటుంబంలో ఒకరికి ప్రభుత్వం ఉద్యోగం, రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

కరీంనగర్ సీపీ అక్రమ వసూళ్లు

- హోంగార్డుల పోస్టింగ్‌ల్లో అక్రమాలు: పాడి కౌశిక్‌రెడ్డి



హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ): కరీంనగర్ సీపీ గౌస్ ఆలం హోంగార్డు పోస్టింగ్‌ల్లో అక్రమ వసూళ్లకు పాల్పడ్డారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆరోపించారు. శనివారం అసెంబ్లీలో పోలీసు సంక్షేమంపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 337 మంది హోంగార్డులను కరీంనగర్ నుంచి సిరిసిల్ల, జగిత్యాలకు బదిలీ చేశారని, ఇందు లో 186 మందికి పోస్టింగ్ ఇచ్చేందుకు రూ.1.86కోట్లు సీపీ వసూలు చేశారని ఆరోపించారు. కరీంనగర్‌లో అలాట్ అయిన ఇన్నోవా వాహనాన్ని నిహైదరాబాద్‌లో తిప్పుతున్నారని మండిపడ్డారు. సీపీపై ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. సీపీ గౌస్ ఆలంపై వెంటనే సిట్ వేయాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లా పోలీసులకు రావాల్సిన పీఆర్సీ, ఏరియర్స్, టీఏలు, డీఏలను వెంటనే విడుదల చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.



రైల్వే డబుల్ లైన్ పనుల్లో ఇండ్లు కోల్పోతున్న బాధితులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

రైల్వే లైన్ పేరుతో ఇండ్లు కూల్చితే ఊరుకోం

మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరిక

మహబూబ్‌నగర్, మార్చి 28(నమస్తే తెలంగాణ ప్రతినిధి): రైల్వే డబుల్ లైన్ నిర్మాణం పేరుతో దక్షిణ మధ్య రైల్వే పేదల ఇండ్లకు ఎసరు పెడుతున్నదని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. ఎన్నో ఏండ్ల నుంచి రైల్వే లైన్ చుట్టుపక్కల నివాసముంటున్న ప్రజలకు రైల్వే శాఖ చేపడుతున్న విస్తరణ పనులు జీవన్మరణ సమస్యగా మారినట్టు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో రైల్వే డబుల్ లైన్ పనుల్లో ఇండ్లు కోల్పోతున్న బాధితులతో మాట్లాడారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఇటీవల మహబూబ్‌నగర్ నుంచి కర్నూలు వరకు డబుల్ లైన్ పనులు ప్రారంభమయ్యాయని, అయితే రైల్వే లైన్ చుట్టుపక్కల హద్దులను గుర్తించడంలో రైల్వే శాఖ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. డబుల్ లైన్ వల్ల చాలామంది పేదల ఇండ్లు కోల్పోవడమే కాక, వందలాదిమంది తమ ఇండ్లకు వెళ్లడానికి దారి కూడా లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఓవైపు తొమ్మిది ఫీట్లు కటాఫ్‌గా పేర్కొని భారీ గోడ నిర్మాణం చేపడుతున్నారని, మరోవైపు 9 ఫీట్లు కాకుండా మరో 10 ఫీట్లు ఎక్కువగా మార్కింగ్ వేయడంతో సుమారు 300 మంది పేదల ఇండ్లు ధ్వంసమయ్యే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. రైల్వే అధికారులు ప్రత్యామ్నాయం చూపించిన తర్వాతే పనులు చేపట్టాలని, లేదంటే బాధితులతో కలిసి ఢిల్లీకి వచ్చి పోరాటం చేస్తామని హెచ్చరించారు.

గాయంతో ధోనీ దూరం



న్యూఢిల్లీ: ఐపీఎల్‌లో ఆదిలోనే చెన్నై సూపర్‌కింగ్స్‌కు ఎదురుదెబ్బ తగిలింది. ఐకాన్ ప్లేయర్ మహేంద్రసింగ్ ధోనీ గాయం కారణంగా రెండు వారాల పాటు ఆటకు దూరమయ్యాడు. ఈ విషయాన్ని చెన్నై యాజమాన్యం శనివారం ఒక ప్రకటనలో అధికారికంగా పేర్కొంది. 'ధోనీ ప్రస్తుతం తొడ కండరాల గాయంతో బాధపడుతున్నాడు. పూర్తిగా కోలుకునేందుకు దాదాపు రెండు వారాల సమయం పట్టే అవకాశముంది. దీంతో లీగ్‌లో కొన్ని మ్యాచ్‌లకు అతను అందుబాటులో ఉండటం లేదు' అని చెన్నై తెలిపింది. ఐపీఎల్ మొదలైన 2008 నుంచి ఆడుతున్న 44 ఏండ్ల ధోనీ..చెన్నై ఐదు సార్లు టైటిల్ విజేతగా నిలువడంలో కీలకంగా వ్యవహరించాడు. ప్రతీ సీజన్ ప్రారంభానికి ముందు ధోనీ రిటైర్మెంట్‌పై ఊహాగానాలు మొదలవుతూనే ఉంటాయి. ఈసారి కూడా ధోనీ ఆఖరి ఆట ఆడేస్తాడా అంటూ చర్చ జరుగుతున్నది.

అంటోనెలికి పోల్‌పొజిషన్



సుజుకా(జపాన్): ఫార్ములావన్ చాంపియన్‌షిప్‌లో ఇటలీ యువ రేసర్ కిమి అంటోనెలి దూకుడు కొనసాగుతున్నది. ఇరాన్, ఇజ్రాయిల్ యుద్ధం కారణంగా అంతరాయాల మధ్య సాగుతున్న ఫార్ములావన్‌లో శనివారం జపాన్ గ్రాండ్‌ప్రి క్వాలిఫయింగ్ రేసు జరిగింది. ఆద్యంతం ఆసక్తికరంగా సాగిన రేసులో మెర్సిడెస్ డ్రైవర్ కిమీ అంటోనెలి 1:28:778సెకన్ల టైమింగ్‌తో అగ్రస్థానంలో నిలిచి పోల్‌పొజిషన్ కైవసం చేసుకున్నాడు. మెర్సిడెస్‌కే చెందిన జార్జ్ రస్సెల్(1:29:076సె), ఆస్కార్ పియాస్ట్రి(1:29:132సె) వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. ఫెరారీ స్టార్ రేసర్ లూయిస్ హామిల్టన్(6), వెర్‌స్టాపెన్(11) ఒకింత నిరాశ పరిచారు. ఆదివారం సెంట్రల్ జపాన్‌లోని సుజుకా సర్క్యూట్‌లో ప్రధాన రేసు జరుగనుంది.

భారత్, బంగ్లా పోరు డ్రా

సాఫ్ అండర్-20 చాంపియన్‌షిప్



మాలె: సాఫ్ అండర్-20 పుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో భారత్ అద్భుత ప్రదర్శన కొనసాగుతున్నది. శనివారం భారత్, బంగ్లాదేశ్ మధ్య జరిగిన గ్రూపు-బీ పోరు 1-1తో డ్రాగా ముగిసింది. పాకిస్థాన్‌పై ఘన విజయంతో టోర్నీని ఆరంభించిన యువ భారత్..బంగ్లాతో మ్యాచ్‌లోనూ అదే జోరు ప్రదర్శించింది. మ్యాచ్ మొదలైన 17వ నిమిషంలోనే విశాల్ యాదవ్ గోల్ చేయడంతో భారత్ 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే ప్రథమార్ధం మరికొద్ది క్షణాల్లో ముగుస్తుందన్న తరుణంలో అబ్దుల్ రియాద్ ఫహీమ్(45ని) గోల్ చేయడంతో స్కోరు సమమైంది. ద్వితీయార్ధంలో రెండు జట్లు గోల్ కోసం ప్రయత్నం చేసినప్పటికీ సాధ్యం కాలేదు. ఈ డ్రాతో అగ్రస్థానంలో నిలిచిన భారత్ ఇప్పటికే సెమీఫైనల్ బెర్తు ఖాయం చేసుకోగా, బంగ్లా గ్రూపులో రెండో స్థానానికి పరిమితమైంది. బుధవారం జరిగే సెమీస్‌లో మహేశ్ గవాలీ సారథ్యంలోని భారత్ తలపడుతుంది.

ఆర్‌సీబీ అదుర్స్

హైదరాబాద్‌పై ఘన విజయం • కోహ్లీ, పడిక్కల్ విజృంభణ • రాణించిన జాకబ్ డఫీ



డఫీ 3/22



కోహ్లీ (69*) నాటౌట్

బెంగళూరు: ఐపీఎల్ 19వ సీజన్‌లో డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ)కు అదిరిపోయే ఆరంభం. చిన్నస్వామి స్టేడియంలో ఉద్విగ్నభరిత క్షణాల మధ్య శనివారం జరిగిన లీగ్ తొలి పోరులో ఆర్‌సీబీ దుమ్మురేపింది. వేలాది మంది ప్రేక్షకుల మధ్య సమష్టి ప్రదర్శనతో సత్తాచాటుతూ ఆర్‌సీబీ 6 వికెట్ల తేడాతో(26 బంతులు మిగిలుండగానే) సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై ఘన విజయం సాధించింది. సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ నిరుడు సీజన్‌లో ఐపీఎల్ టైటిల్‌ను తొలిసారి ముద్దాడిన ఆర్‌సీబీ చాంపియన్ ఆట తీరు కనబరిచింది. టాస్ గెలిచిన ఆర్‌సీబీ కెప్టెన్ రజత్ పాటిదార్..హైదరాబాద్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించాడు. కెప్టెన్ ఇషాన్ కిషన్(38 బంతుల్లో 80, 8ఫోర్లు, 5 సిక్స్‌లు) ధనాధన్ అర్ధసెంచరీతో హైదరాబాద్ 20 ఓవర్లలో 201/9 స్కోరు చేసింది. క్లాసెన్(31), అనికేత్(43) రాణించడంతో హైదరాబాద్ పోరాడే స్కోరు దక్కింది. అరంగేట్రం బౌలర్ జాకబ్ డఫీ(3/22), రొమారియో షెఫర్డ్(3/54) మూడేసి వికెట్లతో రాణించారు. లక్ష్యఛేదనలో విరాట్‌కోహ్లీ(38 బంతుల్లో 69 నాటౌట్, 5ఫోర్లు, 5 సిక్స్‌లు), దేవదత్ పడిక్కల్(26 బంతుల్లో 61, 7ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధసెంచరీలతో బెంగళూరు 15.4 ఓవర్లలో 203/4 స్కోరు చేసింది. డేవిడ్ పైన్(2/35)రెండు వికెట్లు తీశాడు. డఫీకి 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

కోహ్లీ, పడిక్కల్ ధనాధన్:

లక్ష్యఛేదనలో ఆర్‌సీబీ బ్యాటర్లు ధనాధన్ బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నారు. ఫామ్‌లేమితో సతమతమవుతున్న ఫిల్ సాల్ట్..నితీశ్‌కుమార్‌రెడ్డి బౌలింగ్‌లో బౌండరీలతో విరుచుకుపడ్డా అదే జోరు కొనసాగించలేకపోయాడు. ఉనద్కట్ రెండో ఓవర్‌లో భారీ షాట్ ఆడబోయిన సాల్ట్ మిడాఫ్‌లో క్లాసెన్ చేతికి చిక్కాడు. ఒకే క్యాచ్ కోసం ఇద్దరు ప్రయత్నించినా ఆఖరికి క్లాసెన్‌కే దక్కడంతో హైదరాబాద్ ఊపిరి పీల్చుకుంది. డఫీ స్థానంలో ఇంప్యాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన దేవదత్ పడిక్కల్ క్రీజులోకి వచ్చి రావడంతోనే సిక్స్‌తో తన ఉద్దేశమేంటో చెప్పకనే చెప్పాడు. దేశవాళీ సీజన్‌లో సూపర్ ఫామ్‌ను ఐపీఎల్‌లో కొనసాగిస్తూ పడిక్కల్ అలవోకగా బౌండరీలు బాదడంతో స్కోరుబోర్డు ఊపందుకుంది. మరో ఎండ్‌లో కోహ్లీ కూడా బ్యాటు ఝులిపించడంతో పరుగుల రాక సులువైంది. డేవిడ్ పైన్ నాలుగో ఓవర్‌లో పడిక్కల్ విశ్వరూపం చూపించాడు. రెండు భారీ సిక్స్‌లు, ఓ ఫోర్‌తో పడిక్కల్ 18 పరుగులు పిండుకున్నాడు. మరుసటి ఓవర్‌లో తన వంతూ అంటూ కోహ్లీ కూడా రెచ్చిపోవడంతో 50 పరుగుల భాగస్వామ్యం ఏర్పడింది. పవర్‌ప్లే ముగిసే సరికి ఆర్‌సీబీ వికెట్ కోల్పోయి 76 పరుగులు చేసింది. 28 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద ఔటయ్యే ప్రమాదం నుంచి కోహ్లీ బయటపడగా, 8.1 ఓవర్లలో ఆర్‌సీబీ 100 పరుగుల మార్క్ అందుకుంది. ఇన్నింగ్స్ ఊపందుకుంటున్న తరుణంలో అప్పటికే అర్ధసెంచరీ పూర్తి చేసుకున్న పడిక్కల్..దూబే బౌలింగ్‌లో ఔట్ కావడంతో రెండో వికెట్‌కు 101 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. ఆ తర్వాత ఇన్నింగ్స్ బాధ్యతను తీసుకున్న కోహ్లీ..కెప్టెన్ పాటిదార్(31)తో కలిసి ముందుకు నడిపించాడు. అయితే పైన్ బౌలింగ్‌లో పటిదార్, జితేశ్(0) వెంటవెంటనే ఔటైనా..ఆఖర్లో డేవిడ్(16 నాటౌట్)తో కలిసి కోహ్లీ గెలుపు తీరాలకు చేర్చాడు.

సంక్షిప్త స్కోర్లు

హైదరాబాద్: 20 ఓవర్లలో 201/9(కిషన్ 80, అనికేత్ 43, డఫీ 3/22, షెఫర్డ్ 3/54), **బెంగళూరు:** 15.4 ఓవర్లలో 203/4(కోహ్లీ 69 నాటౌట్, పడిక్కల్ 61, పైన్ 2/35, ఉనద్కట్ 1/29)



11 మంది స్మృతిలో..

గతేడాది ఐపీఎల్ టైటిల్ గెలిచిన సందర్భంగా చిన్నస్వామి స్టేడియం పరిసరాల్లో జరిగిన తొక్కిసలాటలో మృతి చెందిన 11 మందికి ఆర్‌సీబీ, హైదరాబాద్ ప్లేయర్లు ఘనంగా నివాళి అర్పించారు. మ్యాచ్‌కు ముందు జరిగిన ప్రాక్టీస్ సెషన్‌లో ఘటనకు సంతాప సూచికంగా అందరూ 11 నంబర్ జెర్సీలు ధరించారు. దీనికి తోడు స్టేడియంలో 11 సీట్లను ఖాళీగా వదిలిపెడుతూ మృతులకు అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు. మ్యాచ్ ప్రారంభానికి ముందు ఇరు జట్ల ప్లేయర్లు బౌండరీ లైన్ వద్ద మృతుల కుటుంబాలకు సంతాప సూచకంగా కొద్దిసేపు మౌనం పాటించారు. ఆ తర్వాత జాతీయ గీతాలాపన చేసి బరిలోకి దిగారు.

ఇషాన్ ఒక్కడే:

ఇషాన్ కిషన్ కెప్టెన్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. సహచరులు విఫలమైన వేళ తన ఫామ్‌ను కొనసాగిస్తూ జట్టుకు భారీ స్కోరు అందించాడు. హెడ్(11), అభిషేక్(7) స్వల్ప స్కోర్లకే వెనుదిరుగగా, కిషన్ సాధికారిక ఇన్నింగ్స్ ఆడాడు. మిడిలార్డర్‌లో నితీశ్(1), సలీల్ అరోరా(9), హర్ష్‌దూబే(3) ఇలా వచ్చి ఆలా వెళ్లారు. క్లాసెన్‌తో కలిసి కిషన్ ఇన్నింగ్స్..హైదరాబాద్ 200ల స్కోరుకు కారణమైంది. దీనికి తోడు ఆఖర్లో అనికేత్ దూకుడుగా ఆడటం కలిసొచ్చింది.

స్పోర్ట్స్ హ్యాకథాన్ షురూ



హైదరాబాద్, ఆట ప్రతినిధి: హైదరాబాద్ వేదికగా స్పోర్ట్స్ హ్యాకథాన్ శనివారం ఘనంగా ప్రారంభమైంది. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్(టీఐటీఏ) నిర్వహిస్తున్న హ్యాకథాన్ రెండు రోజుల పాటు జరుగనుంది. ఈ సందర్భంగా టీఐటీఏ అధ్యక్షుడు సందీప్‌కుమార్ మాట్లాడుతూ 'బాస్కెట్‌బాల్, ఫెన్సింగ్, కబడ్డీ, బ్యాడ్మింటన్, పవర్‌లిఫ్టింగ్, అథ్లెటిక్స్‌తో పాటు 24 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నాం. క్రీడాకారులు ఎదుర్కొంటున్న ఫిట్‌నెస్, శారీరక, సాంకేతిక సమస్యలను విశ్లేషిస్తూ వాటికి టెక్నాలజీ పరిష్కారం చూపిస్తుందో తెలియజేస్తాం. స్పోర్ట్స్ ఇన్నోవేషన్ హబ్‌గా దేశంలో తెలంగాణను అగ్రగామిగా నిలపాలన్నదే తమ లక్ష్యం' అని అన్నారు.

చిన్నారుల మృతికి సంతాపంగా..



అంటాల్య(తుర్కియే): ఇరాన్ పుట్‌బాల్ టీమ్ అందరి మనసులు గెలుచుకుంది.అమెరికా జరిపిన బాంబు దాడిలో ప్రాణాలు కోల్పోయిన చిన్నారులకు ఫిఫా ప్రపంచకప్ సన్నాహాల్లో భాగంగా నైజీరియాతో జరిగిన పోరులో ఇరాన్ జట్టు.. ఘనంగా నివాళి అర్పించింది. జాతీయ గీతాలాపన సమయంలో ఇరాన్ ప్లేయర్లు..గులాబీ, ఉదా రంగుల్లో ఉన్న చిన్నచిన్న బ్యాక్‌ప్యాక్‌లతో చిన్నారులకు సంతాపం ప్రకటించారు. దీనికి తోడు నివాళిగా నల్లరిబ్బన్లు ధరించి మ్యాచ్ బరిలో దిగారు.

వాణిజ్య

ఎఫ్‌ఐఐలకు యుద్ధ భయాలు

మార్చి నెలలో లక్ష కోట్ల రూపాయలకు పైగా వెనుకకు



న్యూఢిల్లీ, మార్చి 28: విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల(ఎఫ్‌ఐఐ)పై యుద్ధమేఘాలు కమ్ముకున్నాయి. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు రోజురోజుకు పెరుగుతుండటం వీరిలో ఆందోళన నెలకొన్నది. దీంతో దేశీయ ఈక్విటీ మార్కెట్లో లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టిన వీరు ప్రస్తుతం వీటిని వెనక్కి తీసుకునే పనిలో పడ్డారు. అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల మధ్య యుద్ధం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు అంటే నెల రోజుల్లో దేశీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులను తరలించుకుపోయారు. మార్చి నెలలో ఏకంగా రూ.1,12,244 కోట్ల పెట్టుబడులను ఉపసంహరించుకున్నట్టు నేషనల్ సెక్యూరిటీస్ అండ్ డిపోజిటరీస్ లిమిటెడ్(ఎన్ఎస్‌డీఎల్) తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. ఒక నెలలో రికార్డు స్థాయిలో నిధులను వెనక్కి తీసుకోవడం ఇదే తొలిసారి. గతంలో అక్టోబర్ 2024లో రూ.94,017 కోట్ల తరలింపు తర్వాత ఇదే గరిష్ఠ స్థాయి కావడం విశేషం. ఈక్విటీలతోపాటు డెబిట్, క్రెడిట్ మార్కెట్ల నుంచి ఎఫ్‌ఐఐలు రూ.1,23,688 కోట్ల విక్రయాలు జరిపారు. అలాగే జనవరి నుంచి మార్చి మధ్యకాలంలో రూ.1,15, 124 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. ఫిబ్రవరిలో రూ.22,615 కోట్ల పెట్టుబడులు పెట్టిన ఎఫ్‌ఐఐలు.. ఆ మరుసటి నెలలో రివర్స్‌గేర్‌ను వేశారు. ఇదే సమయంలో ఎఫ్‌ఐఐలు మ్యూచువల్ ఫండ్లలో రూ.1,398 కోట్ల పెట్టుబడులు పెట్టడం విశేషం.

చమురు ధరలు కూడా..

ఉద్రిక్త పరిస్థితుల కారణంగా చమురు ధరలు భగ్గుమంటున్నాయి. దీంతో చమురును అత్యధికంగా దిగుమతి చేసుకుంటున్న దేశాల్లో ముందు వరుసలో భారత్ ఉండటంతో విదేశీ మదుపరులు ఆందోళనకు గురవుతున్నారు. ఫలితంగా భవిష్యత్తులో ఈక్విటీలు కుప్పకూలే ప్రమాదం ఉన్నదని గుర్తించిన ఎఫ్‌ఐఐలు..ముందుగానే తమ పెట్టుబడులను వెనక్కి తీసుకుంటున్నారని దలాల్‌స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి. రంగాలవారీగా చూస్తే ఆర్థిక సేవల రంగాల్లో పెట్టుబడుల్లో రూ.31,831 కోట్లను వెనక్కి తీసుకున్న ఎఫ్‌ఐఐలు..ఆటోమొబైల్ రంగం నుంచి రూ.4,807 కోట్లను ఉపసంహరించుకున్నట్టు నివేదిక వెల్లడించింది. ఇదే సమయంలో క్యాపిటల్ గూడ్స్‌లో రూ.3,897 కోట్ల పెట్టుబడులు పెట్టిన విదేశీ మదుపరులు..కెమికల్స్, కన్స్యూమర్ సర్వీసెస్, మెటల్, మైనింగ్ రంగాల్లో రూ.1,000 కోట్ల నిధులను చొప్పించారు. దేశ ఆర్థిక పరిస్థితులు, కార్పొరేట్ల ఫలితాల ఆధారంగా విదేశీ మదుపరులు దృష్టి సారిస్తున్నారని, వీటికి తోడు పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు కూడా పెట్టుబడుల ఉపసంహరణకు కారణాలని బీఎన్‌పీ పరిబాస్ వెల్లడించింది.

కొత్త కార్ల సందడి

వచ్చే నెలలో విడుదలకానున్న ఐదు మాడళ్లు



న్యూఢిల్లీ, మార్చి 28: దేశీయ ఆటోమొబైల్ రంగంలోకి మరిన్ని నూతన కార్లు రావడానికి సిద్ధమవుతున్నాయి. వచ్చే నెలలో కొత్తగా ఐదు మాడళ్లను విడుదల చేయబోతున్నట్టు దేశీయ, అంతర్జాతీయ వాహన సంస్థలు ప్రకటించాయి. వీటిలో ఫోక్స్‌వ్యాగన్, ఎంజీ, మెర్సిడెజ్ బెంజ్, టయోటా, నిస్సాన్‌లు ఉన్నాయి. ఒకవైపు ధరలు పెంచుతున్నప్పటికీ, మరోవైపు, నూతన వాహనాలను విడుదల చేయబోతున్నాయి. వీటిలో ఇప్పటికే పలు మాడళ్లను ప్రదర్శించాయి కూడా. వీటి వివరాలు..

ఫోక్స్‌వ్యాగన్ టైగూన్

ఫోక్స్‌వ్యాగన్ మరో నయా మాడల్‌ను దేశీయ మార్కెట్‌కు పరిచయం చేయబోతున్నది. ఐదేండ్ల తర్వాత టైగూన్ నయా మాడల్‌ను విడుదల చేస్తున్నది. 2021లో ఈ ఎస్‌యూవీని విడుదల చేసిన సంస్థ..ప్రస్తుతం ఈ మాడల్‌ను ఆధునీకరించి, ముఖ్యంగా కొనుగోలుదారులు కోరుకుంటున్న విధంగా పలు మార్పులు చేసినట్టు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. 1.0 లీటర్ పెట్రోల్ ఇంజిన్ ఆటోమేటిక్ గేర్‌బాక్స్ కలిగిన ఈ మాడల్‌లో ఎనిమిది గేర్లు ఉండనున్నాయి.

బెంజ్ సీఎల్ఏ మాడల్

జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల సంస్థ మెర్సిడెజ్-బెంజ్ మరో ఎలక్ట్రిక్ మాడల్‌ను తీసుకురాబోతున్నది. వచ్చే నెలలో సీఎల్ఏ ఎంట్రీ-లెవల్ ఈవీ సెడాన్‌ను ప్రవేశపెట్టబోతున్నట్టు ప్రకటించింది. సింగిల్ చార్జింగ్‌తో 792 కిలోమీటర్లు ప్రయాణించే ఈ మాడల్‌లో 14 ఇంచుల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, గ్లాస్ రూఫ్ వంటి ఫీచర్స్‌తో తీర్చిదిద్దింది. ఈ కారు ధర రూ.55 లక్షల నుంచి రూ.59 లక్షల మధ్యలో ఉంటుందని అంచనా.

టయోటా అర్బన్ క్రూజర్


టయోటా కంపెనీ మరో ఈవీ మాడల్ అర్బన్ క్రూజర్‌ను ప్రవేశపెట్టబోతున్నది. 40 కిలోవాట్లు, 61 కిలోవాట్ల బ్యాటరీ ప్యాక్‌తో లభించనున్న ఈ కారు సింగిల్ చార్జింగ్‌తో 543 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. బ్యాటరీ-యాస్-ఏ-సర్వీసెస్(బాస్) ప్రోగ్రాం పద్దతిన ఈ మాడల్‌ను ప్రవేశపెడుతున్నది.

నిస్సాన్ టెక్టాన్

నిస్సాన్ మరో ఎస్‌యూవీని విడుదల చేయబోతున్నది. రెనో డస్టర్‌కు ప్రత్యామ్నాయంగా టెక్టాన్‌ను తీసుకొస్తున్నది.

సైబర్ దాడులతో ప్రజల ప్రాణాలకు ముప్పు!

డెలాయిట్ సైబర్ ప్రెసిడెంట్ గౌరవ్ శుక్ల



న్యూఢిల్లీ, మార్చి 28: ఆరోగ్య సంరక్షణ, పవర్ గ్రిడ్‌ల వంటి కీలక మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకొని ఇటీవల కాలంలో సైబర్ దాడులు జరుగుతున్నాయి. అయితే ఇవి కేవలం డాటాను దొంగలించడానికి మాత్రమే పరిమితం కాలేదని, మానవుల ప్రాణాలకు ముప్పు కలిగించే స్థాయికి చేరుకున్నాయని సైబర్ సెక్యూరిటీ నిపుణులు హెచ్చరిస్తున్నారు. దేశంలో డిజిటల్ పురోగతి అనే అంశంపై డెలాయిట్ ప్రతినిధి గౌరవ్ శుక్లా మాట్లాడుతూ.. నూతన టెక్నాలజీతోఈ దాడుల అవకాశాలను మరింత పెంచాయని, తద్వారా విమానయానం, రవాణా, ప్రజా సేవల రంగాలకు ముప్పుగా పరిణమించనున్నాయన్నారు. గత రెండేండ్లుగా సైబర్ దాడులు కేవలం ఐటీ వ్యవస్థలకు మాత్రమే పరిమితం కాలేదని, ఈ పరిధి దాటి వ్యాపిస్తున్నాయి. కీలక మౌలిక సదుపాయాలను సైబర్ నేరగాళ్లు లక్ష్యంగా చేసుకుంటున్నారు. గత కొన్నేండ్లుగా డిజిటల్ సాంకేతికతో వచ్చిన మార్పులు ఈ దాడుల విస్తృతిని మరింత పెంచాయని ఆయన పేర్కొన్నారు. దీంతో అంతరాయాలు కలిగే అవకాశాలు అధికమవుతున్నాయి. వీటి పరిధి డాటా భద్రత నుంచి మానవ భద్రత వైపు మారుతున్నదని స్పష్టమవుతున్నదని ఆయన పేర్కొన్నారు. మీరు ఒక జాతీయ రహదారిపై గంటకు 120 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తున్నప్పుడు అకస్మాత్తుగా మీ కారు స్టీరింగ్ మీ చేతి కంట్రోల్ నుంచి తప్పిపోయినప్పుడు. .మీ బ్యాంక్ ఖాతాలో ఎంత నగదు ఉందో గుర్తుకు రాదు కానీ..మీ జీవితం ప్రమాదంలో ఉన్నదనే ఆందోళన నెలకొంటుందన్నారు. కానీ, ప్రస్తుతం సైబర్‌సెక్యూరిటీ డాటా సెక్యూరిటీ నుంచి మానవ భద్రతగా మారుతున్నదని ఆయన అభిప్రాయపడ్డారు.

నయా రెనో డస్టర్

హైదరాబాద్, మార్చి 28: రెనో నయా డస్టర్‌ను రాష్ట్ర మార్కెట్లోకి విడుదల చేసింది. ఈ కారు రూ.10.49 లక్షల నుంచి రూ.18.09 లక్షల లోపు లభించనున్నది. ఎకో ఎల్ఈడీ హెడ్ ల్యాంప్స్, రిమోట్ కీలెస్ ఎంట్రీ, 35 భద్రత ఫీచర్లలో భాగంగా ఆరు ఎయిర్ బ్యాగ్‌లు, టీపీఎంఎస్, హెచ్ఎస్ఏ, ఈఎస్‌పీ, వైర్‌లెస్ స్మార్ట్‌ఫోన్, రియర్ వ్యూ కెమెరా, ఎలక్ట్రిక్ పానోరమిక్ సన్‌రూఫ్ వంటి ఫీచర్స్‌తో తయారు చేసింది.

HETERO

సెమాగ్లుటైడ్ ఎగుమతులు ఆరంభించిన హెటిరో

హైదరాబాద్, మార్చి 28: ప్రముఖ ఫార్మా దిగ్గజం హెటిరో మరో ఔషధాల ఎగుమతులను ప్రారంభించింది. మధుమేహం, ఊబకాయం చికిత్సలో వాడే జనరిక్ ఔషధం సెమాగ్లుటైడ్ ఇంజెక్షన్ల ఇతర దేశాలకు ఎగుమతులను ప్రారంభించినట్టు కంపెనీ ప్రకటించింది. ఈ మందులను ట్రూగ్లిక్స్, రోల్మోడ్జ్, మోటోజీ బాండ్ల పేరుతో విక్రయించనున్న ఈ ఔషధాలను ఆఫ్రికా, ఆసియా, మధ్య తూర్పు దేశాలకు ఎగుమతి చేస్తున్నట్టు కంపెనీ ఎండీ వంశీకృష్ణ బండి తెలిపారు. ప్రస్తుతం కొన్ని దేశాలకు మాత్రమే ఎగుమతి చేస్తున్న సంస్థ.. దశల వారీగా వీటిని 75 దేశాలకు ఎగుమతి చేయనున్నట్టు ప్రకటించారు.

పేరుకే ఎంఎస్ఎంఈ పాలసీ..!

జీవోల ఊసెత్తని రాష్ట్ర సర్కార్

రెండు సంవత్సరాలు గడిచినా అమలుకు నోచని వైనం

త్వరలోనే ఉత్తర్వులిస్తామని అసెంబ్లీలో ప్రభుత్వ వివరణ



హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ) : ఎంఎస్ఎంఈ రంగం అభివృద్ధి విషయంలో ప్రభుత్వ వైఖరి ఆరంభశూరత్వంగా మారింది. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల(ఎంఎస్ఎంఈ) రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నూతన పాలసీని ప్రవేశపెట్టి రెండేండ్లు కావాస్తున్నా ఇంతవరకు ఉత్తర్వులు విడుదల చేయకపోవడమే ఇందుకు నిదర్శనం. చిన్నతరహా యూనిట్లు నెలకొల్పాలనుకునే వారు ప్రభుత్వ ఉత్తర్వులకోసం వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎంఎస్ఎంఈ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు కొత్త పాలసీని ప్రవేశపెడతామని ప్రకటించింది. సెప్టెంబర్ 2024లో ఎంఎస్ఎంఈ పాలసీ ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా రాబోయే ఐదేండ్లలో రూ.4వేల కోట్ల పెట్టుబడితో 25వేల కొత్త యూనిట్లు, 5 లక్షల ఉద్యోగాలు సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు ప్రకటించింది. పరిశ్రమలకు అవసరమైన భూములు, రుణాలు, ముడి సరుకు, సాంకేతికత, నైపుణ్యం, మార్కెటింగ్ తదితర ఆరు ప్రధాన సవాళ్లను పరిష్కరించడంపై ఈ పాలసీ దృష్టి సారిస్తున్నట్టు తెలిపారు. ఇందులో ముఖ్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం అమలుచేసిన టీ-ఐడియా, టీ-ప్రైడ్ పథకాల్లోని ప్రోత్సహకాలనే కాస్త అటుఇటుగా మార్చి అమలుచేయాలని నిర్ణయించారు. మూలధన పెట్టుబడిపై 25శాతం వరకు సబ్సిడీలు, ప్రత్యేక ఎంఎస్ఎంఈ పార్క్‌ల ఏర్పాటు, ప్రైవేట్ ఫ్లాటెడ్ ఫ్యాక్టరీల ఏర్పాటు, సిడ్బీతో కలిసి మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలను చేర్చారు. అంతేకాకుండా ఎస్సీ, ఎస్టీలకు కేటాయించే భూములకు సంబంధించి గతంలో 33శాతం రాయితీ ఉండగా, కొత్త పాలసీలో దాన్ని 50 శాతానికి పెంచారు. జీఎస్‌డీపీలో ఎంఎస్ఎంఈల వాటాను 10 శాతం పెంచాలని, స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించాలని, ఈ-కామర్స్ ద్వారా మార్కెట్ అవకాశాలను విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. టాటా టెక్నాలజీస్ సౌజన్యంతో రాష్ట్రంలోని 65 ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు(ఏటీసీ)గా మార్చడం ద్వారా పరిశ్రమలకు నైపుణ్యం గల సిబ్బందిని అందించాలని నిశ్చయించారు. స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుచేసి పరిశ్రమలకు నైపుణ్యాలను వృద్ధి చేయాలని నిర్ణయించారు.

కేంద్ర పథకాలు తమవిగా చెప్పుకుంటున్న సర్కార్

అయితే, పాలసీకి సంబంధించి ఘనంగా మార్గదర్శకాలు రూపొందించిన ప్రభుత్వం, ఇంతవరకు ఉత్తర్వులు జారీ చేయలేదు. ఇటీవల అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఎంఎస్ఎంఈల ప్రోత్సాహానికి తీసుకుంటున్న చర్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దీనిపై ప్రభుత్వం స్పందిస్తూ.. నూతన ఎంఎస్ఎంఈ పాలసీని తెచ్చినట్టు, మార్గదర్శకాలు కూడా రూపొందించినట్టు, త్వరలోనే ఉత్తర్వులు జారీచేస్తామని వెల్లడించింది. అంతేకాకుండా పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ, పీఎం విశ్వకర్మ తదితర కేంద్ర ప్రభుత్వ పథకాలతో ఎంఎస్ఎంఈలకు సహకారం అందిస్తున్నట్టు తెలిపింది. పాలసీ ప్రవేశపెట్టి రెండేండ్లు కావస్తున్నా ఇంతవరకు ఉత్తర్వులు జారీచేయకపోగా, కేంద్ర ప్రభుత్వ పథకాలను తాము అమలు చేస్తున్నట్టు చెప్పడం విమర్శలకు తావిస్తున్నది. కొత్త పాలసీ అమల్లోకి వస్తే అదనపు ప్రయోజనాలు పొందవచ్చనే ఉద్దేశంతో చాలామంది పారిశ్రామికవేత్తలు ఎదురుచూస్తున్నారు.

ఎంఎస్ఎంఈ పాలసీ-2024 ప్రధానాంశాలు..

- ఆర్థిక ప్రోత్సాహకాలు, స్థిర మూలధన పెట్టుబడిపై 25శాతం సబ్సిడీ.
- మహిళలు, ఎస్సీ/ఎస్టీ పారిశ్రామికవేత్తలకు 20శాతం అదనపు సబ్సిడీ.
- మౌలిక సదుపాయాలు, ఎంఎస్ఎంఈ పార్క్‌లు, ప్రైవేట్ ఫ్లాటెడ్ ఫ్యాక్టరీలు.
- నిధుల లభ్యత, కష్టాల్లో ఉన్న పరిశ్రమలకు మద్దతుగా ప్రత్యేక 'నిధి' ఏర్పాటు.
- సిడ్బీతో కలిసి ప్రత్యేక సదుపాయాలు
- 65 ఐటీఐలను టాటా గ్రూప్‌తో కలిసి అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు
- పరిశ్రమల శాఖలో ప్రత్యేక విభాగం(డెడికేటెడ్ వింగ్), 40 కీలక పారామీటర్లతో నిరంతర పర్యవేక్షణ.

ముఖ్య లక్ష్యాలు..

- రాష్ట్ర జీఎస్డీపీలో ఎంఎస్ఎంఈల వాటా10 శాతం పెంచడం.
- స్థానిక తయారీని ప్రోత్సహించడం, ఈ-కామర్స్ ద్వారా మార్కెట్ అవకాశాలు విస్తరించడం.
- రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సీఎఫ్‌సీ మరియు సీబీటీఎఫ్‌ల బలోపేతం.


Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, H.Nos. 9-87/3, 9-87/1, Adj to Jenvi Conventions, Tumkunta, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.



వాలీబాల్ నేపథ్యంలో బరి

వరుణ్‌తేజ్ కథానాయకుడిగా ఆయన సోదరి నిహారిక నిర్మిస్తున్న తాజా చిత్రం 'బరి' శనివారం ప్రారంభమైంది. యదువంశీ దర్శకుడు. ఈ సినిమా ఓపెనింగ్‌కు అగ్ర నటుడు పవన్‌కల్యాణ్ ముఖ్యఅతిథిగా విచ్చేసి తొలి సన్నివేశానికి క్లాప్‌నిచ్చారు. మైత్రీ మూవీస్ నవీన్ యెర్నేని కెమెరా స్విఛాన్ చేశారు. వాలీబాల్ నేపథ్యంలో సాగే చిత్రమిదని, తాను ఇప్పటికే ప్రాక్టీస్‌లో ఉన్నానని, సోదరి నిర్మిస్తున్న ఈ సినిమా తనకెంతో ప్రత్యేకమని వరుణ్‌తేజ్ అన్నారు. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో నడిచే స్పోర్ట్స్ డ్రామా ఇదని నిహారిక కొణిదెల పేర్కొన్నది. త్వరలో రెగ్యులర్ షూటింగ్ మొదలుపెట్టి వచ్చే సంక్రాంతికి విడుదల చేస్తామని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: ధనుష్ భాస్కర్, సంగీతం: అనుదీప్‌దేవ్, నిర్మాణ సంస్థ: పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్, నిర్మాత: నిహారిక కొణిదెల, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: యదువంశీ.

'ఫౌజీ' విడుదల అప్పుడేనా?



అగ్ర కథానాయకుడు ప్రభాస్ నటిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రాల్లో 'ఫౌజీ' ఒకటి. హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామాలో నూతన నటి ఇమాన్వీ కథానాయిక. 400కోట్ల భారీ బడ్జెట్‌తో మైత్రీ మూవీమేకర్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్ ఆర్ఎఫ్‌సీలో శరవేగంగా జరుగుతున్నది. ప్రభాస్ లేని సన్నివేశాలను దర్శకుడు హను రాఘవపూడి చిత్రీకరిస్తున్నారు. ఇప్పటికే 70శాతం ఈ సినిమా చిత్రీకరణ పూర్తి చేసుకున్నది. ఇందులో ప్రభాస్ బ్రిటీష్ సైనికుడిగా నటిస్తున్న విషయం తెలిసిందే. బ్రిటీష్ కాలపు కథతో సాగే ఈ పీరియడ్ డ్రామాలో అద్భుతమైన ప్రేమకథ కూడా ఉంటుందనేది ఇన్‌సైడ్ టాక్. స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా ఆగస్ట్ 14న కానీ, లేక దసరాకు గానీ పానిండియా స్థాయిలో తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ, బెంగాలీ భాషల్లో ఈ సినిమాను విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. మిథున్ చక్రవర్తి, అనుపమ్‌ఖేర్, జయప్రద, భానుచందర్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: విశాల్ శేఖర్, నిర్మాతలు: నవీన్ యర్నేని, వై.రవిశంకర్.

కాస్త ఆలస్యంగా రానున్న 'లెనిన్'

అక్కినేని అఖిల్ హీరోగా రూపొందుతున్న రూరల్ ఎమోషనల్ యాక్షన్ డ్రామా 'లెనిన్' చిత్రాన్ని మే 1న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని నిర్మాతలు అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ భావించారు. అయితే.. ఏప్రిల్ 30న రామ్‌చరణ్ 'పెద్ది' సినిమా విడుదల కానుండటంతో 'లెనిన్' విడుదలను జూన్ 26కు మేకర్స్ వాయిదా వేశారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇరు చిత్రాల నిర్మాతలు పరస్పరం గౌరవించుకుంటూ, థియేటర్ల లభ్యతను కూడా దృష్టిలో పెట్టుకుని 'లెనిన్' చిత్రం విడుదలను జూన్ 26కు వాయిదా వేసినట్టు ప్రకటనలో నిర్మాతలు పేర్కొన్నారు. రామ్‌చరణ్, అఖిల్ అక్కినేని మధ్య ఉన్న ఆత్మీయబంధం కూడా ఈ నిర్ణయానికి కారణమని మేకర్స్ ప్రకటనలో పేర్కొన్నారు. మురళీకిశోర్ అబ్బూరు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. ఈ చిత్రానికి కెమెరా: లియోన్ బ్రిట్టో, సంగీతం: థమన్.ఎస్, సమర్పణ: అన్నపూర్ణ స్టూడియోస్, నిర్మాణం: మనం ఎంటర్‌ప్రైజెస్ ఎల్ఎల్‌పి, సితార ఎంటర్‌టైన్మెంట్స్.



అందాల చిచ్చుబుడ్డి



అడివి శేష్, మృణాల్ ఠాకూర్ జంటగా నటిస్తున్న క్రైమ్ డ్రామా 'డెకాయిట్'. షానియల్ డియో దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా ఏప్రిల్ 10న ప్రేక్షకుల ముందుకురానుంది. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా ప్రచార చిత్రాలు ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచాయి. ఈ నేపథ్యంలో శనివారం ఈ సినిమా నుంచి రెండో పాట 'చిచ్చుబుడ్డి'ని విడుదల చేశారు. ఇందులో అడివి శేష్ డ్యాన్స్‌తో అదరగొడుతూ హైఎనర్జీతో కనిపించారు. సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో జానపద శైలి బీట్‌తో ఈ పాటను కంపోజ్ చేశారు. భాస్కరభట్ల సాహిత్యం ఆకట్టుకునేలా ఉంది. మాజీ ప్రేమికుల నేపథ్యంలో సాగే యాక్షన్ థ్రిల్లర్ చిత్రమిదని, ప్రేమ కథ హార్ట్‌టచింగ్‌గా ఉంటుందని దర్శకుడు తెలిపారు. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియా యార్లగడ్డ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నది. తెలుగు, హిందీ భాషల్లో రూపొందుతున్న ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేయబోతున్నారు.

వాళ్లే నిజమైన సూపర్‌హీరోస్



నచ్చిన పని చేస్తూ, లక్ష్యాన్ని సాధించడంలోనే విజయం ఉందని చాలామంది అంటూ వుంటారు. కానీ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో బాలీవుడ్ నటి ప్రియాంక చోప్రా అసలు 'విజయం' అనే కాన్సెప్ట్‌కే కొత్త అర్థం చెప్పారు. ఆ ఇంటర్వ్యూలో ప్రియాంక మాట్లాడుతూ 'నచ్చిన పని చేసే అవకాశం అందరికీ దొరకదు. ఈ ప్రపంచంలో ఇష్టం లేని పనిచేస్తూ బ్రతుకుతున్నవాళ్లే ఎక్కువ. బాధ్యతలు మనిషిని కఠినంగా మారుస్తాయి. మనసు చంపుకునేలా చేస్తాయి. అలాంటి పరిస్థితుల్లోనూ ముఖంపై చెరగని చిరునవ్వుతో ఉంటారే.. వాళ్లు నిజమైన సూపర్‌హీరోస్. అలాంటి వారు పడే కష్టం. వారు చూపే అంకితభావం నా దృష్టిలో గొప్ప విజయం. కేవలం ఇష్టమైన పనులు చేస్తూ లక్ష్యాన్ని సాధించేవారే విజేతలు కాదు. ఇష్టాయిష్టాలను పక్కనపెట్టి బాధ్యతల కోసం ముందుకు సాగే వారు కూడా విజేతలే' అంటూ చెప్పుకొచ్చారు ప్రియాంక చోప్రా. ఇప్పుడీ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

అన్‌ఫాలో వెనకున్న మతలబు ?



తనకు దేశవ్యాప్తంగా గుర్తింపు తీసుకువచ్చిన 'కాంతార' ఫ్రాంఛైజీ నిర్మాణ సంస్థతో పాటు రెండో భాగంలో హీరోయిన్‌గా నటించిన రుక్మిణి వసంత్ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలను హీరో రిషబ్‌శెట్టి అన్‌ఫాలో చేయడం కన్నడ ఇండస్ట్రీలో చర్చనీయాంశమయింది. ఈ ఖాతాలతో పాటు తనకు సుదీర్ఘ కాలంగా మిత్రుడిగా ఉన్న దర్శకుడు, నటుడు రాజ్ బి శెట్టి ఇన్‌స్టా ఖాతాను కూడా రిషబ్‌శెట్టి అన్‌ఫాలో చేయడం అందరిని ఆశ్చర్యపరచింది. 'కాంతార' టీమ్‌తో రిషబ్‌కు గత కొంతకాలంగా విభేదాలున్నాయని కన్నడనాట వార్తలొస్తున్నాయి. వీటికి బలం చేకూరుస్తూ నిర్మాణ సంస్థతో పాటు చిత్ర కథానాయికను రిషబ్‌శెట్టి అన్‌ఫాలో చేయడం హాట్‌టాపిక్‌గా మారింది. అయితే 'కాంతార' ప్రొడ్యూసర్ విజయ్ కిరంగదూర్ ఖాతాను మాత్రం రిషబ్‌శెట్టి ఫాలో అవుతున్నాడు. ఈ నేపథ్యంలో రిషబ్‌శెట్టి అన్‌ఫాలో కాంట్రవర్సీ సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. అయితే ఈ విషయంపై ఇప్పటివరకు రిషబ్‌శెట్టి కానీ, హోంబలే ఫిల్మ్స్ కానీ ఎలాంటి వివరణ ఇవ్వలేదు. దీంతో ఈ వివాదం వెనక మతలబు ఏమిటోనని నెటిజన్లు తీవ్రంగా చర్చించుకుంటున్నారు. రిషబ్‌శెట్టి ప్రస్తుతం పాన్ ఇండియా 'జై హనుమాన్' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు.

క్రికెట్‌లా రేసింగ్‌కు గుర్తింపు రావాలి



- 'బైక్ అనేది ప్రతి ఒక్కరికి ఓ ఎమోషన్. ఈ సినిమాలో రేసింగ్‌తో పాటు ఫ్యామిలీ ఎమోషన్స్, తండ్రీ కొడుకుల అనుబంధం ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అవుతుంది' అన్నారు దర్శకుడు అభిలాష్ రెడ్డి. శర్వానంద్ హీరోగా యూవీ క్రియేషన్స్ నిర్మించిన 'బైకర్' సినిమా ఏప్రిల్ 3న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా శనివారం దర్శకుడు అభిలాష్ రెడ్డి సినిమా విశేషాలను పంచుకున్నారు.
- రియల్ రేసర్స్‌తో రేసింగ్ సీక్వెన్స్ తీశాం. కేవలం యాక్షన్ ఎపిసోడ్స్‌కే 60రోజుల సమయం పట్టింది. ఈ సినిమా రెండు టైమ్ లైన్స్‌లో జరుగుతుంది. 90స్‌లో టూ స్ట్రోక్ బైక్స్ ఉండేవి. ఇప్పుడవి రావడం లేదు. వాటిని డిజైన్ చేయడానికి చాలా టైం తీసుకుంది.
- ఈ సినిమా కోసం న్యూజిలాండ్, ఆస్ట్రేలియా నుంచి రేసర్స్‌ని రప్పించాము. ఇండోనేషియాలో రేసింగ్ సీక్వెన్స్ షూట్ చేశాం. రేసింగ్ స్పోర్ట్స్ ఇండియాలో ఎప్పటి నుంచో ఉంది. శ్యామ్ కొఠారి అనే వెటరన్ రేసర్ ఉన్నారు. కానీ ఆయనకు క్రికెట్‌లో కపిల్‌దేవ్‌కి వచ్చినంత గుర్తింపు రేసింగ్‌లో రాలేదు. రేసింగ్‌కు కూడా ఆ స్థాయి గుర్తింపు తీసుకురావాలన్నదే ఈ సినిమా అభిమతం. ఫిక్షనల్ స్టోరీ అయినప్పటికీ రేసింగ్‌లో జరిగిన కొన్ని నిజమైన సంఘటనల్ని స్ఫూర్తిగా తీసుకున్నాం.
- ఇందులో రాజశేఖర్ ఫాదర్ కమ్ కోచ్ పాత్రలో కనిపిస్తారు. ఆయన చుట్టే కథ తిరుగుతుంది. శర్వానంద్ ఈ సినిమా కోసం 23 కిలోల బరువు తగ్గారు. ఆరు నెలల పాటు తీవ్రంగా శ్రమించి ఫిజికల్‌గా, మెంటల్‌గా ప్రిపేర్ అయ్యారు. సినిమాలో ఆయన పర్‌ఫార్మెన్స్ అద్భుతంగా ఉంటుంది. తన కెరీర్‌లో బెస్ట్ ఫిల్మ్ అని శర్వానంద్ చెప్పారు.
- నాకు మిడిల్‌క్లాస్ ఎమోషన్స్ చాలా ఇష్టం. ఎలాంటి సినిమా చేసినా వాటిని మిస్ చేయను. ఈ సినిమా ట్రైలర్ బాగుందని ప్రభాస్ ప్రశంసించారు. దిల్‌రాజుకు కూడా బాగా నచ్చింది. నా తదుపరి చిత్రాన్ని ఆయనతోనే చేస్తున్నా.

నాగార్జున జోడీగా?

'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రంతో తెలుగులో తొలిసారి బ్లాక్ బస్టర్ సక్సెస్‌ను సాధించింది ఐశ్వర్యరాజేష్. ఈ సినిమా తర్వాత తెలుగులో ఈ భామకు అవకాశాలు బాగా వస్తాయనుకున్నారు. అయితే సినిమాల ఎంపికలో సెలెక్టివ్‌గా ఉండటం, తమిళంలో వరుస కమిట్‌మెంట్స్ వల్ల ఏడాదికాలంగా టాలీవుడ్‌కు దూరంగా ఉంటున్నది ఐశ్వర్యరాజేష్. తాజా సమాచారం ప్రకారం ఈ తెలుగందం తెలుగులో మరో బంపరాఫర్‌ను దక్కించుకున్నట్లు తెలిసింది. నాగార్జున వందో చిత్రంలో ఐశ్వర్యరాజేష్ కథానాయికగా ఖరారైందని ఫిల్మ్‌నగర్ టాక్. 'కింగ్100' అనే టైటిల్‌తో రూపొందుతున్న ఈ సినిమా శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్నది. రా.కార్తీక్ దర్శకత్వంలో యాక్షన్ కలబోసిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్నది. ఈ సినిమాలో కథానాయిక కోసం కొన్ని నెలలుగా అన్వేషణ జరుగుతున్నది. చివరగా చిత్ర బృందం ఐశర్వరాజేష్ వైపు మొగ్గుచూపిందని చెబుతున్నారు. ఈ సినిమాలో సీనియర్ కథానాయిక టబు కీలక పాత్రలో కనిపించనుంది. త్వరలో 'కింగ్100' షూట్‌లో ఐశ్వర్యరాజేష్ జాయిన్ అవుతారని వార్తలొస్తున్నాయి. అయితే ఈ విషయంలో చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.



కుటుంబ ప్రేక్షకులకు నచ్చిన 'యూత్'



కెన్ కరునాస్, అనిష్మ అనిల్‌కుమార్, దేవదర్శిని చేతన్, సూరజ్ వెంజరముడు, ప్రియాన్షి యాదవ్, మీనాక్షి దినేష్ ప్రధాన పాత్రధారులుగా రూపొందిన యువతరం చిత్రం 'యూత్'. కెన్ కరునాస్ అండ్ గ్యాంగ్ దర్శకత్వంలో, కరుపయ్య సి.రామ్, సులోచన కుమార్ నిర్మించిన ఈ చిత్రం ఇటీవలే విడుదలై థియేటర్లలో ప్రదర్శితమవుతున్నది. ఈ నేపథ్యంలో ఈ సినిమా సక్సెస్‌మీట్‌ని హైదరాబాద్‌లో నిర్వహించారు. హీరో శర్వానంద్, డైరెక్టర్ వశిష్ట, నిర్మాత ధీరజ్ మొగిలినేని ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసి చిత్రబృందానికి అభినందనలు అందించారు. పిల్లలు తమ తల్లిదండ్రులను, తల్లిదండ్రులు తమ పిల్లల్నీ అర్థం చేసుకోవాలనే సందేశంతో రూపొందిన ఈ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ అందరికీ నచ్చిందని, థియేటర్లన్నీ యూత్‌తో నిండిపోతున్నాయని నిర్మాతలు ఆనందం వెలిబుచ్చారు. తమిళంతోపాటు తెలుగులోనూ ఈ సినిమా సక్సెస్ కావడం చాలా ఆనందంగా ఉందని, కుటుంబ సమేతంగా చూడదగ్గ సినిమా ఇదనీ దర్శకుడు, హీరో కెన్ కరునాస్ అన్నారు. ఇంకా చిత్రబృందం అంతా మాట్లాడారు.

వినోదాన్ని పంచే 'అనుమాన పక్షి'

రాగ్ మయూర్ హీరోగా 'డీజే టిల్లు' ఫేం విమల్ కృష్ణ దర్శకత్వంలో రూపొందుతున్న విభిన్న కథాచిత్రం 'అనుమాన పక్షి'. రాజీవ్ చిలకా, రాజేష్ జగ్తియాని, హిరాచంద్ దండ్ నిర్మాతలు. నిర్మాణం చివరి దశలో ఉన్న ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్మాతలు మ్యూజిక్ ప్రమోషన్స్ మొదలుపెట్టారు. ఇందులో భాగంగా ఈ సినిమా నుంచి 'గులాబ్ జామ్' సాంగ్‌ను లాంచ్ చేశారు. కిట్టు విస్సాప్రగడ రాసిన ఈ పాటను శ్రీచరణ్ పాకాల స్వరపరచగా, రమణ గోగుల ఆలపించారు. ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్‌ని హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. అగ్ర నిర్మాత దిల్ రాజు ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. దర్శకుడు విమల్ కృష్ణ మాట్లాడుతూ 'ఇది పూర్తి వినోదాత్మక చిత్రం. చిన్న సైకలాజికల్ సస్పెన్స్ కూడా ఉంటుంది. పనిచేసిన వారంతా ప్రాణం పెట్టారు. రాగ్ మయూర్ ఈ సినిమాతో స్టార్ అవుతాడు. కచ్చితంగా థియేటర్లలో మంచి ఫన్ రైడ్ ఈ సినిమా' అని నమ్మకంగా చెప్పారు. ఏ ఇన్స్పిరేషనూ లేని ఒరిజినల్ కంటెంట్‌తో రూపొందుతున్న సినిమా 'అనుమాన పక్షి' అని, తన కెరీర్‌లోనే తొలిదైన 'గులాబ్ జామ్' పాటను రమణగోగుల ఆలపించడం ఆనందంగా ఉందని హీరో రాగ్ మయూర్ అన్నారు. ఇంకా సీనియర్ నటి రాశి, హీరోయిన్ మెరీన్‌లతో పాటు చిత్రబృందమంతా మాట్లాడారు. ఈ చిత్రానికి కెమెరా: సునీల్‌కుమార్ నామా, సహ నిర్మాత: భరత్ లక్ష్మీపతి.



పౌరాణిక దృశ్యకావ్యంగా 'మహాకాళి'



'హను-మాన్'ఫేం ప్రశాంత్‌వర్మ సినిమాటిక్ యూనివర్స్(PVCU) నుంచి వస్తున్న కాల్పనిక పౌరాణిక దృశ్యకావ్యం 'మహాకాళి'. ప్రశాంత్‌వర్మ షోరన్నర్‌గా, పూజా కొల్లూరు దర్శకత్వంలో రూపొందుతున్న ఈ ప్రతిష్ఠాత్మక చిత్రానికి ఆర్కే దుగ్గల్, రివాజ్ రమేష్ దుగ్గల్ నిర్మాతలు. ఈ చిత్రం వందరోజుల షూటింగ్‌ను విజయవంతంగా పూర్తి చేసుకోగా, చివరి 40 రోజుల షెడ్యూల్ హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఈ సినిమాలో శుక్రాచార్యుడిగా కీలక పాత్రను బాలీవుడ్ వెర్సటైల్ యాక్టర్ అక్షయ్‌ఖన్నా పోషిస్తున్న విషయం తెలిసిందే. రీసెంట్‌గా ఆయన.. తన భాగం చిత్రీకరణంతా పూర్తి చేశారు. మరోవైపు పలు స్టూడియోల్లో ఈ సినిమాకు సంబంధించిన వీఎఫ్ఎక్స్ పనులు జరుగుతున్నాయి. త్వరలోనే సినిమా విడుదల తేదీని ప్రకటించనున్నట్టు నిర్మాతలు శనివారం ప్రకటన విడుదల చేశారు. 'మహాకాళి'గా భూమిశెట్టి టైటిల్‌రోల్ పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సురేష్ రగుతు, సంగీతం: స్మరణ్‌సాయి, నిర్మాణం: RKD స్టూడియోస్.



హారర్ థ్రిల్లర్ 'విచిత్ర'

జ్యోతి పూర్వాజ్, రవి, శ్రేయ తివారి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న హారర్ థ్రిల్లర్ 'విచిత్ర'. స్వీయ నిర్మాణ దర్శకత్వంలో సైఫుద్దీన్ మాలిక్ రూపొందిస్తున్నారు. మే 22న ఈ చిత్రాన్ని విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ తెలిపారు. మదర్ సెంటిమెంట్ ప్రధానంగా సాగే థ్రిల్లర్ చిత్రమిదని, ఫ్యామిలీ ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుందని దర్శకుడు తెలిపారు. బేబీ హర్షిణి, రవిప్రకాష్, సూర్య, ఛత్రపతి శేఖర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: నిజాని అంజన్, నిర్మాత, దర్శకత్వం: సైఫుద్దీన్ మాలిక్.